ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 3
జిల్లా వార్తలు
బుధవారం 24, ఏప్రిల్ 2024

ఐదేళ్ల వైసీపీ పాలనలో తాగునీటి సరఫరా వ్యవస్థపై తీవ్ర నిర్లక్ష్యమే కొనసాగింది. ఆ కాలం, ఈ కాలమని తేడాలేకుండా జిల్లాలోని పశ్చిమాన నీటికోసం జనం అల్లాడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కొత్త పథకాలు అడుగు ముందుకు పడలేదు. కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ మిషన్ (జేజేఎం) పనులు నిధుల కొరతతో నీరసించాయి. కీలకమైన వాటర్‌గ్రిడ్ ఊసే కరువైంది. ఇక పట్టణాలకు మంజూరైన తాగునీటి పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లోని నీటి పథకాలు, సీపీడబ్ల్యూ స్కీంల నిర్వహణను గాలికొదిలేశారు. మరోవైపు నీటికోసం అల్లాడుతున్న ప్రజలకు అరకొరగానే ట్యాంకర్లతో సరఫరా జరుగుతోంది. వాటికి కూడా భారీగా బిల్లులు పెండింగ్ ఉండటం, కాంట్రాక్టర్లు నిత్యం ఆందోళనకు దిగడం, సరఫరా ఆపడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది.


ఒంగోలులోని శివారు కాలనీలో నీటి డ్రమ్మును రిక్షాపై పెట్టుకొని లాక్కెళ్తున్న తల్లీకూతురు


నీటి కోసం రాస్తారోకో చేస్తున్న ఐనముక్కల దాసరి కాలనీ చిన్నారులు (ఫైల్)

గొంతెండుతోంది!

- పశ్చిమాన దాహం కేకలు
- పలుచోట్ల ట్యాంకర్ల నీరే దిక్కు
- అవి కూడా అరకొరే..
- వాటర్‌గ్రిడ్ ఊసే కరువు
- పట్టణ పథకాలదీ అదే పరిస్థితి
- సీపీడబ్ల్యూ స్కీంల నిర్వహణ గాలికి
- నీటి బిల్లులు భారీగా పెండింగ్
- వైసీపీ పాలనలో నిలువెల్లా నిర్లక్ష్యమే
- పాతాళానికి పోతున్న భూగర్భ జలం

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో నీటి సరఫరా పర్యవేక్షణ నడుస్తోంది. ఆ పరిధిలో 28 సీపీడబ్ల్యూ స్కీంల ద్వారా 836 ఆవాసాలకు నీటి సరఫరా జరుగుతోంది. ఇతర ప్రాంతాల్లో 2,858 గ్రామస్థాయి పథకాలు, డీప్‌బోర్ల ఆధారంగా ఉండే సింగిల్ స్కీంలు, అలాగే మరో 14,729 చేతిపంపులు ఉన్నాయి. మరో 137 తాగునీటి చెరువులు ఉండగా అధికభాగం పథకాలకు సాగర్ నీరే ఆధారం. పశ్చిమంలో భూగర్భ జలాలు, తూర్పున కొన్నిచోట్ల గుండ్లకమ్మ కొమ్మమూరు కాలువల ఆధారంగా ఉన్నాయి. వేసవి వస్తే వీటిలో అత్యధికం నీరు లేక నిత్యం ప్రజలు అవస్థ పడుతున్నారు. పశ్చిమాన అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ప్రస్తుతం కూడా అధికారికంగా 142 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా జరుగుతోంది. వాస్తవంగా మరో 100 ఆవాసాలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే నీటి సరఫరా ఖర్చు తగ్గించుకునేందుకు ప్రభుత్వం తప్పనిసరైన చోట అది కూడా కేవలం 40 లీటర్లతో సరిపెడుతోంది. ఈ ఐదేళ్లలో దాదాపు రూ.250 కోట్ల వరకు ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఖర్చు చేయాల్సి రావడం పశ్చిమ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రతను పట్టిచూపుతోంది. ఇక సీపీడబ్ల్యూ స్కీంలు, ఇతర సింగిల్ విలేజ్ పథకాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. సకాలంలో ఇందుకు సరిపడా ప్రభుత్వం నిధులు ఇవ్వక పథకాలు సరిగా పనిచేయడం లేదు. ఆమేరకు గ్రామాలలో నీటి సరఫరా తగ్గిపోతోంది. దాదాపు రూ.34 కోట్ల మేర ఈ పథకాలకు, మరో రూ.40 కోట్ల వరకు ట్యాంకర్లతో సరఫరాకు పెండింగ్ బిల్లులు ఉండటం ప్రభుత్వం తాగునీటికి ఇస్తున్న ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తోంది.


పొలంలోని బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న బేస్తవారపేట మండలం కొత్తపల్లి ఎస్సీ కాలనీ వాసులు

వాటర్ గ్రిడ్‌ను వదిలేశారు

వాటర్‌గ్రిడ్ పరిస్థితి కూడా అలాగే ఉంది. పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, కనిగిరి, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెలిగొండ నీరు ఆధారంగా గత టీడీపీ ప్రభుత్వం రూ.1,050 కోట్లతో భారీ పథకాన్ని మంజూరుచేసింది. అనంతరం టెండర్లు ఖరారు చేసి శంకుస్థాపన కూడా చేసింది. అయితే వైసీపీ వచ్చాక మార్పులు, చేర్పులు చేసి రివర్స్ టెండర్ల పేరుతో మళ్లీ టెండర్లు పిలిచారు. చివరకు రూ.1,290 కోట్లతో 2023 జనవరిలో టెండర్లు ఖరారు చేశారు. అయితే ఇంతవరకూ పనులు ప్రారంభం కాలేదు.

జేజేఎంలో అంతా జాప్యమే

తీవ్ర నీటిసమస్య ఉన్న జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన జేజేఎం, అలాగే గత టీడీపీ ప్రభుత్వ కాలంలో మంజూరైన వాటర్‌గ్రిడ్ పథకాలు వరం లాంటివి. అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో 2024 మార్చి ఆఖరుకు ఇంటింటికీ నీటి కొళాయి ఏర్పాటు లక్ష్యంగా కేంద్రం జేజేఎంను 2019 అక్టోబర్‌లో ప్రారంభించింది. జిల్లాలో 4.98 లక్షల కుటుంబాలు ఉండగా అప్పటికి 1.19 లక్షల కుటుంబాలకు కొళాయిల ఏర్పాటు లక్ష్యం. అయితే గత మార్చితో పథకం పూర్తి సమయం ముగిసినా ఈలోపు కేవలం 2.02 లక్షల కుటుంబాలకు మాత్రమే కొళాయిలు ఏర్పాటు చేయగా ఇంకా ఇంచుమించు లక్షా70వేల కుటుం బాలకు ఇవ్వాలి. పథకం పూర్తి చివరి ఏడాది అయిన 2023-24లో చూస్తే 2023 ఏప్రిల్ 1 నాటికి ఇంకా లక్షా 77వేల ఇళ్లకు కొళాయిలు ఇవ్వాల్సి ఉండ గా కేవలం 65 వేలకు మాత్రమే ఇచ్చారు. జిల్లాలో జలజీవన్ మిషన్ కింద రూ.659.53 కోట్ల వ్యయంతో 2,428 పనులు మంజూరు చేయగా పథ కం కాలపరిమితి పూర్తయినా కేవలం 1,703 పను లు మాత్రమే చేపట్టారు. అందులో 1,183 పనులు పూర్తయ్యాయి. 52 పురోగతిలో ఉన్నాయి. 725 పను లు అసలు ప్రారంభమే కాలేదని సమాచారం. ప్రభు త్వ వాటాధనం సకాలంలో ఇవ్వకపోవడం, పర్యవేక్షణ లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికారవర్గాల సమాచారం మేరకు మూడు మాసాల క్రితం డిజైన్లు అప్రూవ్ అయ్యాయి. ఇలా డిజైన్‌ల అనుమతికి ఐదేళ్లు పడితే ఇకపథకం పూర్తి ఎన్నటికి అన్నది ప్రశ్నార్థకమే. ఉప్పునీరు ప్రభావం ఉండే కొత్తపట్నం ప్రాంతంలో రక్షిత నీటి సరఫరాకు ఉద్దేశించిన రూ.35కోట్ల సూపర్ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు 2021 అక్టోబరులో సీఎం హామీ ఇచ్చినా ఇంతవరకూ కొలిక్కిరాలేదు.


పొదిలిలో పక్షం రోజులకు ఒకసారి వచ్చే సాగర్ నీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు (ఫైల్)

పట్టణాలలో పరిస్థితి దారుణం

పట్టణ ప్రాంతాల్లో పరిస్థితిని చూస్తే జిల్లాకేంద్రమైన ఒంగోలు నగరంలో మూడు రోజులకు ఒకసారి సరఫరా జరుగుతోంది. పొదిలి, కనిగిరి, ఎర్రగొండపాలెం, చీమకుర్తి, గిద్దలూరు మార్కాపురం, కంభం సింగరాయకొండ, పామూరు ఇలా ఏ పట్టణంలో చూసినా నీటికోసం జనం నిత్యం అల్లాడిపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగునకు వైసీపీ ప్రభుత్వ కాలంలో చర్యలు శూన్యమయ్యాయి. ఒంగోలుకు గత టీడీపీ ప్రభుత్వ కాలంలో అమృత్ పథకం కింద మంజూరు చేసిన రూ.123 కోట్ల పథకం చేటికీ పూర్తికాలేదు. అమృత్-2 కింద రూ.339.93 కోట్లతో జగన్ ప్రభుత్వం మంజూరు చేసిన తాగునీటి పథకం పనులు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. అలాగే ఇతర మునిసిపాలిటీల్లో చూస్తే ఎక్కడా ఏ ఒక్క పథకం పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. మొత్తంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో తాగునీటి వనరుల మెరుగుకు నిర్దిష్ట చర్యలు తీసుకున్న పరిస్థితి లేకపోగా జిల్లా ప్రజానీకం ప్రత్యేకించి పశ్చిమప్రాంత వాసులు గుక్కెడు నీటి కోసం గొంతెండి వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయడం నిత్యకృత్యంగా మారింది.

జై చెన్నకేశవ..





మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. చెన్నయ్య కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి స్వామివారు శ్రీమన్నారాయణమూర్తి అలంకారంలో నాలుగు మాడవీధుల్లో విహరించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు తిలకించి తరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంతం జై చెన్నకేశవ.. జైజై చెన్నకేశవ నామస్మరణతో మార్మోగింది. పలువురు ఉభయ దాతలు కల్యాణ సమయంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. - మార్కాపురం వన్‌టౌన్

రేపటితో ముగియనున్న నామినేషన్లు

- నేడు జనార్దన్, ఉగ్ర, అశోక్‌రెడ్డి
- రేపు బీఎన్, కందుల దాఖలు
- భారీ ర్యాలీలకు టీడీపీ శ్రేణుల ఏర్పాట్లు
- జోరుగా కూటమి అభ్యర్థుల ప్రచారం
- వైసీపీ నుంచి భారీగా చేరికలు

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్‌ల దాఖలు ఘట్టం గురువారంతో ముగియనుంది. ఈనెల 18నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారం మినహా మిగిలిన ఐదు రోజులు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. చివరి రెండు రోజులైన బుధ, గురువారాల్లో పెద్దసంఖ్యలో దాఖలు కానున్నాయి. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో ముగ్గురు టీడీపీ అభ్యర్థులు ఇప్పటికే భారీ ర్యాలీలు, సభలతో నామినేషన్లు వేశారు. మిగిలిన ఐదుగురిలో ముగ్గురు బుధవారం, ఇద్దరు గురువారం నామినేషన్‌ల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 19న కొండపిలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎర్రగొండపాలెంలో ఎరిక్షన్‌బాబులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం దర్శిలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జనజాతర మధ్య నామినేషన్ పత్రాలను సమర్పించారు. మిగిలిన ఐదుగురిలో ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి, గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి బుధవారం, ఎస్.ఎన్.పాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి చివరిరోజైన గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులతో భారీ ర్యాలీలకు ఏర్పాట్లు చేస్తున్నారు.


టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నాయకులు షేక్ బాచి, రావూరి బుజ్జి కుటుంబాలు

ప్రచారం ముమ్మరం

నామినేషన్‌ల దాఖలు ఘట్టం ముగింపు దశకు చేరుకోవడంతో టీడీపీ అభ్యర్థులు ఒకవైపు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మరోవైపు వైసీపీ నుంచి పార్టీలోకి వచ్చే వారిని చేర్చుకోవడాన్ని ఉధృతం చేశారు. కొండపి అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ స్వామి మద్దిపాడు మండలంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఊరూరా పర్యటిస్తున్నారు. ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డిలు ఒకవైపు బుధవారం జరగనున్న నామినేషన్‌ల ర్యాలీ, సభల ఏర్పాట్లు చేసుకొంటూనే మరోవైపు పార్టీలో చేరేవారిని స్వాగతించి చేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇక ఎస్.ఎన్.పాడు అభ్యర్థి అటు చీమకుర్తి, ఇటు నాగులుప్పలపాడు మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ గురువారం చీమకుర్తిలో నిర్వహించే ర్యాలీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కూడా ఒక వైపు ప్రచారం, మరోవైపు నామినేషన్ల దాఖలు ఏర్పాట్లలో ఉన్నారు. ఇక భారీ ర్యాలీలు, సభలతో ఇప్పటికే నామినేషన్‌లు వేసిన వై.పాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలు అదే జోష్‌తో ఎన్నికల ప్రచారం మరింత ఉధృతం చేశారు.

టీడీపీలోకి భారీగా వలసలు

అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీడీపీలోకి భారీగా వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారు. నిత్యం ప్రతి నియోజకవర్గంలో మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు వైసీపీలో క్రియాశీలకంగా పనిచేసే అనేకమంది వచ్చి సైకిలెక్కుతుండటంతో ఇటు టీడీపీ అభ్యర్థులు, అటు కేడర్‌లో ఉత్సాహం కనిపిస్తోంది.

ప్రక్షాళన ఖాయమే!

- ఈసీ దూకుడుతో పోలీసు వర్గాల్లో టెన్షన్
- పలువురిపై ఇప్పటికే ఫిర్యాదులు చేసిన టీడీపీ కూటమి
- త్వరలో కొందరిపై వేటుపడే అవకాశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) ఎన్నికల కమిషన్ జోక్యంతో జిల్లా పోలీసు శాఖలో కూడా ప్రక్షాళన జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రమేపీ సీఈసీ దూకుడు పెంచడం.. జిల్లాలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులు ఉండటంతో వారిలో టెన్షన్ మొదలైంది. ఇటీవల సీఈసీ రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై వేటు వేయడం ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులోభాగంగా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని బదిలీ చేసి కొత్తగా జి.సుమిత్‌ను జిల్లాకు పంపారు. కొత్త ఎస్పీ వచ్చిన మూడు, నాలుగు రోజులు పోలీసు శాఖలో కొంత జాగ్రత్తలు కనిపించినా ఆ తర్వాత షరామామూలే అన్నట్లు వ్యవహారం మారింది. కిందిస్థాయిలో పోలీసు అధికారులు అధికారపార్టీకి అనుగుణంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు అధికమయ్యాయి. ఒంగోలులో జరిగిన ఒక ఘటనలో ఇద్దరు సీఐలు అధికార వైసీపీకి వత్తాసుగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఒక డీఎస్పీ భారీ పోలీసు బలగంతో టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడులు చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో జరిగిన గిరిజన యువకుడి హత్య కేసులో పోలీసులు కిందిస్థాయి వైసీపీ నాయకులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు బలంగా వస్తున్నాయి. దొనకొండలో ఎస్ఐ విపక్ష పార్టీల వారిని బెదిరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొండపి, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో కొందరు పోలీసుల వ్యవహారశైలిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మంగళవారం పర్చూరులో ఆర్వో కార్యాలయం వద్ద ఎస్సై నాగశివారెడ్డి టీడీపీ కార్యకర్తల పట్ల దురుసుగా వ్యవహరించడం, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో వాదనకు దిగడం, ఆ తర్వాత ఆయనపై ఎస్పీకి ఏలూరి ఫిర్యాదు చేసేవరకు పరిస్థితి వెళ్లింది. ఒంగోలులో పోలీసు సంఘానికి నాయకుడిగా చెప్పుకునే ఒకరు వైసీపీ పక్షాన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నరన్న ఆరోపణలు ఉన్నాయి. బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ సందర్భంగా ఒక కానిస్టేబుల్ మఫ్టీలో హల్‌చల్ చేయడం అధికారుల దృష్టికి వెళ్లింది. ఎస్పీ బదిలీ అనంతరం కిందిస్థాయిలో కొందరు పోలీసు అధికారుల దూకుడు చర్యకు బ్రేక్ పడుతుందని అందరూ భావించారు. కారణాలు ఏమైనా అది జరక్కపోగా వారి హడావుడి మరింత పెరిగింది. ఒంగోలులో ఇద్దరు సీఐలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేయగా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. అయితే అందులో భక్తవత్సలరెడ్డి అనే సీఐ తనను వీఆర్‌కు పంపాలని ముందుగానే ఉన్నతాధికారులకు లేఖ పెట్టుకోవడం విశేషం. తాజా ఘటన నేపథ్యంలో కొత్తగా వచ్చిన ఎస్పీ పోకడ ఎలా ఉంటుందనే విషయంపై కూడా టీడీపీ కూటమి అభ్యర్థులు, నాయకుల్లో అనుమానాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో సీఈసీ రాష్ట్రంలోని అధికారుల వ్యవహారశైలిపై దృష్టిపెట్టి చర్యలను పెంచింది. తదనుగుణంగా రాష్ట్రస్థాయిలో మరికొందరు కీలక అధికారులను కూడా ఈసీ విధుల నుంచి తప్పించవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలోని పోలీసు శాఖలో ఉన్న పలువురు అధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కఠిన చర్యలు తప్పవని తెలుస్తోంది.


పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి పక్కన సివిల్ డ్రస్‌లో ఉన్న కానిస్టేబుల్ రత్నబాబు

వైసీపీ పోలీస్

- వివాదాస్పదమవుతున్న కొందరి తీరు
- బాలినేని ర్యాలీలో పాల్గొన్న కానిస్టేబుల్‌పై విచారణ

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 23 : పోలీసు శాఖలో పనిచేస్తున్న కొంతమంది వైసీపీ సేవలో తరించడం వివాదాస్పదమవుతోంది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికే కాకుండా ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, కోడలు కావ్యారెడ్డిలకు సెక్యూరిటీగా పోలీసులు పనిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం బాలినేని నామినేషన్ సందర్భంగా జరిగిన ర్యాలీలో రత్నబాబు అనే కానిస్టేబుల్ ప్రణీత్‌రెడ్డి వెంట ఉండి చేసిన హడావుడి చర్చనీయాంశమైంది. ఆయనకు ర్యాలీలో ఎలాంటి విధులు లేకపోయినా సివిల్ డ్రస్‌లో ఉండి ప్రణీత్‌రెడ్డికి దారి ఇవ్వండి అంటూ స్వామిభక్తిని చాటుకున్నాడు. పోలీసులతో ప్రణీత్‌రెడ్డి వాగ్వివాదానికి దిగిన సమయంలోనూ రత్నబాబు పక్కనే ఉన్నాడు. ఈ వ్యవహారంపై ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు దృష్టి సారించారు. కానిస్టేబుల్ విధులు ఏమిటి? ఆ సమయంలో ఆయన అక్కడ ఎందుకు ఉన్నారు? అన్న అంశంపై విచారణ చేపట్టి ఎస్పీకి నివేదిక ఇవ్వనున్నారు. మరికొంతమంది కానిస్టేబుళ్లు ఎన్నికల సమయంలో కూడా విధులు నిర్వహించకుండా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల వెంట తిరుగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టంగుటూరులో డ్యూటీ చేయాల్సిన ఓ కానిస్టేబుల్ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యూనిఫాం వేసుకోకుండా ఒంగోలులోని ఓ ప్రజాప్రతినిధి తనయుడి వద్ద పనిచేస్తున్నాడు. మరో కానిస్టేబుల్ విజయవాడలో ఒంగోలుకు చెందిన ప్రజాప్రతినిధి ఇంట్లో సేవ చేస్తున్నాడు. ఇలా అనేక మంది వైసీపీ సేవలో తరిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

భారీగా నామినేషన్లు

- ఒంగోలు పార్లమెంట్‌కు ఎనిమిది దాఖలు
- అసెంబ్లీ స్థానాలకు 38 మంది అభ్యర్థులు 40 సెట్లు

లోపలి పేజీల్లో..

ప్రజలను ఎన్నిసార్లు మోసం చేస్తారు ?

- బాలినేని మాయమాటలను నమ్మే స్థితిలో జనం లేరు..
- టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల ధ్వజం
- ఒంగోలులో ప్రచారానికి పవన్‌కల్యాణ్, వంగవీటి రాధా
- వైసీపీ నుంచి తెలుగుదేశంలోకి భారీగా చేరికలు


కాపు ఆత్మీయ సభలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్


టీడీపీలో చేరిన మామిడిపాలెం నాయకులతో దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 23: వైసీపీకి ఓటమి మొదలైందని, వైసీపీ వీడి టీడీపీలోకి వచ్చేవారు సిద్ధంగా ఉన్నారని ఐదు నెలల క్రితమే చెప్పానని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ తెలిపారు. మంగళవారం ఒంగోలులోని బాలాజీరావు తిరుపతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసీపీకి వీరాభిమానులుగా ఉండి, బాలినేని కోసం కష్టపడి పనిచేసిన రావూరి బుజ్జి, షేక్ బాచిలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ టీడీపీ కూటమి గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కృషి చేయలన్నారు. త్వరలో ఒంగోలులో ప్రచారానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్, వంగవీటి మోహన్‌రంగా కుమారుడు రాధాను ఆహ్వానిస్తామని తెలిపారు. అదేవిధంగా నగరంలో అవినీతి, అరాచకాలు, దందాలు చేసే వైసీపీని వీడి టీడీపీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. అయితే ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా చేసిన ఒంగోలు ఎమ్మెల్యే నియోజకవర్గానికి చేసిందేమి లేదనే విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. ఇరవైఏళ్ళుగా ఏమీ చేయలేని బాలినేని మరలా పాత క్యాసెట్ వేస్తున్నారని, తనను గెలిపిస్తే నగరానికి రోజు నీరు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెండో హామీగా అండర్ డ్రైనేజ్ నిర్మిస్తామని చెబుతున్నారని, నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో నగరంలో అండర్ డ్రైనేజ్ నిర్మిస్తానని చెప్పారని గుర్తు చేశారు. బాలినేని ఎన్నికల కోడ్‌కు పదిరోజులు ముందు హడావిడిగా ఇళ్ళ పట్టాలు ఇచ్చి సంతకాలు లేవంటూ మరలా తీసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే నగరానికి ఏమి చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తాను చేసిన అభివృద్ధి ఏమిటో డివిజన్లు, గ్రామాలు, మండలాల వారీగా లెక్కలు చెప్పి మరీ వివరిస్తానని దామచర్ల పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి ఇస్తామని, అలాగే కారులు, కరెంటు బిల్లులు, ఆస్తులతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ రూ.4వేలు పింఛను ఇస్తామని తెలిపారు.

అనంతరం పార్టీలో చేరిన రావూరి బుజ్జి, బాచిలు మాట్లాడుతూ వైసీపీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేశామని, అయితే వైసీపీలో తమకు తీరని అవమానం జరిగిందన్నారు. వాస్తవాలను త్వరలోనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి, వైసీపీ దురాగతాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరి నేతృత్వంలో నూర్‌బాషా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ సోఫియాతోపాటు వందమందికి పైగా టీడీపీలో చేరారు. వారికి దామచర్ల కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కాపుల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట

రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ పెద్ద పీట వేస్తుందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ తెలిపారు. మంగళవారం స్థానిక రంగాభవన్‌లో ఏర్పాటు చేసిన కాపుల ఆత్మీయ సమాశంలో కాపు సంఘం సీనియర్ నాయకులు తోటకూర వెంకట్రావుతోపాటు మరి కొంతమంది కాపులు టీడీపీలో చేరగా వారికి దామచర్ల కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ కూటమిలో భాగమైన కాపులకు తగిన ప్రాధాన్యత, పెద్దపీట వేస్తామని తెలిపారు. తోటకూర వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చలేదన్నారు. తనతోపాటు తన మిత్రులు, బంధువులు టీడీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు.

30వ డివిజన్‌లో వైసీపీ నుంచి టీడీపీలోకి..

నగరంలోని 30వ డివిజన్ మామిడిపాలెం, గద్దలగుంట ప్రాంతానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన క్యార్యక్రమానికి దామచర్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వైసీపీ నాయకులు కంకణాల భాను, వినయ్‌తోపాటు మరి కొంతమంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కష్టపడి పనిచేసి, అత్యధిక మెజారిటీ తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కంకణాల వెంకటరావు, నత్తల కనకయ్య, కొల్లాబత్తిన అనిల్, అంకరాజు, రమేష్ పాల్గొన్నారు.

భారీగా నామినేషన్లు

ఒంగోలు పార్లమెంట్‌కు ఎనిమిది దాఖలు

ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 38 మంది అభ్యర్థులు

40 సెట్ల సమర్పణ

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23 : జిల్లాలో నామినేషన్‌ల దాఖలు ఊపందుకుంది. మంగళవారం ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 46మంది అభ్యర్థులు 48 సెట్ల నామినేషన్ పత్రాలకు ఆర్వోలకు అందించారు. వారిలో ఒంగోలు పార్లమెంట్ నుంచి ఎనిమిది మంది ఉన్నారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గంనుంచి ముగ్గురు, దర్శి నుంచి ఇద్దరు, సంతనూతలపాడు నుంచి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, ఒంగోలు నియోజకవర్గం నుంచి ఏడుగురు అభ్యర్థులు ఎనిమిది నామినేషన్లు సమర్పించారు. కొండపి నుంచి ఆరుగురు అభ్యర్థులు, మార్కాపురం నియోజకవర్గం నుంచి ఏడుగురు, గిద్దలూరు నుంచి ఇద్దరు, కనిగిరి అసెంబ్లీ స్థానం నుంచి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా


విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు


ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 23: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలు నగరం లాయర్ పేటలోని డీఎస్ బ్రాంచి విద్యార్థులు సత్తాను చాటారు. మాడుగుల లాస్య, సీహెచ్.నిహారికలు 594 మార్కులు సాధించారు. 590కిపైగా మార్కులు ఎనిమిది మంది, నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం స్థానిక సాయి ఐటీఏ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, రీజనల్ ఇన్‌చార్జీ అనిల్, జోనల్ కోఆర్డినేటర్స్ శ్రీనివాసరావు, మల్లికార్జున్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్ పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో నారాయణ ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 23: ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. 590కిపైగా మార్కులు నలుగురు విద్యార్థులు సాధించారు. లెక్కలులో 26 మంది నూరు మార్కులు సాధించగా తెలుగులో 18మంది, సోషల్‌లో ఐదుగురు, సైన్స్‌లో నలుగురు విద్యార్థులు వందకు వంద మార్కులు సాధించారు. 580కి పైగా మార్కులు 15 మంది, 550కిపైగా మార్కులు 60మంది, 500లకు పైగా మార్కులు 90 మంది విద్యార్థులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం స్కూలు ప్రిన్సిపాల్ సయ్యద్‌నాగూర్‌వలి, నారాయణ స్కూల్స్ ఏజీఎం పెద్దిరెడ్డి, కో ఆర్డినేటర్ శరత్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

అపెక్స్ విద్యార్థుల విజయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 23: ఒంగోలు నగరం సుజాతనగర్‌లోని అపెక్స్ హైస్కూలు విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. 588 మార్కులను ఇద్దరు విద్యార్థులు సాధించగా, 580కిపైగా మార్కులను ఐదుగురు, 570కిపైగా మార్కులు 15మంది, 560కిపైగా మార్కులు 24 మంది, 550కిపైగా మార్కులు 35 మంది, 500లకు పైగా మార్కులను 94 మంది సాధించారు. పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం స్థానిక పాఠశాలలో కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి అభినందించారు. ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు.

మే 24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 23: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలను మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర మంగళవారం తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు పరీక్ష రుసుం సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 30 వరకు చెల్లించవచ్చు. రూ50 రుసుంతో మే 1నుంచి 23 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాలుగు రోజుల్లో మార్కుల మెమోలు : విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఎటువంటి ఆటంకం లేకుండా మార్కుల జాబితాలను నాలుగు రోజుల్లో ప్రభుత్వ పరీక్షల బోర్డు వెబ్‌సైట్‌లో ఉంచుతారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత స్కూలు లాగిన్ నుంచి పాఠశాలల వారీగా మార్కులు మెమోరాండం, వ్యక్తిగత షార్ట్‌మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళకుండానే నేరుగా బోర్డు టెన్త్ ఫలితాలు వెబ్‌సైట్ నుంచి వారి ఫలితాలు, షార్ట్‌మెమోలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో సుభద్ర సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోండి

మద్దిపాడు, ఏప్రిల్ 23: ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుందుకు చీమకుర్తిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్వో గోపాలకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫాం-12తో పాటు ఆధార్‌కార్డు, ఓటర్ కార్డు, ఎన్నికల విధుల ఉత్తర్వులు, రెండు ఫొటోలు అంద జేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా!

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ ● పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ● చీమకుర్తి నుంచి భారీగా తెలుగుదేశంలో చేరిక


చీమకుర్తిలో పార్టీలో చేరిన వారితో విజయ్‌కుమార్


చిలకపాడులో బీఎన్‌కు బొకే ఇస్తున్న పార్టీలో చేరిన నాయకులు

చీమకుర్తి, ఏప్రిల్ 23 : త్వరలో జరిగే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా ఆదరించాలని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చీమకుర్తి మండలం పాటిమీదపాలెంలో బాబుష్యూరిటీ-భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను పంచారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఆయన చెప్పారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ అధికారప్రతినిధి రాయపాటి అరుణ, టీడీపీ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, అవిశనేని వెంగన్న, పోలే పాపిరెడ్డి, ఇస్తర్ల ఏడుకొండలు, బ్రహ్మారెడ్డి, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధర్, వీర నాగిరెడ్డి, కూరాకుల కరుణాకరరెడ్డి, గంగుల శివపార్వతి, తాతినేని శ్రీరాం, దరిమడుగు నాగరాజు, చంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

100 కుటుంబాలు టీడీపీలో చేరిక

చీమకుర్తిలో టీడీపీలోకి చేరికలు వెల్లువలా సాగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని రావిపాటి రాంబాబు గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్‌కుమార్ సమక్షంలో దాదాపు వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మాజీ కౌన్సిలర్ బాపతు శ్రీనివాసరెడ్డి, వీరమణి, రఫీ, సలీమ్‌లతో పాటు పలువురు ముఖ్యనాయకులు పార్టీలో చేరగా వారిని బీఎన్ సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మన్నం ప్రసాద్, కందిమళ్ల గంగాధరరావు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, పూనాటి వెంకట్రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, రఫీ, అమానుల్లా, అప్సల్లామోమిన్, సూరంపల్లి హనుమంతరావు, ఉన్నం సుబ్బారావు, అవనిగడ్డ శేషయ్య, నర్రా నాగరాజు, బాజీ పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి హామీ

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే పద్మశాలీల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం చీమకుర్తిలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో పద్మశాలీయులకు టీడీపీ ప్రత్యేక పథకాలతో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అడకా స్వాములు, పరాల శ్రీనివాసరావు, నారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలి

సంతనూతలపాడు: వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కాపాడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అత్యవసరమని టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం గడపలేని పరిస్థితుల్లో ఉన్నారని విమర్శించారు. మంగళవారం మండలంలోని చిలకపాడు నుంచి వైసీపీ గ్రామ సర్పంచ్ బొల్లినేని కోమలమధు, మరో 70 కుటుంబాలు కొంకా చెన్నారావు ఆధ్వర్యంలో బీఎన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా గుర్వారెడ్డిపాలెం అంబేద్కర్‌నగర్‌కు చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికీ బీఎన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నరసింహారావు, రాంబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో ప్రచారం

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులో మంగళవారం రాత్రి టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. వైసీపీ హయాంలో గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్వహణను గాలి కొదిలేసిందని విమర్శించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. తొలుత పోలేరమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి వాటర్‌ప్లాంట్ మీదుగా సత్రంబడి, యాదవ కాలనీ, ఏకలవ్య కాలనీలో ప్రచారం సాగింది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, కాట్రగడ్డ చంద్రబాబు, బి.సెల్వం, కనగాల శ్రీనివాసరావు, జనసేన నాయకులు రాయపాటి అరుణ, కందుకూరి బాబు, పెంట్యాల కోటేశ్వరరావు, పెంట్యాల శ్రీను పాల్గొన్నారు.

మాదిగల మద్దతు చంద్రబాబుకే..!

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 23: రాష్ట్రంలో మాదిగల మద్దతు తెలుగుదేశం పార్టీకేనని, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కొంతమంది అడ్డుపడుతున్నారని ఆరోపించారు. మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కనీసం పైసా కూడా నిధులు ఇవ్వకుండా నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్ళించి దళితుల గొంతు కోశారని మండిపడ్డారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో వైసీపీ ఓటమి, టీడీపీ గెలుపు లక్ష్యంగా మాదిగలు పని చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌జే.ప్రకాష్, కొదమల బెంజిమెన్, వేజెళ్ళ సుబ్బారావు, కరుణాకర్, వనమా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ మృతి

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 23 : రైలు కింద పడి మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం ఒంగోలులోని రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం-1 లో ఉత్తరపు వైపున జరిగింది. సుమారు 35 ఏళ్ళ వయస్సు గల మహిళ రైల్వే ట్రాక్ దాటుతూ రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలు వద్ద కర్రల సంచీలో కూరగాయలు, పదిలీటర్ల డబ్బాలో మామిడి కాయలు ఉన్నాయి. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి ఆచూకీ తెలిసినవారు 9440904870, 9440887143, 7013915467 సెల్ నంబర్లకు తెలియజేయాలని రైల్వే సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు.

వైభవంగా మహాకుంభాభిషేకం


వేడుకల్లో పాల్గొన్న శిద్దా, స్వాత్మనందేంద్రస్వామి

చీమకుర్తి, ఏప్రిల్ 23: చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మహా పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం కార్యక్రమాలను జరిపారు. శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మనందేంద్రస్వామి స్వీయ పర్యవేక్షణలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా పాండురంగారావ, కుటుంబసభ్యులు విశేష పూజలు చేశారు. సాయంత్రం నగరోత్సవం జరిగింది. స్వాత్మనందేంద్రస్వామి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ హరిహరక్షేత్రానికి, శారదాపీఠానికి అనుబంధం 18ఏళ్ల నాటిదన్నారు. కార్యక్రమంలో శిద్దా పెదబాబు, శిద్దా సూర్యప్రకాశరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, చీమకుర్తి కోటిలింగం, శిద్దా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరఘునాయక స్వామి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23: ప్రసిద్ధిగాంచిన చదలవాడలోని శ్రీరఘునాయక స్వామివారి కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన పూజలకు ఉభయదాతలుగా మద్దిరాలపాడుకు చెందిన చెరుకూరి రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, నల్లూరి గోవిందమ్మ, శ్రీనివాసప్రసాద్, చెరుకూరి పున్నయ్య, జవహర్ గంగా, చెరుకూరి సుబ్బారాయుడు వ్యవహరించారు. రాత్రి గరుడవాహనంపై స్వామివారు విహరించారు. చదలవాడ శ్రీఅభయాంజనేయ స్వామి డీజే కోలాట బృందంచే కోలాట ప్రదర్శన, ఒంగోలు మాంటిసోరీ స్కూలు విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆలరించాయి. ఈవో అనిల్ పర్యవేక్షించారు.

మలేరియాపై అవగాహన కల్పించాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 23: మలేరియాపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఈనెల 25వ తేదీన మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మలేరియాను అరికట్టవచ్చన్నారు. ఈ వ్యాధి అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాపిస్తుందని చెప్పారు. ఈ దోమల ద్వారా ప్లాస్మోడియం అనే పరాన్న జీవి ఒక వ్యక్తి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సాధారణంగా మలేరియా జ్వరం వర్షాకాలంలో ఎక్కువగా వస్తుందని, ఇది ఐదు రకాలుగా ఉంటుందని, సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా ఎటువంటి భయం ఉండదని ఆమె పేర్కొన్నారు. అందువల్ల మలేరియా వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఉప్పుగుండూరులో సినిమా చిత్రీకరణ

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23 : ఉప్పుగుండూరులో మంగళవారం నూతన సినిమా చిత్రీకరణ జరిగింది. నూతన నటీ నటులతో నిర్మిస్తున్న మన్మయి సినిమా షూటింగ్ గ్రామంలోకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న పరబీడు కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద జాతీయరహదారిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా నటీనటులు, దర్శకుడి వివరాలను తెలిపేందుకు చిత్ర యూనిట్ అంగీకరించలేదు. షూటింగ్ చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

చిన్నారులకు వస్త్రాల వితరణ


వస్త్రాలను అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 23: పేలప్రోలు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ పేలప్రోలు విద్యాసాగర్ దాతృత్వంతో మంగళవారం స్థానిక బొమ్మరిల్లు అనాథ ఆశ్రమంలో చిన్నారులకు రూ.60 వేల విలువైన నూతన వస్త్రాలను బహూకరించారు. ట్రస్ట్ చైర్మన్ పేలప్రోలు రామకృష్ణ పరమహంస సతీమణి ప్రమీల చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు మంచినేని మాధవి, శ్రీనివాసరావులు మాట్లాడుతూ విద్యాసాగర్ ఇటీవల బొమ్మ రిల్లును సందర్శించి ఇచ్చిన హామీ మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, రాజేశ్వరి, కొమ్మి రమణయ్య కొమ్మి రాజేశ్వరి, నిర్వాహకురాలు రాజ్యలక్ష్మి, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 23: విద్యార్థులు నిత్యం పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞాన, చారిత్రక పుస్తకాలను సైతం చదవటం అలవాటు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ సెలవు రోజుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొమ్మల కోటేశ్వరి, లైబ్రేరియన్ కె.సంపూర్ణమ్మ, ఎస్.అనిల్‌బాబు, ఉపాధ్యాయురాలు పద్మావతి, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఒంగోలు పార్లమెంట్‌కు ఎనిమిది నామినేషన్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 23: ఒంగోలు పార్లమెంట్ స్థానానికి మంగళవారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్‌కు అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా బొంత రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈదా సుధాకర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట గీతాలత, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ధరణికోట లక్ష్మీనారాయణ, స్వతంత్ర అభ్యర్థి రాయపాటి జగదీష్, పిరమిడ్ పార్టీ అభ్యర్థి సూర్యతేజ కోట, సమాజ్ పార్టీ అభ్యర్థి వెంకటేశ్వర్లు పాశం నామినేషన్లు దాఖలు చేశారు.

ఒంగోలు అసెంబ్లీకి ఏడు..

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం ఏడుగురు అభ్యర్థులు తొమ్మిది సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డికి నామినేషన్లను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా దాసరి సుందరం, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా(అంబేడ్కరిస్ట్) అభ్యర్థి బిల్లా బ్రహ్మనాయుడు రెండు సెట్ల నామినేషన్లను, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి వెంకటస్వామి, స్వతంత్ర అభ్యర్థులుగా మన్నం సుధాకర్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్లు, అలాగే అనిత పాలేటి, శ్రీనివా సరావు పాటపాటి, ఆళ్ళ నారాయణరావు నామినేషన్లను అందజేశారు.

అక్రమ అడ్మిషన్లను అడ్డుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 23: అకాడమీలు, కోచింగ్ సెంటర్ల పేరుతో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను అడ్డుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. మంగళవారం ఒంగోలులో వారు ఆర్ఐవో సైమన్‌విక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో గత రెండేళ్ళ కాలంలో వివిధ రకాల పేర్లతో అకాడమీలు, షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్లు ఎక్కువగా వెలిశాయన్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని, ట్యూషన్ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకొని ఇంటర్ అడ్మిషన్లను ఏదో ఒక కాలేజీలో నమోదు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇటువంటి అక్రమ అడ్మిషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వీరస్వామి పాల్గొన్నారు.

రామతీర్థంలో గంగమ్మతల్లి తిరునాళ్ల


గంగమ్మతల్లి మూలవిరాట్

చీమకుర్తి, ఏప్రిల్ 23 : రామతీర్థం పుణ్యక్షేత్రంలో ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నాడు నిర్వహించే గంగమ్మతల్లి తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కుబడి పొంగళ్లను చెల్లించారు. గంగమ్మతల్లి మూల విరాట్‌ను వెండికవచంతో అలంకరించారు. ఎన్నికలకోడ్ నేపథ్యంలో ఈ ఏడాది ప్రభల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు లేకపోవటంతో సాదాసీదాగా తిరునాళ్ల జరిగింది.

తనిఖీలు ముమ్మరం చేయాలి : జేసీ

మద్దిపాడు, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం చెక్‌పోస్ట్ దగ్గర వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన మద్దిపాడు మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద రాత్రి సమయాల్లో కూడా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా రవాణా అవుతున్న నగదు, మద్యం, ఇతర సామగ్రి ఉంటే సీజ్ చేయాలన్నారు. కంటైనర్లు, బస్సులు, లారీలను తనిఖీ చేయాలన్నారు. ఎపిక్ కార్డులు పంపిణీ త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

సామాజిక సమస్యలపై పోరాడాలి


సర్టిఫికెట్లను అందజేస్తున్న రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 23 : సామాజిక సమస్యలపై విద్యార్థులు పోరాడాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక చైతన్యంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ప్రిన్సిపాల్ రాజమోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వలంటీర్ వెయ్యి మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్, స్టూడెంట్స్ ఆఫైర్స్ డైరెక్టర్ అంచుల భారతీదేవి, వలంటీర్లు సాయిశరణ్య, ప్రియాంక, భాస్కర్, అజయ్ పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.279

సంతనూతలపాడు, ఏప్రిల్ 23: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.279 పలికింది. గుర్వారెడ్డిపాలెం నుంచి 945 బేళ్లు రాగా 810 బేళ్లు అమ్ముడయ్యాయి. 135 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.229, సరాసరి ధర రూ.242.67 వచ్చినట్లు ఆయన చెప్పారు.

వెల్లంపల్లిలో రూ.276

మద్దిపాడు: వెల్లంపల్లి పొగాకే వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు రూ.276 పలికింది. చిలకలూరిపేట క్లస్టర్ నుంచి 575 బేళ్లు రాగా 481 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. అయితే కనిష్ఠ ధర రూ.250, సరాసరి కిలో పొగాకు రూ.235 వచ్చిందని వేలం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. రైతులు నాణ్యమైన పొగాకును తీసుకురావాలని ఆయన సూచించారు.

క్రీడలతో శారీరక దృఢత్వం : సీఐ


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ అజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23 : క్రీడలతో శారీరక దృఢత్వం లభిస్తుందని ఒంగోలు రూరల్ సీఐ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఉప్పుగుండూరు గ్రామంలో అడ్వాన్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చెప్పారు. అనంతరం సీఐ కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో విజయ్, కొలకలూరి వినయ్, కొంజేటి సురేష్‌బాబు, మాదాసు రాంబాబు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడ వాహన సేవ


గరుడ వాహనంపై స్వామివారు

ఒంగోలు (కల్చరల్), ఏప్రిల్ 23: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారికి గరుడవాహన సేవ అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై ఉంచి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని పలు ప్రధాన వీధులలో గరుడోత్సవం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీ సాయి కళాభారతి చిన్నారుల కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. ఈవో డి.రజనీకుమారి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23 : పదో తరగతి ఫలితాలలో మండలంలోనే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం నాగులుప్పలపాడు ఎంఆర్‌సీ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈమని రమణయ్య అభినందించారు. మాచవరం జడ్పీ హైస్కూలు విద్యార్థిని కె.సుమశ్రీ 587 మార్కులు, ఉప్పుగుండూరు ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన కె.కళ్యాణ్‌కుమార్, ఎ.నవ్య, జీబీ.వెంకటసాయి, ఎ.వెన్నెల, టి.రమ్య, కె.తేజ్‌ప్రతాప్ 590కి పైగా మార్కులు సాధించడంతో వారిని ప్రత్యేకంగా అభినందించారు.

రేపు ఉచిత మెగా ఈవెంట్

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 23 ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన గాయకులతో గురువారం ఒంగోలులో ఉచిత మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు కుమార్ మెగా ఈవెంట్ ఆర్గనైజర్ జె.కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కోర్టుసెంటర్ శాంకరీ హోటల్లో ఉదయం 8 గంటల నుంచి జరిగే ఈ ఈవెంట్‌కు సంగీతాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఒంగోలు 1 వేలం కేంద్రంలో కొనుగోళ్లు పరిశీలిస్తున్న అధికారులు

పొగాకు ధరలు పైపైకి..

- కిలో రూ.279 పలికిన గరిష్ఠ ధర
- బ్రౌన్ రకం కిలో రూ.248
- ఒంగోలు-1, టంగుటూరు కేంద్రాల్లో వేలాన్ని పరిశీలించిన అధికారులు

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ధరలు పైపైకి వెళ్తున్నాయి. వేలం ప్రారంభం అనంతరం నెలన్నరపాటు నిలకడగా సాగిన గరిష్ఠ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. పదిరోజుల క్రితం మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.238 ఉండగా మంగవారం మార్కెట్లో రూ.279 పలికింది. అలా పదిరోజుల వ్యవధిలో కిలోకు రూ.40 వరకు మేలు రకం ధర పెరిగింది. లోగ్రేడ్ ధరలు కూడా అలాగే పెరుగుతున్నాయి. ఆ రకంలో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్ ధర పదిరోజుల క్రితం కిలో రూ.225 నుంచి 230 వరకూ ఉంది. గరిష్ఠంగా రూ.233 పలికింది. మంగళవారం మార్కెట్లో ఏకంగా కిలో బ్రౌన్ రకం గరిష్ఠ ధర రూ.248 లభించింది. ఒంగోలు-1 వేలం కేంద్రంలో ఈ ధరలు వచ్చాయి. ఇతర అన్ని కేంద్రాల్లోనూ కిలోకు రెండు నుంచి మూడు రూపాయలు తక్కువగా మేలురకం ధర కిలో రూ.275పైన, బ్రౌన్ రకం రూ.245పైన ఉన్నాయి. వారం క్రితం వరకు ధరల విషయంలో నిలకడగా ఉంటూ వస్తున్న ఐటీసీ కంపెనీ సైతం రెండు రోజులుగా పెంచి కొనుగోలు చేస్తోంది. పలువురు డీలర్లు, ఎగుమతిదారులుగా ఉండే కంపెనీల బయ్యర్లు బేళ్లకోసం వేలం కేంద్రాల్లో పోటీ పడుతున్నారు. ఇదిలాఉండగా పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ, ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావుతోపాటు పలువురు బోర్డు ప్రధాన కార్యాలయ అధికారులు మంగళవారం ఒంగోలు-1, టంగుటూరు వేలం కేంద్రాలను సందర్శించారు.



టంగుటూరు కేంద్రంలో కొనసాగుతున్న పొగాకు వేలం

కేజీ పొగాకు ధర రూ. 272

కొండపి, ఏప్రిల్23: కొండపి పొగాకు వేలం కేంద్రంలో బ్రైట్ రకానికి కేజీకి 272 రూపాయలు ధర మంగళవారం పలికింది. జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ బేళ్లను వేలం కేంద్రానికి అమ్మకానికి తెచ్చారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు.

టంగుటూరులో కిలో ధర రూ.270

టంగుటూరు : టంగుటూరులో మంగళవారం జరిగిన పొగాకు వేలంలో మేలిరకం పొగాకు గరిష్ఠ ధర రూ. 270 పలికింది. కనిష్ఠ ధర రూ.220 వద్దనే నిలకడగా కొనసాగుతోంది. వేలం కేంద్రానికి టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాల రైతుల 923 పొగాకు బేళ్లకు అనుమతించారు. ఇందులో 822 బేళ్లు కొనుగోలు జరుగగా, వివిధ కారణాలతో మిగిలిన బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర రూ. 270 కాగా, కనిష్ఠ ధర రూ. 220, సరాసరి ధర రూ. 241.22 రైతులకు దక్కింది.

స్మార్ట్‌జన్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

సింగరాయకొండ, ఏప్రిల్ 23 : సింగరాయకొండ స్మార్ట్‌జన్ గ్లోబల్ స్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీకి వస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సతీష్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల చైర్మన్ పి. శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. గీతా రాణి, ప్రిన్సిపాల్ కె. లలిత, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.



విద్యార్థులతో పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్

అధికారపార్టీకి దారులు - ప్రజలకు అడ్డంకులు

ప్రధాన పార్టీల నామినేషన్లు ముగిసినా

ఆగని ట్రాఫిక్ ఆంక్షలు

అధికారుల వింతవైఖరిపై విమర్శలు



కామేపల్లి రోడ్డు జంక్షన్‌లో జనానికి అడ్డుగా పోలీసులు పెట్టిన ఇనుప గ్రిల్స్

కొండపి, ఏప్రిల్23: నామినేషన్ల సందర్భంగా అధికారుల ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధానంగా కొండపిలోని కామేపల్లి రోడ్డు నుంచి టంగుటూరు రోడ్డులోని గ్రామం వెలుపల వరకు అన్ని దారులను మూసి వేస్తూ అధికారులు ఈనెల 16వ తేదీ నుంచి నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం ముగిసింది. అయినా పోలీసు అధికారులు ఆంక్షలు సడలింకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ మార్గంలో యూనియన్ బ్యాంకు, పీడీసీసీ బ్యాంకు, పోస్టాఫీసులు ఉన్నాయి. వీటితోపాటు పొగాకు వేలం కేంద్రానికి రైతులు కూడా ఈదారిలో రాకపోకలు సాగించాలి. అయితే నామినేషన్‌ల సందర్భంగా పోలీసులు ఆర్వో సూచనల మేరకు కట్టడి నిబంధనలు విధించారు. ఈరూటులోని అన్ని మార్గాలను బారికేడ్లతో మూసివేశారు. పోలీసులు ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులను టంగుటూరు రూటులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3.30 నిమిషాల వరకు గ్రామంలోకి రానివ్వడం లేదు. వాహనాలను కూడా ఈసమయంలో తిరగనివ్వడం లేదు. వాహనాలను ఇరుకు దారుల్లోకి మళ్లిస్తూ వాహనదారులను, బ్యాంకులకు వచ్చివెళ్లే వారిని ఇబందులకు గురిచేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

వైసీపీ నామినేషన్లకు లేని ఆంక్షలు...

నామినేషన్లు ప్రారంభ రోజైన 18వ తేదీనుంచి కఠిన ఆంక్షలు ఆర్వో సూచనలతో అమలు చేసిన పోలీసులు 19వ తేదీ ఎన్‌డీఏ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే స్వామి నామినేషన్‌కు కఠిన ఆంక్షలు అమలు చేశారు. పొదిలి, మద్దులూరు, కామేపల్లి, టంగుటూరు రోడ్డులో వచ్చే వాహనాలను ఆయా రూట్లలో కొండపి గ్రామం వెలుపల ఆపివేశారు. అంతేకాకుండా ప్రధానమైన సభాస్థలి వద్దకు వెళ్లేందుకు ప్రధాన రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేసి వెళ్లనివ్వ లేదు. దీంతో ఎస్సీ కాలనీలలోని ఇరుకు సందుల్లో వాహనాలు తీసుకెళ్లి పెట్టుకుని అక్కడ నుంచి కాలినడకన పలు మండలాల నుంచి వచ్చిన వారు వెళ్లారు. అయితే అధికారులు మాత్రం వైసీపీ అభ్యర్థి, మంత్రి సురేష్ నామినేషన్‌కు కొండపికి పడమర వైపు పొదిలి, మద్దులూరు, కామేపల్లి వైపు నుంచే వచ్చే వాహనాలను టంగుటూరు ప్రధాన రోడ్డులో గ్రామం వెలుపలగా సభాస్థలికి చేరుకునేందుకు అన్ని రూట్లలో దారిచూపిస్తూ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లకు ఫ్లెక్సీలకు తగిలించారు. అధికార పార్టీకి అంతగా సేవ చేసిన అధికారులు, టీడీపీ నామినేషన్ రోజున దారి చూపిస్తూ ఫ్లెక్సీలు ఎందుకు ఏర్పాటు చేయలేదని టీడీపీ నాయకులు, శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి సానుకూలంగా, ప్రతిపక్ష పార్టీకి ప్రతికూలంగా పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపై ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు ఇలా పక్షపాతంగా వ్యవహరించడం న్యాయం కాదని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కామేపల్లి రోడ్డు నుంచి టంగుటూరు రోడ్డువైపు ఒకవైపు (వన్‌వేలోనైనా) వాహనాలను అనుమతించాలని ప్రజలు కోరుతున్నారు.



సోమవారం మంత్రి నామినేషన్ సందర్భంగా టంగుటూరు రోడ్డులో ఎస్సీ కాలనీ వద్ద వదిలేసినట్రాఫిక్



స్వామి తరుపున నామినేషన్ దాఖలు చేస్తున్న రామయ్య చౌదరి, యల్లమంద నాయుడు

ఆరునామినేషన్లు దాఖలు

కొండపి, ఏప్రిల్ 23: కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారంనాడు టీడీపీ తరుపున ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి ఒక నామినేషన్ వేయగా, ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, జనసేన కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే భార్య డోలా రాజేశ్వరి తరుపున టీడీపీ సీనియర్ నాయకుడు బత్తుల నారాయణస్వామి ఒక నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు బాలకోటయ్య పాల్గొన్నారు. జైభీంరావ్ భారత్ పార్టీ తరుపున టంగుటూరు మండలం జమ్మలపాలెం గ్రామానికి చెందిన కందిపాటి వెంకట కృష్ణారావు నామినేషన్ వేశారు. ఇండిపెండెంట్‌గా కొండపికి చెందిన యనమద్ది వెంకటేశ్వర్లు తన నామినేషన్ వేశారు. అదేవిధంగా మార్కాపురం మండలం వేములకోటకు చెందిన తంగిరాల నాగరాజు ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు.

- మంత్రికి వ్యతిరేకంగా..

అదేవిధంగా తనపై అక్రమంగా ఎస్సీ కేసు మంత్రి సురేష్ నమోదు చేయించారని గతంలో విమర్శలు చేసిన టంగుటూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన విష్ణుం సుజాత కూడా తన నామినేషన్‌ను మంగళవారం వేశారు. నామినేషన్ వేసిన అనంతరం ఆమె మీడియాతో తహసీల్దార్ కార్యాలయం వెలుపల మాట్లాడారు. తనపై అక్రమ కేసు బనాయించిన మంత్రి సురేష్ ఓటమే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తానని ఆమె వివరించారు.

వ్యవసాయశాఖ జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై టి. శ్రీరామ్

సింగరాయకొండ, ఏప్రిల్ 23 : గత కొంతకాలంగా మానసిక ఆందోళనతో బాధపడుతున్న సింగరాయకొండ వ్యవసాయశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గోపవరపు వెంకట్ భరత్‌కుమార్‌రెడ్డి (31) స్థానిక కందుకూరురోడ్డు 3వ లైనులోని తన నివాసంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై టి. శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి భార్య వారం రోజుల కితం తన పుట్టిల్లు బేస్తవారిపేటకు వెళ్లింది. తల్లి ఒంగోలులో ఉంటుంది. సోమవారం పలుసార్లు తల్లి ఫోన్ చేసినా వెంకట్ భరత్‌కుమార్‌రెడ్డి స్పందించలేదు. దీంతో మంగళవారం తల్లి, మేనమామ ఒంగోలు నుంచి సింగరాయకొండకు వచ్చారు. ఇంటికి వెళ్లి తలుపులు తీసి లోపలికి వెళ్లి చూడగా చీరతో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై టి. శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



స్వామి సమక్షంలో పార్టీలో చేరిన పల్లపోతు కోటేశ్వరరావు తదితరులు

'పల్లపోతు' బాటలో నడవాలి

- కొండపి ఎమ్మెల్యే స్వామి పిలుపు

కొండపి, ఏప్రిల్23: మండల కేంద్రమైన పొన్నలూరుకు చెందిన పల్లపోతు కోటేశ్వరరావు టీడీపీలోకి రావడం ఆనందంగా ఉందని, కోటేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకుని, నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలోకి రావాలని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే స్వామి స్వగృహంలో పొన్నలూరుకు చెందిన సీనియర్ నాయకుడు పల్లపోతు కోటేశ్వరరావుతోపాటు మరో 5 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా స్వామి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌డీఏ కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విజయానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాదవరావు, అనుమోలు సుధాకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే సూపర్ 6 పథకాలు

తూర్పునాయుడుపాలెం(టంగుటూరు), ఏప్రిల్ 23 : పేదల సంక్షేమానికే చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలని తెలుగుదేశం పార్టీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని కారుమంచికి చెందిన 15 కుటుంబాలవారు మంగళవారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కారుమంచి టీడీపీ నాయకులు ఈదర ప్రభాకర్, మేడికొండ రవీంద్ర నాయకత్వంలో ఎమ్మెల్యే సమక్షంలోనే తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే గృహం వద్ద వీరంతా టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన చూస్తున్న వైసీపీ కుటుంబాలు చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావించి వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈదర ప్రభాకర్, అనుమాల సుధాకర్, రవీంద్ర ఉన్నారు.



వైసీపీ వీడి టీడీపీలో చేరిన 15 కుటుంబాల వారితో ఎమ్మెల్యే స్వామి



భవిత కేంద్రంలో విద్యార్థులతో సమగ్రశిక్ష ఏఎంవో రమేష్, ఎంఈవోలు

భవిత కేంద్రాల పరిశీలన

కొండపి, ఏప్రిల్ 23: కొండపి గ్రామ పంచాయతీలోని దాసరెడ్డిపాలెం, కుమ్మరిపాలెంలలోని భవిత విద్యా కేంద్రాలను సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ట్యాబ్‌ల పనితీరును ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. దాసరెడ్డిపాలెం, కుమ్మరిపాలెం ఎంపీ స్కూళ్లను కూడా రమేష్ పరిశీలించారు. వేసవిలో ఉపయోగించుకునేందుకు లైబ్రరీ బుక్స్ అందజేశారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు లైబ్రరీ బుక్స్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈవోలు కె. సురేఖ, పి.రామారావు పాల్గొన్నారు.



పాలసీలను చేయిస్తున్న సిబ్బంది

పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో

బీమా పాలసీలపై ప్రచారం

కొండపి, ఏప్రిల్ 23: కొండపిలోని జెండాచెట్టు సెంటర్‌లో మంగళవారం పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు బీమా పాలసీలను వివరించారు. అదేవిధంగా అక్కడే కోరిన వారికి పాలసీలు చేశారు. ఈసందర్భంగా పోస్టల్‌శాఖ సౌత్ సబ్ డివిజన్ అధికారి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆపదకాలంలో, ప్రమాదవేళల్లో ప్రజలకు పాలసీలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ప్రమాద సందర్భాల్లో ఆటో డ్రైవర్లకు నివాభూపా, ఆదిత్యా పాలసీలు డ్రైవర్ల కుటుంబాలకు అండగా నిలుస్తాయని వివరించారు. ఈసందర్భంగా పాలసీలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పోస్టల్ శాఖలో సిబ్బంది చేస్తున్నారని ఆయన వివరించారు. పోస్టల్‌శాఖలో నూతనంగా చేస్తున్న బీమా పాలసీలను వివరించారు.

వడదెబ్బకు మహిళ మృతి

తాళ్లూరు, ఏప్రిల్ 23: మిరపకాయల కోతకు వెళ్లిన మహిళా కూలీ సోమవారం రాత్రి వడదెబ్బకు మృతిచెందింది. అందిన సమాచారం మేరకు.. లక్కవరం గ్రామ కొత్తూరుకు చెందిన బండారు భవానీ(42) సోమవారం ఉదయం మిరపకాయల కోతకు వెళ్లింది. మిరపకాయలు కోస్తుండగా ఎండదెబ్బ తగిలి కుప్పకూలిపోయింది. సమాచారం అందుకున్న బంధువులు ఆమె ఇంటికి తీసుకవచ్చి చికిత్స నిమిత్తం దర్శి ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది.

సంక్షేమ రాజ్యం టీడీపీకే సాధ్యం

- ప్రచారసభల్లో ఎమ్మెల్యే స్వామి
- పల్లెల్లో బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- ప్రచారంలో కదం తొక్కుతున్న మహిళలు

మర్రిపూడి, ఏప్రిల్ 23 : సంక్షేమ రాజ్యం టీడీపీకే సాధ్యమని కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని రావిళ్లవారిపాలెం, జువ్విగుంట, రేగలగడ్డ, ధర్మవరం, వెంకట కృష్ణాపురం గ్రామాలలో జరిగిన ప్రచార సభలలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే స్వామికి ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. డప్పు వాయిద్యాలతో మేళతాలతో బాణసంచా కాలుస్తూ జనం నీరాజనాలు పలికారు. ముఖ్యంగా పలు గ్రామాలలో మహిళలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి హారతులు ఇచ్చి కుంకుమ తిలకం దిద్ది స్వాగతం పలకడం పార్టీ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జరిగిన ప్రచార సభలలో ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వృద్ధులకు, వితంతువులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచే రూ.4000 పింఛలను బకాయిలతో సహా చెల్లిస్తామని హామీఇచ్చారు. 50 సంత్సరాలు నిండిన బీసీలకు రూ. 4000 పింఛను ఇస్తామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో బీసీలపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయని నందం సుబ్బయ్య, అమర్‌నాధ్ లాంటి ఎందరో అమాయకులను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చంద్రబాబు నాయుడు బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పించాలని చారిత్రక నిర్ణయం తీసుకున్నారన్నారు. దళితులపై దాడులు జరిగినప్పుడు దళిత మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ ఏనాడు నోరు తెరవ లేదని ఎద్దేవాచేశారు. దళిత ద్రోహిగా పేరుగాంచిన సురేష్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. తనతోపాటు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా రావెళ్లవారిపాలెంలో జరిగిన సభలో దద్దాలి వెంకటేశ్వర్లుతోపాటు విజయలక్ష్మి పేటకు చెందిన నీలిశెట్టి సుబ్బారావు, పాశం నాగార్జునలతోపాటు మరో నాలుగు కుటుంబాలు వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకు అడకా స్వాములు, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త రేగుల వీరనారాయణ, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, సర్పంచులు ఎం. వెంకటేశ్వర్లు, బొట్లగుంట రాంబాబు, మాజీ సర్పంచులు ఎం సుబ్బారావు, బి. ప్రభాకరరావు, బి.లక్ష్మీ, పీ వరమ్మ, బి. లక్ష్మీనారాయణ, పీ రమణయ్య, నాయకులు బొమ్మినేని వెంకట నరసయ్య, పీ. నకులు, కే మోహనరావు, గురుబ్రహ్మం, బాలనరసయ్య, రాచకుంట బాల, ఆర్ వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్, పసుపులేటి బాలయ్య, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



జువ్విగుంటలో స్వామికి స్వాగతం పలుకుతున్న మహిళలు(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న స్వామి

అధికారం చేపట్టగానే అర్హులైన పేదలకు ఇళ్లు

టంగుటూరు, ఏప్రిల్ 23 : తెలుగుదేశం కూటమి అధికారం చేపట్టగానే ఇల్లు లేని ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించనున్నట్లు తెలుగుదేశం కూటమి నాయకులు తెలియజేశారు. టంగుటూరు శివారు యానాది సంఘం, వెంకటాయపాలెంలో మంగళవారం ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావం ప్రచార కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ప్రజలందరి సౌభాగ్యం కోసం సూపర్ 6 పథకాలు అమలు పరచనున్నట్లు వెల్లడించారు. టీడీపీ కూటమి బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఒట్లేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ కూటమినేతలు కామని విజయకుమార్, రాంబాబు, బెల్లం కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, బ్రహ్మానందం, తోకల భారతి, భానుచందర్, దయానందం, జక్కుల శ్రీను, పెద్దోడు, యజమాని, కుందేటి వెంకట్రావు, మొలకలపల్లి శ్రీనివాసరావు, మద్దిరాల వెంకట్రావు పాల్గొన్నారు.



ఇంటింటికీ తెలుగుదేశంలో మాట్లాడుతున్న టీడీపీ కూటమి నాయకులు



సైకిల్‌పై వినూత్న ప్రచారం

తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపును కాంక్షిస్తూ, బుధవారం జరిగే నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయాలని11వ డివిజన్ తెలుగు తమ్ముళ్లు వినూత్న ప్రచారం నిర్వహించారు. గుర్రాల రాజ్‌విమల్, గంగవరపు సందీప్ ఆధ్వర్యంలో సైకిల్‌కు పసుపు రంగు బెలూన్లు కట్టుకుని, నగరంలో ప్రధాన కూడలిలో ప్రచారం చేశారు. ఆకర్షణగా నిలిచిన సైకిల్ బెలూన్ ర్యాలీ నగర ప్రజలను ఆకట్టుకుంది. - ఒంగోలు (కార్పొరేషన్)

ఒంగోలులో వైసీపీ ర్యాలీ రగడ

డబ్బులు ఇవ్వలేదని మహిళలు నిలదీత

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 23 : ఒంగోలు వైసీపీ అభ్యర్థి బాలినేని నామినేషన్ వ్యవహారం రోడ్డెక్కింది. భారీ ఎత్తున జన సమీకరణతో నగరంలో ప్రతి ఒక్కరూ చర్చించుకునేలా చేయాలని సోమవారం ఏర్పాటు చేసిన నామినేషన్ ర్యాలీ వ్యవహారం ఆ పార్టీ నేతలకు పలు డివిజన్‌లలో తలనొప్పిగా మారింది. జన సమీకరణ కోసం ర్యాలీకి వచ్చే వారికి రూ.300 ఆశగా చూపారు. డబ్బుల పంపిణీ వ్యవహారం రచ్చగా మారింది. ఒక్కో డివిజన్ నుంచి 250 మందిని తరలించే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. కొన్ని డివిజన్‌లో అంతే స్థాయిలో జనం రాగా, మరికొన్ని డివిజన్‌ల నుంచి జనం స్పందన కరువైంది. దీంతో వైసీపీ స్థానిక నాయకులు డబ్బులు నొక్కే ప్రయత్నాలు చేశారు. దీంతో అసలు గుట్టురట్టు అయింది. మంగళవారం నగరంలోని మిరియాలపాలెం వద్ద పలువురు మహిళలు వైసీపీ నాయకులను నిలదీశారు. ర్యాలీలో పాల్గొంటే తమకు రూ.300 ఇవ్వలేదని నిలదీయగా, మీపేరు లిస్ట్‌లో లేదంటూ వైసీపీ నేతలు చెప్పడంతో వారి మధ్య మాటలు పేలినట్లు సమాచారం. ఈ వ్యవహారం గంటకుపైగా సాగినా ఆ సమీపంలోని ఉన్న పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం.



మిరియాలపాలెం సెంటర్‌లో వైసీపీ నేతను నిలదీస్తున్న మహిళలు

జన కేతనం

రాజకీయ చిత్ర విచిత్రాలు

మద్యం.. మనీ..!

ఉపాధి పనిని నిలిపి.. కూలీలకు మస్టర్లు వేసి నామినేషన్‌కు తరలింపు

పర్చూరు వైసీపీ అభ్యర్థి కోసం అధికారుల స్వామి భక్తి



రోడ్డు పక్క వాహనం ఆపి మద్యం తాగుతున్న వైసీపీ శ్రేణులు

పర్చూరు, ఏప్రిల్ 23 : పర్చూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ నామినేషన్ కార్యక్రమంలో మద్యం.. మనీని జోరుగా పంచిపెట్టారు. అంతేగాక నామినేషన్ ర్యాలీలో పాల్గొంటే ఒక్కో వ్యక్తికి రూ.300, రూ.500 చొప్పున నగదును పంపిణీ చేశారు. కొన్ని మండలాల్లో ఉపాధి పనులను సైతం నిలిపివేసి, ఆ కూలీలందరినీ ప్రత్యేక వాహనాల్లో నామినేషన్‌కు తరలించడం గమనార్హం. ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు, మార్టూరు, యద్దనపూడి మండలాల్లో మద్యం.. మనీని పంచారు. మార్టూరులో ఉపాధి పనికి వెళ్లిన కూలీలకు మస్టర్ వేసి, వాహనాల్లో నామినేషన్‌కు తరలించారు. కోడ్ అమలులో ఉన్నా మద్యం ఏరులా ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

వైపాలెం ఓటరు తీర్పు ఎటు..?

ఇప్పటివరకు ఒక్క పూల సుబ్బయ్యకు మాత్రమే వరుసగా రెండోసారి దక్కిన విజయం

మొత్తం ఎనిమిదిసార్లు ఎన్నికలు

స్వతంత్రులకు అవకాశం ఇవ్వని నియోజకవర్గ ప్రజలు



పుల్లలచెరువు, ఏప్రిల్ 23 : ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు ఎన్నికల్లో విలక్షణమైన తీర్పును ఇస్తున్నారు. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఒక్క పూల సుబ్బయ్య మినహా ఎవరూ ఇక్కడ వరుసగా రెండు పర్యాయాలు గెలవలేదు. ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు ఎన్నికలు జరగ్గా నాలుగుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు సీపీఐ, రెండుసార్లు వైసీపీ విజయం సాధించాయి. మూడుసార్లు ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. ఇటు స్వతంత్రులకు కనీసం గౌరవ ప్రదమైన ఓట్లు కూడా దక్కించుకోలేకపోయారు.

ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గెలిచిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	ఓట్లు	పార్టీ	సమీప ప్రత్యర్థి	ఓట్లు	పార్టీ	మెజార్టీ
2019	ఆదిమూలపు సురేష్	99408	వైసీపీ	బి. అజితారావు	67776	టీడీపీ	31632
2014	పి. డేవిడ్‌రాజు	85774	వైసీపీ	బి. అజితారావు	66703	టీడీపీ	19071
2009	ఎ. సురేష్	67040	కాంగ్రెస్	పి. డేవిడ్‌రాజు	53846	టీడీపీ	13194
			పునర్విభజనకు ముందు...				
1972	కందుల ఓబుల్‌రెడ్డి	23166	కాంగ్రెస్	పూల సుబ్బయ్య	19072	సీపీఐ	4094
1967	పూల సుబ్బయ్య	26451	సీపీఐ	వై రామయ్య	13780	కాంగ్రెస్	12671
1962	పూల సుబ్బయ్య	25304	సీపీఐ	జంకె రామిరెడ్డి	14913	కాంగ్రెస్	10391
1960	జంకె రామిరెడ్డి	16672	కాంగ్రెస్	పూల సుబ్బయ్య	15449	సీపీఐ	1223
1955	నక్కా వెంకటయ్య	12323	కాంగ్రెస్	ఆర్ చెంచయ్య	9755	సీపీఐ	2568

1955లో జనరల్ నియోజకవర్గంగా ఎర్రగొండపాలెం ఏర్పడింది. అప్పటి నుంచి 1972 వరకు ఐదుసార్లు ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఈ నియోజకవర్గం రద్దయింది. 2009లో జరిగిన పునర్విభజనలో తిరిగి ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఏర్పడింది. ఈ పర్యాయం ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారింది. పూర్వం ఐదు పర్యాయాలు, పునర్విభజన అనంతరం మూడు పర్యాయాలు మొత్తం కలిపి ఎనిమిది పర్యాయాలు ఇక్కడ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ నుంచి ఆదిమూలపు సురేష్, కందుల ఓబుల్‌రెడ్డి, జంకె రామిరెడ్డి, నాక్క వెంకటయ్యలు ఒక్కసారి గెలుపొందారు. 2014లో వైసీపీ నుంచి పాలపర్తి డేవిడ్‌రాజు, 2019లో వైసీపీ నుంచి ఆదిమూలపు సురేష్‌లు విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి బూదాల అజితారావు వీరికి సమీప ప్రత్యర్థులుగా ఉన్నారు. కొత్తగా నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరగ్గా మూడుసార్లు ఇక్కడ టీడీపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిన బూదాల అజితారావు 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

నియోజకవర్గ ప్రొఫైల్

నియోజకవర్గం పేరు : ఎర్రగొండపాలెం ఎస్సీ (102)
రిజర్వేషన్ : ఎస్సీ
మండలాలు : ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు
మొత్తం పోలింగ్ కేంద్రాలు : 265
మొత్తం ఓటర్లు : 2,06596(31-03-2024 వరకు)
పురుషులు : 104898
మహిళలు : 101696
ఇతరులు : 2

మండలాల వారీగా ఓటర్లు

ఎర్రగొండపాలెం : 48523
పుల్లలచెరువు : 41970
త్రిపురాంతకం : 48761
పెద్దదోర్నాల : 33629
పెద్దారవీడు : 33,713

గెలుపు కోసం టీడీపీ ప్రత్యేక వ్యూహరచన

ప్రస్తుత 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి నుంచి గూడూరి ఎరిక్షన్‌బాబు, వైసీపీ నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ బరిలో పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ వీరి మధ్యే ఉంది. మూడేళ్ల క్రితం వైపాలెం టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకొని నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్నీ పదుల సంఖ్యలో సందర్శించిన ఎరిక్షన్‌బాబు గెలుపు కోసం ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ.. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తానో స్పష్టమైన హామీలు ఇస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఇక వైసీపీ తరఫున బరిలో ఉన్న తాటిపర్తి చంద్రశేఖర్ గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైపాలెం ఓటరు తీర్పు ఎటువుంటుందో వేచిచూడాల్సిందే.

వైసీపీ అభ్యర్థి నామినేషన్‌లో వలంటీర్లు

పంచాయతీ కార్యదర్శికి టీడీపీ నేతల ఫిర్యాదు

యద్దనపూడి(మార్టూరు), ఏప్రిల్ 23 : మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు మంగళవారం పర్చూరులో వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ నామినేషన్ కార్యక్రమానికి వెళ్లినట్లు టీడీపీ గ్రామ నాయకులు పంచాయతీ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వలంటీర్లు ముగ్గురూ వైసీపీ కార్యకర్తల వాహనంలో వెళ్లినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణలో అసలు విషయం తేలనుంది.



వైసీపీ ర్యాలీపై కేసులు

ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు

అద్దంకి, ఏప్రిల్ 23 : వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో నిబంధనలు ఉల్లంఘనపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వైసీపీ అభ్యర్థి చినహనిమిరెడ్డి సోమవారం ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ర్యాలీలో నిబంధనలు ఉల్లంఘించి డీజే బాక్సులు, భారీ క్రేన్‌లతో దండలు వేయటం, బాణసంచా కాల్చడంపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీదేవి, హరిత ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద రూ.2.58 లక్షలు సీజ్



నగదును తనిఖీ చేస్తున్న పోలీసులు

పామూరులో ఘటన

పామూరు, ఏప్రిల్ 23 : మండలంలోని తిరగలదిన్నె గ్రామ చెక్‌పోస్టువద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీలో పట్టుబడ్డ నగదును సీజ్ చేశారు. ఎస్ఐ సైదుబాబు వివరాల ప్రకారం.. పట్టణంలోని నెల్లూరు రోడ్డులోగల సాయి ప్రొవిజన్ షాపునకు సంబంధించిన వాహనం నెల్లూరు జిల్లా చాకలకొండ గ్రామం నుంచి రాత్రి పామూరుకు వస్తుంది. ఈక్రమంలో చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్ఎస్‌టీ అధికారి రత్నకుమార్ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో రూ.2 లక్షల 58వేల 350 నగదును గుర్తించారు. సరైన ధ్రువీకరణ పత్రాలను వాహన డ్రైవర్ గంధం త్రిమోతి చూపించలేదు. ఏఆర్‌వో షాకీర్ పాష, ఎస్ఐ ఎం.సైదుబాబుల సమక్షంలో పంచనామా నిర్వహించి పట్టుకొన్న నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.



అద్దంకిలో సోమవారం నిర్వహించిన వైసీపీ ర్యాలీకి పలుచగా హాజరైన జనం

వైసీపీ నేతల్లో అంతర్మథనం

పర్చూరు, అద్దంకిలో తుస్సుమన్న ర్యాలీలు
డబ్బు, లిక్కర్, వాహనాలు పంపినా ఇలా ఎందుకు జరిగిందంటూ మల్లగుల్లాలు
పర్చూరులో నామినేషన్‌కు చీరాల నుంచి వచ్చిన బాలాజీ
జనం కోసం గంటన్నర వేచి ఉన్న హనిమిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

పర్చూరు, అద్దంకి అసెంబ్లీ స్థానాల వైసీపీ అభ్యర్థులు, ముఖ్యనాయకుల్లో అంతర్మథనం ఆరంభమైంది. అన్నిహంగులు సమకూర్చినా నామినేషన్ దాఖలు కార్యక్రమం విజయవంతం కాకపోవటం, వచ్చిన పార్టీశ్రేణులు కూడా ఒక పద్ధతిలో ర్యాలీగా గుమ్మిగూడకపోవటం అంతకుమించి కొన్నిగ్రామాల నుంచి అసలు జనం కదలకపోవటం తదితర అంశాలపై నాయకులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. అద్దంకిలో టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నామినేసన్ దాఖలు చేయగా పర్చూరు టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అద్దంకి వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయగా పర్చూరు వైసీపీ అభ్యర్థి బాలాజీ మంగళవారం నామినేషన్ వేశారు. ఇరుపార్టీల అభ్యర్థుల నామినేషన్ల తీరుతెన్నులను పరిశీలిస్తే అన్నివిధాలా వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలు వెలవెలబోయినట్లు చెప్పుకోవచ్చు. సంఖ్యాపరంగా ఎవరి నామినేషన్లకు ఎంతమంది హాజరయ్యారనే విషయం పక్కనపెడితే కార్యక్రమం నిర్వహణలో అభ్యర్థుల నాయకత్వ లక్షణాలు తేటతెల్లమయ్యాయి. ఆ విషయంతో టీడీపీ అభ్యర్థులు సాంబశివరావు, రవికుమార్‌లు తమ నాయకత్వ పటిమను విజయవంతంగా ప్రదర్శించుకోగా వైసీపీ అభ్యర్థులైన యడం బాలాజీ, హనిమిరెడ్డిల నాయకత్వ లోపాలు తేటతెల్లమయ్యాయి. జనసమీకరణలో రెండుచోట్ల వైసీపీ అభ్యర్థుల వైఫల్యం కనిపించింది.

అద్దంకిలో అయితే ఆ నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ ఇంతవరకు వైసీపీ అభ్యర్థులు ఇంత సాదాసీదాగా ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు వేయలేదనే మాట వినిపించింది. సింగరకొండ దేవస్థానం వరకు హనిమిరెడ్డి వచ్చే సమయానికి ఆ పార్టీ శ్రేణులు అక్కడకు చేరలేదు. అక్కడ పూజలు అనంతరం ర్యాలీగా ముందుకు రావాల్సిన హనిమిరెడ్డి సింగరకొండ రోడ్డుపై ఉన్న పార్టీ కార్యాలయం వద్దకు చేరి ర్యాలీకి కార్యకర్తలు వచ్చేవరకు వేచిచూడాల్సి వచ్చింది. గంటన్నరపాటు ఆయన అక్కడ వేచి ఉండి ఆ తర్వాత నామినేషన్ కార్యక్రమానికి వచ్చారు. రవికుమార్ నామినేషన్‌కు ఊరువాడ కదిలిరాగా ఆయన 40వేల మందికి ఏర్పాటుచేసిన భోజనాలు మొదటి దశలోనే అయిపోయి వెనుక చాలామంది భోజనాలకు ఇబ్బందిపడ్డారు. హనిమిరెడ్డి కార్యక్రమానికి ముందు వెనుక వచ్చిన వారిని ఆయన కుటుంబసభ్యులను కలిపినా 10వేలకు లోపే. వైసీపీ నాయకులే 15వేల మంది వచ్చారని చెప్పుకుంటున్నారంటే వాస్తవంగా అందులో సగం మందే వచ్చినట్లు. పర్చూరు వైసీపీ అభ్యర్థి బాలాజీ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా డబ్బు, మద్యం పంపిణీ ఎప్పుడూ లేనంతగా జరిగింది. ఆయన కార్యక్రమానికి వచ్చిన జనం బొమ్మల సెంటర్‌లో విగ్రహాలకు మూడువైపులా నిండారే తప్పా వీధులన్నీ ఖాళీగా కనిపించాయి. ఏలూరి నామినేషన్‌కు ఒకటిన్నర నుంచి రెండు కిలోమీటర్లు పొడవునా జనం కిటకిటలాడారు. బాలాజీ కార్యక్రమానికి బొమ్మల సెంటర్‌లో విగ్రహాల చుట్టూ పర్లాంగు దూరంలోపే జనం కనిపించారు. పర్చూరు నియోజకవర్గంలో నామినేషన్‌కు బాలాజీ మరో నియోజకవర్గం చీరాల నుంచి రాగా హనిమిరెడ్డి కూడా నియోజకవర్గయేతర ప్రాంతం నుంచి వచ్చారు. ఆయన స్వగ్రామం పల్నాడు జిల్లాలో ఉండగా ఆయన తాత్కలిక నివాసకేంద్రాన్ని కూడా ఒంగోలులో ఏర్పాటు చేసుకున్నారు. గత కొంతకాలంగా మీతోనే ఉంటాం. మీలో మేం ఒకరం అని చెప్పుకునే ఇద్దరు అభ్యర్థులు ఇంతవరకు నియోజకవర్గంలో తాత్కాలికంగానైనా నివాసం ఏర్పాటు చేసుకోకపోవటాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లోనే సంప్రదాయ బద్ధంగా వైసీపీకి మెజార్టీ ఓట్లు ఉన్నట్లు భావిస్తున్న దళితుల్లో ఒక వర్గం, మైనార్టీలు, రెడ్డి సామాజికవర్గం వారు ఎక్కువగా వారి కార్యక్రమాలకు వచ్చారు. వారికి సమర్థవంత నాయకత్వంలో దిక్కుచీగా వైసీపీ అభ్యర్థులు వ్యవహరించకపోవటంతో వారి నాయకత్వ లోపాలను పసిగట్టిన ప్రజలు వారి సారథ్యంలో మనకు రక్షణ, నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమా అంటూ సమీక్షించుకోవటం ప్రారంభమైంది.



హారతులతో జనార్దన్‌కు స్వాగతం

దామచర్ల బహుముఖ వ్యూహం

• సమర్థ ప్రణాళిక.. పకడ్బందీ కార్యాచరణతో ముందుకు • గత ఎన్నికల్లో దూరమైన వారిని అక్కున చేర్చుకుంటున్న వైనం

- టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, ప్రత్యర్థి అసమర్థతపై విస్తృత చర్చ
- అధికార పక్ష అవినీతి, అరాచకాలపై ధీటుగా స్పందన
- ఆత్మీయ సమావేశాలు, వ్యక్తిగతంగా భేటీలు, ప్రణాళికాబద్ధంగా క్యాంపెయిన్
- పార్టీలోకి విభిన్న వర్గాల నుంచి చేరికలు, ట్రస్ట్ పేరుతో పేదలకు సహాయం

ఒంగోలు, ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఎన్నికలలో గెలుపే కాక భారీ మెజార్టీ సాధనే లక్ష్యంగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ వ్యూహం పన్నారు. తదనుగుణంగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం బహుముఖ వ్యూహంతో ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. దాదాపు ఏడాది క్రితం నుంచే ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టిన జనార్దన్.. జిల్లాలో సాగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నుంచి మరింత క్రియాశీలకంగా పనిచేయడం ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రెండు, మూడు మాసాలుగా నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వారి పరిస్థితిని ఆనుపానాలు తెలుసుకుని ఆయా ప్రాంతాలలో అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్దిష్ట ప్రణాళికను అమలు చేస్తున్నారు. వాటి ఫలితాలు ప్రస్తుతం ఎన్నికల క్యాంపెయిన్‌లో జనార్దన్‌కు కలిసివస్తున్నాయి.

అన్ని వర్గాల వారి సమన్వయంతో ముందుకు..

ప్రధానంగా నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులతోపాటు అన్ని వర్గాలనూ ఎన్నికల కార్యాచరణలో దింపడంలో జనార్దన్ విజయవంతం అయ్యారు. ఒంగోలు ఎమ్మెల్యేగా 2014లో గెలిచినా, ఆ తర్వాత ఎన్నికలకు ముందు పార్టీని విభేదించి దూరమైన వారిపైనా ప్రత్యేక దృష్టి సారించారు. దూరమైన వారిని తిరిగి దగ్గరకు చేర్చుకోవడంలో సఫలీకృతులయ్యారు. ఆయా ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రం నుంచి నియోజకవర్గ స్థాయిలో ప్రభావం చూపగలిగిన అనేక మందిని గుర్తించి పలు బాధ్యతలు అప్పగించారు. వారు మరింత క్రియాశీలకంగా పనిచేసేలా సమర్థ ప్రణాళికలు రూపొందించి అమలు చేయించడంలో సఫలీకృతులయ్యారు. ఈ చర్యల వల్ల.. వివిధ వర్గాలలో మంచి సంబంధాలు ఉన్న ఆయా వర్గాలను ప్రభావితం చేయగలిగిన వారంతా ప్రస్తుతం ఎన్నికల పనిలో బిజీగా కనిపిస్తున్నారు.

కూటమి పార్టీలనూ భాగస్వామ్యం చేసి..

టీడీపీ కూటమిలో పార్టీలు బీజేపీ జనసేన నేతలతోనూ జనార్దన్ సమన్వయం చేసుకుంటూ ముందుకెళుతున్నారు. ఓట్ల పరంగా నియోజకవర్గంలో బీజేపీ ప్రభావం అంతంత మాత్రమే అయినప్పటికీ.. గణనీయ సంఖ్యలో ఓటింగ్ ఉన్న జనసేన పార్టీ శ్రేణులు దామచర్ల పక్షాన గట్టిగా పనిచేస్తున్నాయి. అలా ఆ పార్టీ క్యాడర్‌ను ఆకట్టుకోవడంలోనూ, నాయకులను సమన్వయం చేసుకోవడంలోనూ విజయవంతం అయ్యారు.

ప్రజల్లోకి వైసీపీ అరాచకాలు, భూకబ్జాలు, అవినీతి

దాదాపు రెండు మాసాలుగా బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో విస్తృతంగా ప్రజల్లో తిరుగుతున్న దామచర్ల జనార్దన్.. ఆ కార్యక్రమంలో వైసీపీ నేతల అరాచకాలు, భూదందాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. అంతేగాక రాష్ట్ర స్థాయిలో వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త పాలన, అప్పుల కుప్పలు, మరోవైపు అధికార వైసీపీ ప్రజాప్రతినిధిగా ఒంగోలులో ప్రాతినిధ్యం వహిస్తున్న బాలినేని, ఆయన కుటుంబ సభ్యుల అవినీతి అరాచక వ్యవహారాలు, భూదందాలు, వివిధ వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైనాలను జనంలోకి తీసుకెళ్లగలిగారు. తమకు అడ్డుగా ఉంటున్న వివిధ వర్గాలపై దాడులు, టీడీపీ శ్రేణులపై వైసీపీ కక్షసాధింపు చర్యలను ఎండగడుతున్నారు.

టీడీపీ చేసిన అభివృద్ధి.. వైసీపీ అసమర్థ పాలనను వివరిస్తూ..

టీడీపీ ప్రభుత్వ కాలంలో ప్రత్యేకించి తాను ప్రజాప్రతినిధిగా ఒంగోలు నియోజకవర్గంలో ప్రత్యేకించి నగరంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు గుర్తుచేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రధానంగా రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు, పారిశుధ్యం తదితర అంశాలలో చేసిన కృషిని, అదే సమయంలో ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో బాలినేని అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టకుండా అనుసరిస్తున్న నిర్లక్ష్యం, అసమర్థత వ్యవహారాన్ని ప్రజల్లో విస్తృత చర్చ జరిగేలా చేయడంలో విజయం సాధించారు. ఈ క్రమంలో టీడీపీకి అండగా ఉంటున్న సంప్రదాయ వర్గాల వారితో పాటు గతంలో అండగా ఉండి.. గత ఎన్నికలలో దూరమైన సామాజిక వర్గాల వారు సైతం దగ్గర అవుతున్నారు. అంతేకాక ప్రత్యర్థి పార్టీకి అండగా నిలిచే సామాజిక వర్గాల వారిని కూడా ఆలోచింపజేయగలుగుతున్నారు. ఫలితంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల విభిన్న సామాజిక వర్గాల వారు పెద్దసంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. దాదాపు నెలన్నర రోజులుగా నిత్యం దామచర్ల సమక్షంలో ఇలాంటి చేరికలు భారీగానే ఉంటుండం అందుకు నిదర్శనం.

ఆత్మీయ సమావేశాల్లో తలమునకలు

ఒక వైపు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తూనే.. మరోవైపు వివిధ సామాజిక వర్గాల వారితో ఆత్మీయ సమావేశాలు నిర్వహించడంలో జనార్దన్ తలమునకలయ్యారు. అలాగే స్వంత పార్టీలోని వివిధ స్థాయిల్లోని ఆయా గ్రామాల, మండల పట్టణ స్థాయి నాయకులతోనూ ప్రత్యేక భేటీలు నిర్వహిస్తున్నారు. ఇలా అన్ని వైపుల మద్దతు పొందుతున్నారు. అంతేగాక కూటమిలో భాగస్వామ్యమైన జనసేన, బీజేపీల నుంచి సంపూర్ణ సహకారం పొందుతున్నారు.



సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న జనార్దన్

వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు

- ఒక్కరోజుల్లో 490 కుటుంబాలు టీడీపీలో చేరిక
- పసుపు కండువా కప్పి ఆహ్వానించిన అశోక్‌రెడ్డి



కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 23 : నియోజకవర్గంలో వైసీపీకి వరసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా మంగళ వారం గిద్దలూరు వైసీపీ కీలకనేత దప్పిలి కాశిరెడ్డి వైఎస్ఆర్‌సీపీని వీడి 200 మంది అనుచరులతో టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టణ సమస్యల పరిష్కారానికి తాను ఎంతో కృషి చేశానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్దన్, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు పాముల వెంకటరమణయాదవ్, కమతం శ్రీను, బాలీశ్వరయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు. రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు చప్పిడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరందరికీ ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ మున్ని, ఎస్‌డీ.ఉస్మాన్, పాలకవీటి బాలకృష్ణ, వేమూరి మోహన్, చప్పిడి హరీష్, కందిమళ్ల వెంకట నారాయణ, షేక్ హరీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాచర్ల మండలం జేపీ.చెరువు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా ఆహ్వానించారు. గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యుడు ఉడుముల ప్రవీణ్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అశోక్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్య క్రమంలో మాజీ సర్పంచ్ గోపాలక్రిష్ణ, అంకనాంపల్లి శేఖర్ ఉన్నారు.



అనుమలవీడు నుంచి చేరికలు

గిద్దలూరు టౌన్ : జగన్ పాలనలో యువత భవిష్యత్తు అంధకారంలో ఉన్నట్లు గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళ వారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో చదువుకున్న యువత జీవితాల్లో చీకటి మినహా వెలుతూరు లేదన్నారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీకి దిక్కులేదన్నారు. పోలీసు ఉద్యోగాలు భర్తీ కాలేదని ఆయన ఆదోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు లేవన్నారు. చంద్రబాబు యువతకు ఉద్యో గాలు తెస్తే, జగన్ గంజాయి తెచ్చాడన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, నాయకులు కడియం శేషగిరి, బిల్లా రమేష్ పాల్గొన్నారు. పలువురు మాజీ సైనికోద్యుగులు ఈ సందర్భంగా అశోక్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించారు.



టీడీపీలో చేరుతున్న దుప్పలి కాశిరెడ్డి

నేడు టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి నామినేషన్

గిద్దలూరు టౌన్ : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి ఫారెస్టు ఆఫీసు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో వద్ద ముత్తుముల అశోక్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. కూటమి తరపున టీడీపీతో పాటు జనసేన బీజేపీలు కూడా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారపేట, ఏప్రిల్ 23: రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్సై బి.నరసింహారావు సూచించారు. మంగళవారం సాయంత్రం బేస్తవారపేట మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామాలను సందర్శించి గ్రామస్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండ ఉండాలన్నారు. అందుకు తగిన సూచనలు ఇచ్చారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసుకోవాలని ఓటర్లను ఎవరైన భయభ్రాంతులకు గురిచేస్తే వారిపై చట్టరంగా తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

పొదిలి, ఏప్రిల్ 23 : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాతమైన వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని, ఎస్ఐ కోటయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని చినబస్టాండ్ నుంచి విశ్వనాథపురం వరకు స్పెషల్ పార్టీ పోలీసులతో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కవాతు రూపంలో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి హింసకు తావులేకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టినా, భయాందోళనలకు గురిచేసినా వెంటనే తెలియజేయాలన్నారు. అట్టివారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగన్ అరాచకాలకు ఓటుతో గుణపాఠం చెప్పాలి

జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్



ప్రచారం నిర్వహిస్తున్న కాశీనాథ్

మార్కాపురం, ఏప్రిల్ 23: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో మంగళ వారం ఇంటింటికి మన కందుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే ఏపీలో అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.15వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి కింద 15 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు తెలిపారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో ఎంపీగా మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలీ, బీజేపీ ఇన్‌చార్జ్‌గా పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

తురిమెళ్ల వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు ఎంపీడీవోకు అందజేస్తున్న వలంటీర్లు

కంభం, ఏప్రిల్ 23 : కంభం మండలం తురిమెళ్ల సచివాలయ పరిధిలో 22 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఆ పత్రాలను ఎంపీడీవో మస్తాన్ వలికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో తాము రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశానికి ఎంపికలు

కంభం, ఏప్రిల్ 23 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వమిస్తున్నట్లు కంభం ప్రిన్సిపల్ చాముండేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థులకు మెరిట్ లిస్ట్ ప్రకారం.. భర్తీకై ఈ నెల 26న కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. మొబైల్ నెంబర్‌లో సమాచారం అందిన విద్యార్థినులు ర్యాంకు కార్డు, ఇతర సర్టిఫికేట్లతో సింగరాయకొండ గురుకుల పాఠశాలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 7815805491 సంప్రదించాలని తెలిపారు.

భారీగా నామినేషన్లు

- ఒంగోలు పార్లమెంట్‌కు ఎనిమిది దాఖలు
- ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు
- 38 మంది అభ్యర్థులు 40 సెట్ల సమర్పణ

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23 : జిల్లాలో నామినేషన్‌ల దాఖలు ఊపందుకుంది. మంగళవారం ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 46మంది అభ్యర్థులు 48 సెట్ల నామినేషన్ పత్రాలకు ఆర్వోలకు అందించారు. వారిలో ఒంగోలు పార్లమెంట్ నుంచి ఎనిమిది మంది ఉన్నారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గంనుంచి ముగ్గురు, దర్శి నుంచి ఇద్దరు, సంతనూతలపాడు నుంచి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, ఒంగోలు నియోజక వర్గం నుంచి ఏడుగురు అభ్యర్థులు ఎనిమిది నామినేషన్లు సమర్పించారు. కొండపి నియోజకవర్గం నుంచి ఆరుగురు అభ్యర్థులు, మార్కాపురం నియోజకవర్గం నుంచి ఏడుగురు, గిద్దలూరు నుంచి ఇద్దరు, కనిగిరి అసెంబ్లీ స్థానం నుంచి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

నీళ్లు కూడా ఇవ్వలేని పార్టీలో ఉండలేక..!

- వైసీపీని వీడి 35 కుటుంబాలు టీడీపీలో చేరిక
- ఆహ్వానించిన ఆ పార్టీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 23 : దోర్నాల మండలంలో వైసీపీని వీడి 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆ మండంలోని బొమ్మలాపురం గ్రామ తూర్పుపల్లె నుంచి వైసీపీ నుంచి టీడీపీలోకి 20 కుటుంబాలు, వై.చెర్లోపల్లి గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలో 15 కుటుంబాలు చేరాయి. వీరంతా మంగళవారం ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయానికి రాగా అందరికీ ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వం గొంతు తడుపుకోవడానికి కూడా నీళ్ల ఇవ్వలేకపోయిందని దీంతో టీడీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, జడ్పీమాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర, దోర్నాల మండల టీడీపీ అధ్యక్షులు ఏర్వ మల్లిఖార్జునరెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దోడ్డా శేషాద్రి, బీసీ సెల్ నాయకులు ఈదర మల్లయ్య పాల్గొన్నారు.



టీడీపీలకి చేరిన కేడర్‌తో మన్నె రవీంద్ర, ఎరిక్షన్‌బాబు

27న ముస్లిం మైనారిటీల సభ

ఈనెల 27న ఎర్రగొండపాలెం నియోజకవర్గ ముస్లిం మైనార్టీల మహాసభ జరుగుతుందని, నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు అందరూ పాల్గొని విజయవంతంచేయాలని నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో మంగళ వారం ముస్లిం మైనా ర్టీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు. ఎర్రగొండపాలెంలో షాదీఖానాకు స్థలం మంజూరు చేయించి షాదీఖానా నిర్మించారని అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ షరీఫ్ పాల్గొన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని మండలాలల్లో, గ్రామాల్లో ఉన్న ముస్లిం మైనార్టీలు అందరు పాల్గొని, మీ సమ్యలు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీమాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నెరవీంద్ర, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ యాసఫ్, నియోజకవర్గ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలి, ముస్లిం నాయకులు, ముస్లిం యువత పాల్గొన్నారు.



ముస్లిం మైనారిటీలతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

బైకును ఢీకొన్న కారు..

- వ్యక్తి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- ఇంట శుభకార్యం కిరణా సరుకులు తెస్తుండగా విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 23 : బైకును కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రాయవరం గ్రామ పరిధిలో మంగళవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొనకనమిట్ల మండలం గుర్రాలమడుగు గ్రామానికి చెందిన బోయిన కాశయ్య, బోయిన కృష్ణలు మార్కాపురం నుంచి స్వగ్రామం వెళుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఒంగోలు మీదుగా నెల్లూరుకు కారు వెళుతోంది. రాయవరం గ్రామం వద్ద ఉన్న మెడికల్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఢీ కొట్టింది. దీంతో కాశయ్య అక్కడికక్కడే మృతిచెందగా, కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడు కాశయ్యకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని మృతుని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన బోయిన కృష్ణను వైద్యం నిమిత్తం స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కారు నడుపుతున్న వ్యక్తిని కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించారు.

ఇంట శుభకార్యం ఉండగా...

కాశయ్య ఇంట శుభకార్యం ఉండగా, దానికి కావాల్సిన కిరణా సరుకులు మార్కాపురంలో కొనుగోలు చేసి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదం చోటుచేసుకొంది. దీంతో గుర్రాలమడుగులో తీవ్ర విషాదం నెలకొంది. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో కాశయ్య భార్య విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఎన్నికల నేపథ్యంలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అదనపు బలగాలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 23: పట్టణంలోని గడియార స్తంభం కూడలిలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అదనపు బలగాలు మాక్‌డ్రిల్, లాంగ్‌మార్చ్ నిర్వహించాయి. కార్యక్రమాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గడియారస్తంభం కూడలిలో బీఎస్ఎఫ్ స్పెషల్ ఫోర్స్ టీం మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించింది. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ముందుగా సాయుధ బలగాలు లాంగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు అబ్దుల్ రహమాన్, వెంకటేశ్వర నాయక్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయం సాధించాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 23: అందరి సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం సాధించాలని మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో మంగళవారం రాత్రి నామినేషన్ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. అనంతరం 23వ వార్డులో ఎన్నికల ప్రచారం కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మీ కార్యకర్తలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున, మౌలాలి, కొప్పుల శీను, ఘూస్సీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కల్యాణమూర్తిగా చెన్నయ్య విశేషంగా హాజరైన భక్తులు

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- కనుల పండువగా చెన్నయ్య కళ్యాణం
- చూసిన కనులదే భాగ్యం
- చెన్నుని పరిణయంతో పులకించిన మార్కాపురం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 23: మార్కాపురంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం చెన్నయ్యకు పరిణయ వేడుకలు వైభవంగా నిర్వ హించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాద్యాలు, 'భక్తుల జై చెన్నకేశవ', 'జైజై చెన్నకేశవ' నామస్మరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుని కళ్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం, జీలకర్ర బెల్లం అమ్మవారి, స్వామివారి తల మీద ఉంచి కల్యాణ వేడుకలు నిర్వహించారు. మంగళ సూత్రధారణ నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు పోశారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, వేములకోటకు చెందిన ఆమంచి వెంకటరమణ తదితరులు పట్టు వస్త్రాలు సమర్పించారు. చెన్నకేశవస్వామి కల్యాణ ఘట్టా లు తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో తేలియాడారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

వైభవంగా గిరి ప్రదక్షిణ



త్రిపురాంతకేశ్వరాలయ గిరి ప్రదక్షిణం చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం, ఏప్రిల్ 23: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని శ్రీక్రోధి నామ సంవత్సర శుద్ధ పౌర్ణమి సందర్భంగా మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకులు విశ్వన్నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పు వైపు మెట్ల నుండి ప్రదక్షిణం ప్రారంభించారు. మంగళవాయిద్యాల నడుమ 'ఓం నమః శివాయ' నామ మంత్రాన్ని జపిస్తూ కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు, ఆలయ పాలక మండలి సభ్యులు, వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు నామినేషన్లు దాఖలు

గిద్దలూరు, ఏప్రిల్ 23 : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ అభ్యర్థిగా మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి మరోసెట్ నామినేషన్ దాఖలు చేయగా గిద్దలూరు మండలం దంతెరపల్లి గ్రామానికి చెందిన కమిడెల కోటేశ్వర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారి నాగజ్యోతికి నామినేషన్ పత్రాన్ని అందజేశారు. దీంతో మొత్తం ఇప్పటివరకు 14 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అయింది.

నగదు బహుమతి అందజేత



నగదు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

గిద్దలూరు, ఏప్రిల్ 23 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన బి.విజయశ్రీని హెచ్‌ఎం పి.నాగ భూషణ్‌రెడ్డి సన్మానించారు. రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. అలాగే 573 మార్కులు సాధించిన షేక్ హసీనాను, 566 మార్కులు సాధించిన కె.వెంకటశ్వేతలను సైతం సన్మానించి పారితోషికం అందజేశారు.

బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 23: మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీలు పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయురాలు వి.శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఎమ్ఎస్ రజిత 586 మార్కులు సాధించిందన్నారు. 500కు పైగా మార్కులు 39 మంది బాలికలు సాధించారన్నారు. ఇంగ్లీష్ మీడియం నుంచి 194 మందికి 184 మంది, తెలుగు మీడియం నుంచి 88 మందికి గాను 61 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఏడు నామినేషన్లు దాఖలు

మార్కాపురం, ఏప్రిల్ 23: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా అన్నా వెంకటరాంబాబు, స్వతంత్రులుగా యేరువ నాగార్జునరెడ్డి, కె.బ్రహ్మారెడ్డి, కంది వెంకటనారాయణరెడ్డి, పఠాన్ సుబానీ, భవనం వెంకటేశ్వరరెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు.

బాల వికాస్ కేంద్రాలతో మంచి నడవడిక



విచిత్ర వేషధారణలతో చిన్నారులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 23: సమరసత సేవా ఫౌండేషన్, బాల వికాస్ కేంద్రాల ద్వారా మంచినడవడిక అలవరుతుందని డాక్టర్ వింధ్యా వైష్ణవి అన్నారు. స్థానిక నెహ్రూ బజార్‌లోని పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలవికాస్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.వింధ్యావైష్ణవి మాట్లాడుతూ.. పిల్లల్లో పాటలు, కళల ద్వారా వారిలోని సృజనాత్మకత వెలికి వస్తుందన్నారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సమరసత సేవా ఫౌండేషన్ నాయకులు శివప్రసాద్, వనజాక్షి, సుజాత, భాగ్యలక్ష్మీ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



బీరువా అందజేస్తున్న కమ్మసంఘం సభ్యులు

ఎర్రగొండ పాలెం, ఏప్రిల్ 23 : ఎర్రగొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎర్రగొండపాలెం కాకతీయ కమ్మ సేవా సమితి ఆర్థిక సహకారంలో రూ.7వేల విలువైన ఇనుప బీరువాను ఆ సంఘం అధ్యక్షుడు ఉన్నం నరసింహారావు, స భ్యులు బహూకరించారు. పాఠశాల గ్రంథాలయంలో పుస్తకాలు భద్రపరుచుకొనేందుకు దీనిని అంద జేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షులు కూచిపూడి కోటయ్య కార్యదర్శి కందుల సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు చలమయ్య, హెచ్‌ఎం వేముల పిచ్చిరావు, ఉపాధ్యాయులు శాఖమూరి శ్రీనివాసరావు, సభ్యులు కొత్త భాస్కర్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై వేంకటేశ్వరుడు



వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కంభం, ఏప్రిల్ 23 : శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేంకటేశ్వరస్వామి ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్ర ప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారికి కాయకర్పూరాలు సమ ర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి ఊరేగింపు ముందు శ్రీలక్ష్మీపద్మావతి వేంకటేశ్వర కోలాట బృందం వారు చేసిన కోలాటం భక్తులను అలరించాయి.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గిద్దలూరు : రాచర్ల మండలంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి వారు శేషవాహనంలో భక్తులకు దర్శన మిచ్చారు. రాత్రి హనుమంత వాహనంలో శ్రీరాముని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. నెమలిగుండంలోకి స్నానానికి దిగే భక్తులకు ప్రమాదం జరుగకుండా గజ ఈతగాళ్ళను ఉంచారు. కులసంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



పీసీపల్లిలో పార్టీశ్రేణులతో చర్చిస్తున్న కోటపాటి

ఉగ్ర నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పీసీపల్లి, ఏప్రిల్ 23: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం కనిగిరిలో నామినేషన్ వేస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని గుదేవారిపాలెం, పీసీపల్లి, వేపగుంపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలం నుంచి అధికసంఖ్యలో తరలివచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇరిగినేని రవీంద్రబాబు, గుర్రం వెంకటేశ్వర్లు, గడ్డం బాలసుబ్బయ్య వడ్డెంపూడి వెంకట్(చిన్నా), తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుఖాయం

పామూరు, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు మెజార్టీ సీట్లలో గెలిచి చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. మంగళవారం తిరగళదిన్నెలో పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం జరిగే ఉగ్ర నామినేషన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గంగరాజుయాదవ్, బొట్ల నాగార్జున, మల్లెబోయిన గురుబ్రహ్మాం, మల్లెబోయిన బాలబ్రహ్మాయ్య, ఆవుల రమణమ్మ, మేకల బాలగంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను పరామర్శించిన కోటపాటి, ఇరిగినేని

పీసీపల్లి, ఏప్రిల్ 23: టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్యను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్‌రావు, ఇరిగినేని రవీంద్రబాబు మంగళవారం పరామర్శించారు. రామయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. చెన్నైలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. పార్టీశ్రేణులతో కలిసి రామయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం కుదుటపడే వరకు విశ్రాంతి తీసుకోవాలని వారు ఆయనకు సూచించారు.

మాగుంట విజయబాబుకు టీడీపీ నేతల నివాళి



మాగుంట విజయబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ తదితరులు

దర్శి, ఏప్రిల్ 23: దివంగత మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి కుమారుడు విజయబాబు గుండెపోటుతో నెల్లూరులో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, తాళ్లూరు ఎంపీపీ పి. శ్రీనివాసరావు, నగర పంచాయతీ కౌన్సిలర్ విసి రెడ్డి తదితరులు మంగళవారం హుటాహుటిన నెల్లూరుకు వెళ్లి నివాళ లర్పించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో కొద్దిసేపు మాట్లాడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తాళ్లూరు: మాజీ ఎంపీ మాగుంట సుబ్బిరామిరెడ్డి తనయుడు విజయ్‌రెడ్డి మృతిపట్ల టీడీపీ నేత, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. మంగళవారం నెల్లూరులో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని విజయ్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. మాగుంట కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి జాతర



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

ముండ్లమూరు, ఏప్రిల్ 23: మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, పసుపుగల్లు గ్రామాల మధ్య వేంచేసి ఉన్న పాటిమీద ప్రసన్నాంజనేయ స్వామి జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ జాతర జరుగుతుంది. జాతర మహోత్సవం సందర్భంగా వివిధ గ్రామల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. ఉమా మహేశ్వర అగ్రహారం, పసుపుగల్లు, చింతలపూడి, వేముల బండ, ముండ్లమూరు, తమ్మలూరు గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయం సమీపంలో మొక్కుబడులు, పొంగళ్ళు పెట్టారు. ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈసందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఉమామహేశ్వర అగ్రహారంలో ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు.

కష్టపడి పని చేయండి.. లక్ష్మి గెలుపునకు కృషి చేయండి



మాట్లాడుతున్న గొట్టిపాటి భరత్

ముండ్లమూరు, ఏప్రిల్ 23: దర్శి అసెంబ్లీకి టీడీపీ కూటమి తరుపున పోటీ చేస్తున్న తన సోదరి గొట్టిపాటి లక్ష్మి గెలుపునకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కష్టపడి పనిచేయాలని గొట్టిపాటి భరత్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ముండ్లమూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముండ్లమూరు మండలంపై తమ కుటుంబానికి ఎనలేని అభిమానం ఉందన్నారు. తన తాత హనుమంతరావు, తన తండ్రి నరసయ్యలు పనిచేసిన కాలంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ గెలుపునకు కృషి చేసి తన అక్క లక్ష్మిని అసెంబ్లీకి పంపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కె.నాగరాజు, వరగాని పౌలు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్

కురిచేడు, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికలతో భాగంగా మంగళవారం కురిచేడు మండలంలో ఎస్సై శ్రీకాంత్ కేంద్ర బలగాలతో కలసి కవాతు నిర్వహించారు. కురిచేడు ప్రధాన వీధులలో కవాతు నిర్వహించారు. పొట్లపాడు, పేరుంబొట్లపాలెం, గంగదొనకొండ గ్రామాలలోనూ కవాతు చేశారు. సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్సై సూచించారు.

వడదెబ్బకు మహిళ మృతి

తాళ్లూరు, ఏప్రిల్ 23: మిరపకాయల కోతకు వెళ్లిన మహిళా కూలీ సోమవారం రాత్రి వడదెబ్బకు మృతిచెందింది. అందిన సమాచారం మేరకు.. లక్కవరం గ్రామ కొత్తూరుకు చెందిన బండారు భవానీ(42) సోమవారం ఉదయం మిరపకాయల కోతకు వెళ్లింది. మిరపకాయలు కోస్తుండగా ఎండదెబ్బ తగిలి కుప్పకూలిపోయింది. సమాచారం అందుకున్న బంధువులు ఆమె ఇంటికి తీసుకవచ్చి చికిత్స నిమిత్తం దర్శి ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర



వెలిగండ్ల: ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

పీసీపల్లి, ఏప్రిల్ 23: త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించి సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో సోమవారం రాత్రి పీసీపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన 21 కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఈ ఐదేళ్లలో కనిగిరి ప్రాంతం ఎంతో వెనుకబాటుకు గురైందన్నారు. కనిగిరి అభివృద్ధికి నడికుడి రైల్వేలైన్, ఇంటింటికీ తాగునీరు, ట్రిపుల్‌ఐటీ, నిమ్స్, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు, వెలుగొండ జలాలను సాధించడమే తన లక్ష్యమన్నారు. పార్టీలో చేరినవారిలో కల్లూరి శ్రీకాంత్, కల్లూరి మాలకొండయ్య, మన్నం కొండలరావు, ఏలూరి మల్లికార్జున, కంచర్ల మహేష్, కల్లూరి వెంగయ్య, కంచర్ల ప్రసాదు, వీరపనేని నాగేశ్వరరావు, కల్లూరి శ్రీను, వీరపనేని చెన్నకేశవులు, కల్లూరి పెదవెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

46 కుటుంబాలు టీడీపీలో చేరిక

పామూరు, ఏప్రిల్ 23: పామూరు, సీఎస్‌పురం మండలాలకు చెందిన ఎస్సీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన 36 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని పేట ప్రాంతానికి చెందిన 12 ముస్లింకుటుంబాలు మంగళవారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే, మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన పది కుటుంబాలు, ఎస్సీ పాలెంకు చెందిన ఏడు కుటుంబాలు చేరారు. ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ బుధవారం జరగనున్న నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో యువ పారిశ్రామిక వేత్త యారవ శ్రీనివాసులు, చెనికల పెదమాలకొండయ్య, కొండబాబు, మాలకొండయ్య, బొల్లా నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లింలు

వైసీపీని వీడిన 70 కుటుంబాలు



పామూరు: టీడీపీలో చేరిన బాలుపల్లి గ్రామస్థులు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 23: సీఎస్‌పురం మండలం బాలుపల్లి గ్రామానికి చెందిన సుమారు 42 కుటుంబాలు మంగళవారం వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. సీఎస్‌పురంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణ రెడ్డి వైసీపీని విడనాడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎస్‌పురం గ్రామానికి చెందిన 27 కుటుంబాలు కూడా పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ ప్రజలకు సేవకుడుగా ఉండి గ్రామాల అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఎస్సీ మాలకొండయ్య, మన్నెపల్లి శ్రీనివాసులు, వెంకటకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు కృషి

వెలిగండ్ల, ఏప్రిల్ 23: మండలంలోని ఇమ్మడిచెరువు పంచాయతీలో స్థానికంగా పనులు లేక ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే స్థానికంగానే ఉపాధి కల్పిస్తామని చెప్పారు. మంగళవారం మండలంలోని ఇమ్మడిచెరువు పంచాయతీకి చెందిన 19 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్యామల కాశిరెడ్డి, గవదకట్ల హరికృష్ణ, గొనా ప్రతాప్, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన 15 కుటుంబాలు

పీసీపల్లి, ఏప్రిల్ 23: మండలంలోని గోపవరపువారిపల్లి, బుడ్డారెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మంగళవారం రాత్రి కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో చెరుకూరి ప్రేమ్ చంద్, మధుకిరణ్, వేదాన్స్, ప్రకాష్, వంశీ, నాగయ్య, ఇమ్మానుయేల్, యేసేబు, ప్రవీణ్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గుంటగాని జోసెఫ్, మూలె వెంకటేశ్వరరెడ్డి, గోపవరపు చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచుగా వచ్చా.. ఆశీర్వదించండి

» నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా!

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన రాజంపల్లి నాయకులు

దర్శి, ఏప్రిల్ 23: 'మీ ఇంటి ఆడపడుచుగా వచ్చా.. ఆదరించి ఆశీర్వదించండి.. దర్శి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా' అని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని రామచంద్రాపురం, తూర్పువెంకటాపురం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆప్రాంత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఎంతోకాలంగా మూలనపడ్డ ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకవస్తానని చెప్పారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, కర్నాటి వెంకటనారాయణ, బాశం పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



తూర్పువెంకటాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

అంతకుముందు దర్శి- కురిచేడు రోడ్డులో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిరువ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చిరువ్యాపారులకు అన్నిరకాలుగా అండగా ఉంటానని చెప్పారు.

టీడీపీలో పలువురు చేరిక

మండలంలోని రాజంపల్లి వలంటీరు పోతిపోగు సురేష్ మంగళవారం సాయంత్రం టీడీపీలో చేరారు. గొట్టిపాటి భరత్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలకుల విధానం నచ్చక అనేకమంది టీడీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో రాజంపల్లి టీడీపీ నాయకులు ఫణిదెపు వెంకట్రామయ్య, దామా గురవారావు, దామా కృష్ణ పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని తానంచింతల గ్రామానికి చెందిన పలుకుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో ఆశీర్వాదం, శెట్టిపల్లి యువశివ, కిరణ్, చిట్టిబాబులు పార్టీలో చేరారు. కార్యక్రమలో బొమ్మిశెట్టి సుబ్రమణ్యం బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం తప్పదు!

దర్శి, ఏప్రిల్ 23: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి అన్నారు. మండలంలోని రాజంపల్లికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం టీడీపీలో చేరారు. వైసీపీ నాయకులు కళా వెంకటరావు, దగ్గుమాటి రవికుమార్, మాసాబత్తిన ప్రసాదు, రాచపూడి ఆదాము, రాచపూడి మూర్తయ్య, రాచపూడి సైమాన్ తదితరులకు ఆమె టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పొదిలి మాజీ జడ్పీటీసీ సభ్యుడు కాటూరి పెద్దబాబు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ వైసీపీ అరాచకపాలన సహించలేక ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఫణిదపు వెంటకరామయ్య, రాజంపల్లి టీడీపీ నాయకులు దామా గురువారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి అభివృద్ధే లక్ష్యం

కనిగిరి, ఏప్రిల్ 23: కనిగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో పలు మండలాలకు చెందినవారు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వెలిగండ్ల మండలంలో ఎంతో ప్రభుత్వ భూమి ఉందన్నారు. వ్యవసాయ భూమి లేని నిరుపేదలకు ఒక్కో కుటుంబానికి రెండు ఎకరాలు ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని హామి ఇచ్చారు. ఇళ్ళ లేని పేదలకు పక్కా గృహాలను నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలపించాలని కోరారు. ఇంటింటికి తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేసి సాగర్ జలాలు అందిస్తామన్నారు. తొలుత పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

బుధవారం తాను వేయబోయే నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఉగ్ర కోరారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కర్షక, శ్రామిక, వర్తక, కార్మిక, వ్యాపారులంతా ఐక్యంగా తరలి రావాలని కోరారు. తొలుత స్థానిక అమరావతి గ్రౌండ్స్ నుంచి పెద్దఎత్తున ర్యాలీ బయలుదేరుతుందని ఉగ్ర తెలిపారు.

36 మద్యం బాటిళ్లు పట్టివేత

పామూరు, ఏప్రిల్ 23 : పట్టణంలో ముగ్గురు వ్యక్తులు మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 36 మద్యం క్వార్టర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో మద్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ సైదుబాబు తన సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. 36 సీసాలను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దర్శిలో 71మంది వలంటీర్లు రాజీనామా

» కుట్రలకు తెరలేపిన వైసీపీ

దర్శి, ఏప్రిల్ 23: వలంటీర్లను ఎన్నికల్లో వాడుకునేందుకు అధికార వైసీపీ వారిచేత రాజీనామాలు చేయిస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలు వలంటీర్ల ద్వారా ప్రజలకు అందటంతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఈ కుట్రలు పన్నుతున్నారు. అందులోభాగంగా దర్శి పట్టణంలోని 71 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావుకు దశలవారీగా రాజీనామాలు అందజేశారు. దర్శి పట్టణంలో 152 మంది, రూరల్ మండలంలో 262 మంది వలంటీర్లు ఉన్నారు.

తొలుత దర్శి పట్టణంలోని వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి, ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల వలంటీర్లతో రాజీనామాలు చేయించాలని వైసీపీ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ముందుగా రచించిన పథకం ప్రకారం వైసీపీ నాయకుల ఆదేశాల మేరకు తొలివిడతగా దర్శి పట్టణంలోని 71 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. మిగిలిన వారు రెండురోజుల్లో రాజీనామాలు చేస్తారని ప్రచారం జరుగుతుంది. ఇందులో కొంతమందికి రాజీనామాలు చేయటం ఇష్టం లేకపోయినప్పటికీ అందరినీ పిలిపించి హుకుం జారీ చేస్తుండటంతో అధికార పార్టీ నాయకులను ఎదిరించే ధైర్యం లేక రాజీనామాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఈవిషయంపై కమిషనర్ మహేశ్వరరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మంగళవారం 71 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు చెప్పారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో అన్న విషయంపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రాజీనామాలు చేసిన వలంటీర్ల నివేదికలు పంపినట్లు తెలిపారు.

దొనకొండ మండలంలో 18 మంది..

దొనకొండ, ఏప్రిల్ 23: మండలంలో 18 మంది వలంటీర్లు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో రాజీనామా పత్రాలు అందజేశారు. ఇటీవల వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు మద్దతుగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు వలంటీర్లు రాజీనామాలు చేయాలని ఆపార్టీ నాయకులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చందవరం పంచాయతీకి చెందిన 13 మంది, పోలేపల్లి పంచాయతీకి చెందిన ముగ్గురు, పెద్దన్నపాలెం పంచాయతీకి చెందిన ఇద్దరు రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. కొందరు వలంటీర్లకు రాజీనామాలు ఇచ్చేందుకు ఇష్టంలేకపోయినా వైసీపీ నాయకులకు ఎదురుచెప్పలేక తప్పనిసరి పరిస్థితుల్లో రాజీనామాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రజల్లో చర్చనీయాంశమైంది.

తాళ్లూరులో ఆరుగురు..

తాళ్లూరు, ఏప్రిల్ 23: మండలంలోని గ్రామ సచివాలయ వలంటీర్లను రాజీనామాలు చేయించాలని వైసీపీ నియోజకవర్గ నేత నాలుగు రోజుల క్రితం సూచించినట్లు తెలిసింది. కొన్ని గ్రామాలకు చెందిన నాయకులు ఎన్నికలవేళ తమకు ఎందుకులేనని దాట వేస్తున్నట్లు సమాచారం. తాళ్లూరు-2 సచివాలయ పరిధిలోని కొర్రపాటివారిపాలెంకు చెందిన ఆరుగురు వలంటీర్లు రాజీనామా పత్రాలను మంగళవారం ఎంపీడీవో కె.యుగకీర్తికి అందజేశారు. రాజీనామా చేసిన వలంటీర్లు తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు ఎంపీడీవోకు వినతి పత్రాలు అందజేశారు. ఎంపీడీవో వద్దకు వలంటీర్లను వైసీపీ నేతలు తీసుకువచ్చి రాజీనామా పత్రాలు అందజేయించటం గమనార్హం.

కనిగిరి అసెంబ్లీకి 7 నామినేషన్లు దాఖలు

కనిగిరి, ఏప్రిల్ 23: కనిగిరి అసెంబ్లీకి పోటీ చేసేందుకు వివిధ పార్టీలకు చెందిన ఏడుగురు అభ్యర్థులు మంగళవారం నామినేషన్‌ను దాఖలు చేసినట్లు ఆర్‌ఓ జాన్‌ఇర్విన్ తెలిపారు. టీడీపీ నుంచి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మరో నామినేషన్‌ను దాఖలు చేయగా, వైసీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి దద్దాల మంజు భార్గవి పేరుమీద మరో నామినేషన్ దాఖలు చేశారు.

అలాగే, భోగినేని చెన్నకేశవులు, కస్మూరి ఖుర్షీద్, టి.శామ్యూల్ విల్‌ఫ్రెడ్ లు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్‌లు చేశారు. లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ నుంచి దమ్ము చినవెంకటేశ్వర్లు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి నజీర్ బాషాలు నామినేషన్‌ను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ఉద్యానమా.. ఏదీ నీ చిరునామా!

» అభివృద్ధికి నోచుకోని పార్కు

» పట్టించుకోని పాలకులు



నిరుపయోగంగా ఉన్న డీవీ పార్కు



అధ్వానంగా పార్కులోపల ప్రాంతం

పామూరు, ఏప్రిల్ 23: పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని పంచే ఉద్యానవనం అధ్వానంగా తయారైంది. పాలకులు నిర్లక్ష్యం వహించడంతో కళాహీనంగా మారింది. పామూరు పట్టణంలోని కందుకూరు రోడు కొత్త చెరువు ప్రాంతంలో ఉన్న డీవీ పార్క్ పూర్వ వైభవం కోల్పోయింది. పిచ్చిమొక్కలతో పచ్చదనం కోల్పోయి విషసర్పాలకు నిలయంగా మారింది. పట్టణంలో ఏడు వేల కుటుంబాలు, 32 వేల మంది జనాభా ఉన్నారు. 2002లో సూర్యచంద్ర సేవా సంస్థ తరుపున పంచాయతీ స్థలంలో ఉన్న ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకొని తన తండ్రి దరిశి వీరాంజనేయులు పేరుతో డీవీ పార్కును ఏర్పాటుచేశారు. పచ్చని చెట్లు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుచేయడంతో సందర్శకుల సంఖ్య అప్పట్లో గణనీయంగా ఉండేది. వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం పూట ఆడవిడుపుగా ఉండేది. పార్కులో వివిధ రకరకాల ఆటవస్తువులు విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. ప్రజలు ఉదయం, సాయంత్ర పూట వాకింగ్ చేసేందుకు చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మించారు.



మోడువారిన పచ్చని చెట్లు

క్రమేణా ఈ పార్కును పాలకులు పట్టించుకోలేదు. దాంతో పార్కులోని పచ్చదనం అంతా మాడిపోయి కళాహీనంగా తయారైంది. సొంత ఇల్లులేనివారు కర్మకాండలు పార్కులో జరిపించుకొంటున్నారు. ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న ఆ పార్కును 2011లో గ్రామ పంచాయతీకి అప్పజెప్పారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పార్కు రూపురేఖలు లేకుండా పోయింది. చివరికి చీకటి కార్యక్రమాలకు నిలయంగా మారింది. పార్కు ఎదురుగా ఎస్‌బీఐ బ్యాంకు, పోస్టాఫీసు కార్యాలయాలు ఉన్నాయి. బ్యాంకు పనుల కోసం వచ్చే పొదుపు గ్రూపు మహిళలు కాస్తంత సేద తీరేందుకు పార్కు ఎంతగానో ఉపయోగపడేది.

వైసీపీ పాలకులు పార్కులో గ్రామ సచివాలయం నిర్మించాలని భూమిని చదును చేసి కొన్ని చెట్లను తొలగించారు. దాంతో ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఆ ప్రయత్నాలను విరమించుకొన్నారు. గత ప్రభుత్వాలు కొద్దోగొప్పో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిని విస్మరించారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీవీ పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.




● రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వేగేశన నరేంద్రవర్మ, అన్నం సతీష్ ప్రభాకర్, రాకేష్ వర్మ

డెల్టా.. ఉల్టా

- జగన్ పాలనలో నీరందక ఎండిన డెల్టా భూములు
- డెల్టా కాల్వలన్నీ ఛిద్రం... రైతు బతుకు దుర్భరం
- ఒక్క కాల్వకట్టపై పలిక మన్ను వేసిందిలేదు
- చుక్కనీరందక రైతులకు నాలుగేళ్లూ కష్టాలే
- పట్టిసీమకు ఆనాడు పట్టం... జగన్ పాలనలో పట్టించుకోక నష్టం

గత ఐదేళ్లలో రైతన్నకు మాత్రం ఒక సంవత్సరం వర్షాలు సకాలంలో పడితే, మిగిలిన నాలుగేళ్లు సాగునీటి కష్టాలు తప్పలేదు. అటు జలాశయాల్లో నీటి నిల్వలూ అంతంతమాత్రంగా ఉంటే, కనీసం పట్టిసీమను కూడా సరిగా వినియోగించుకోలేని అసమర్ధ రైతులపాలిట శాపంగా మారింది. జగన్ సర్కారు వచ్చాక సంఘాలూ లేవు... మరమ్మతులకోసం నిధులిచ్చిన దాఖలాలూ లేవు. తూర్పు, పశ్చిమ కాల్వలకింద రెండు జిల్లాల్లో సాగుభూమి ఉంటే వాటిపైనా మరమ్మతులు నోచుకోక దిగుబడిపై పెద్ద ప్రభావమే పడింది. వర్షాలు సకాలంలో పడితే మినహా దిగుబడి దక్కిన పరిస్థితిలేదు. అటు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ పైనా అప్పట్లో ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయి లో జరగలేదు. జగన్ సర్కారు వచ్చాక పూర్తిగా పట్టిసీమపై కక్ష కట్టినట్టు మరీ పక్కన పెట్టారు.


తెనాలి మండలం హాఫ్‌పేట-గుంటూరు మధ్య గత ఖరీఫ్‌లో సాగునీరందక ట్యాంకర్‌లతో నీటిని పంటలకు అందిస్తున్న రైతులు


తూములు పూడిపోయి, కట్టల మట్టి కోతపడి గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్నా ఖరీఫ్‌కు ముందు అత్యవసర మరమ్మతులు చేయకుండా వదిలేసిన చిత్రం


హైలెవల్ ఛానల్ పనులు చివరి దశకు చేరినా ఐదేళ్లుగా ఒక్క పనికూడా చేయకుండా రైతులకు శాపంగా మార్చిన ప్రభుత్వ తీరు

తెనాలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒక్క కాల్వపై మరమ్మతులు చేసింది లేదు.. గండ్లు పడినా.. షట్టర్లు దెబ్బతిని నీరు వృధాగా పోయినా.. తూములు, కల్వర్టులు దెబ్బతినిపోయినా వాటికి రాయో, రప్పో అడ్డుపెట్టుకుని రైతన్నే నీటిని కాపాడుకున్నాడు. కాల్వల చివరి భూములకు ఆ అవకాశం కూడా లేదు. ఎందుకంటే.. చుక్కనీరు కిందికి వెళ్లిందే లేదు కనుక రైతులు పొలాలను ఎడారిగా వదిలేశారు. అరకొరగా వచ్చే ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఒ.అండ్.ఎం) నిధులే ఆధారమైతే వాటినీ అధికార పార్టీ నాయకులే కాంట్రాక్టర్ అవతారమెత్తి మేసేశారు. దీంతో ఆ మాత్రం మరమ్మతులు కూడా లేక కృష్ణా పశ్చిమ డెల్టా కుదేలైంది. ఎప్పుడో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డెల్టా కాల్వల ఆధునికీకరణలో భాగంగా ఈ ప్రాంతానికి రూ.1,400 కోట్లు మంజూరయితే వాటిలోనూ ప్రధాన కాల్వలు ఆధునికీకరణకు నోచుకోలేదు. తర్వాత టీడీపీ సర్కారు అధికారంలోకి వచ్చాక జరిగిన మరమ్మతులు మినహా, జగన్ సర్కారు వచ్చాక రైతన్నకు కన్నీరే మిగిల్చింది.

* మరమ్మతుల కోసం రైతన్న మొక్కు...

డెల్టా కాల్వల ఆధునికీకరణ తర్వాత సాగునీటి సంఘాల ద్వారా చాలావరకు కాల్వల పనులు జరిగేవి. జగన్ సర్కారు వచ్చాక సంఘాలూ లేవు... మరమ్మతులకోసం నిధులిచ్చిన దాఖలాలూ లేవు. డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలో కొమ్మమూరు, నిజాంపట్నం ఛానల్స్‌కు పనులే జరగలేదు. వీటికి సంబంధించి అప్పట్లోనే రూ.600 కోట్లు వృధాగా వెనక్కుపోయాయి. దీంతో ఈ కాల్వలకు గండ్లు పడటం ఏటా ఒక ఆనవాయితీగా మారిపోయింది. కృష్ణా పశ్చిమ డెల్టా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉంది. ఒక ఖరీఫ్ సాగు గట్టెక్కాలంటే కనీసం 60 నుంచి 70 టీఎంసీల నీరు అవసరమవుతుంది. అంటే పశ్చిమ డెల్టా కాల్వలకు నీరందించే ప్రధాన కాల్వకు రోజూ 8,200 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజి నుంచి వదలాలి. కానీ ఎప్పుడూ ఇంతటి సామర్ధ్యంతో నీటిని వదలటం కానీ, కాల్వల చివరి భూములకు పుష్కలంగా నీరందించిన పరిస్థితే లేదంటే అతిశయోక్తి కాదు. దీనిలో కొమ్మమూరు కాల్వయితే అన్నిటికీ చెడ్డ పరిస్థితి. అటు ఆధునికీకరణలో రూ.400 కోట్లతో జరగాల్సిన పనులు జరగలేదు. తర్వాత జల రవాణా పేరుతో తెలుగుదేశం ప్రభుత్వ కాలంలోనూ శాశ్వత పనులేవీ చేయనివ్వలేదు.

అసంపూర్తిగా కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ పనులు

అటు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పైనా అప్పట్లో ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ కాల్వపైనా ఆధారపడి 1.2 లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. దీనిలో సగభాగం వరకే ఖరీఫ్, రబీ రెండు పంటలకు నీరందితే, మిగిలిన సగం ఒక్క పంటకే పరిమితం చేశారు. ఈ ఖరీఫ్‌లో అయితే ఆ ఒక్క పంటకు కూడా నీరందటం గగనమైపోయింది. మరోపక్క గుంటూరు జిల్లాలో హైలెవల్ ఛానల్ కింద సాగవుతున్న 26వేల ఎకరాల పరిస్థితి మరీ దారుణం. కాల్వలకు ప్రారంభంలోనే ఉన్నా నీరందదు. రెండు సంవత్సరాలు ఖరీఫ్ నీరందక ఎండిపోయిన వరి పంటను తగలబెట్టిన దారుణ పరిస్థితి కూడా ఉంది. దీనిని తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో గత ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ చూపించి హైలెవల్ ఛానల్ ఆధునికీకరణకు పూనుకున్నారు. ప్రధాన కాల్వకన్నా ఎత్తు ఉండటంతో నీటిని పంప్ చెయ్యటం కానీ, ప్రధాన కాల్వలో కనీసం 3వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఎప్పుడూ ఉండేలా చూడటం కానీ అవసరం. దీనిలో పంప్‌చేసి నీటిని పంపాలని పెదవడ్లపూడి దగ్గర మెయిన్ కెనాల్‌పై మోటార్‌లతో నీటిని హైలెవల్ ఛానల్‌కు మళ్లించేలా గత టీడీపీ కాలంలో పనులు చేయించారు. ఇంకా కేవలం 5 శాతం పనులు, అంటే తుది మెరుగులు మాత్రమే పూర్తిచేసి నీటిని పంపే అవకాశం ఉంది. అయితే జగన్ సర్కారు వచ్చి ఐదేళ్లవుతున్నా ఇప్పటి వరకు దీనిపై ఒక్కసారి కూడా దృష్టి పెట్టలేదంటే రైతులపై, సాగునీటి వినియోగంపై ఎంత శ్రద్ధ ఉందనేది అర్థమవుతుంది.

తాత్కాలిక మరమ్మతులకే పరిమితం చేశారు. ఇప్పుడు జల రవాణాను నిలిపివేసినట్టు కేంద్రం ఎప్పుడో ప్రకటించినా వైసీపీ సర్కారు మాత్రం అత్యవసర మరమ్మతులుకూడా చేయలేదు. ఈ కాల్వల కింద 1.5 లక్షల ఎకరాలు సాగవుతుంటే, 63 కి.మీటర్ల పొడవున్న ఈ కాల్వపై ఒక్క పనీ జరగలేదు. దీంతో పొన్నూరు, బాపట్ల మండలాల పరిధిలో చాలాసార్లు కట్టలకు గండ్లు పడి ప్రకాశం జిల్లాలోని చివరి భూములకు గత మూడేళ్లగా నీరు సరిగా అందని పరిస్థితి.

* పట్టిసీమపై పంతం పట్టి...

కృష్ణా డెల్టాకు ఎగువ జలాశయాలలో నీటి నిల్వలు అడుగుకుపోయి, ప్రాజెక్టుల నుంచి నీరు అందని తరుణంలో పంటలను దక్కించుకోటానికి పట్టిసీమ గుండెకాయలాగా ఉపకరించింది. గతంలో కృష్ణా నదిపైఉన్న


హైలెవల్ ఛానల్ కింద నీరు అందక ఎండిన వరి, నెర్రెలిచ్చిన నేల

జలాశయాలు నిండుకుని నీరు రాక పంటలు ఎండిపోవటంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించటానికి పట్టిసీమను తీసుకొచ్చారు. వృధాగా సముద్రంలో కలసిపోయే గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోటానికి ఆయన పట్టిసీమ ద్వారా 20 మోటార్లను అమర్చి నీటిని పంప్‌చేస్తే, జగన్ సర్కారు వచ్చాక పూర్తిగా పట్టిసీమపై కక్ష కట్టినట్టు మరీ పక్కన పెట్టారు. గత ఖరీఫ్‌లో మరీ ఇబ్బందిగా ఉండటంతో పట్టిసీమ ద్వారా 14 రోజులు మాత్రమే నీటిని తీసుకున్నారు. మిగిలిన రోజులు కూడా తీసుకోగలిగితే ప్రస్తుతం అడుగుకు చేరిన పులిచింతల నీటిని తాగునీటి కోసం తోడెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే సాగు, తాగునీటి విషయంలో జగన్ సర్కారు ఏ ఒక్క సంవత్సరం ఒక ప్రణాళికతో నీటిని వినియోగించిన పరిస్థితి లేదు. ఆ కాల్వలకు మరమ్మతులు చేయక, పొడైన పంపులను పట్టించుకోక నిరుపయోగం చేసేశారు. ప్రధానంగా ఈ రెండు ఖరీఫ్ సీజన్‌ల నుంచి పట్టిసీమ వినియోగించని ప్రభావం ప్రత్యక్షంగా రైతులకు కనిపించింది.

* ఓ అండ్ ఎం నిధులూ మింగేసి..

డెల్టా కాల్వలకు ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసేదేలేదు. ఈ ఐదేళ్ల లో ఒక్క రూపాయి కూడా సాగునీటి కాల్వల మరమ్మతుల కోసమని ఖర్చు చేసిందిలేదు. ఏయేడాదికాయేడాది నీటి పారుదల శాఖ అధికారులు కాల్వల అత్య వసర మరమ్మతులు, కట్టలు బలపరచటం, వంతెనలు, షట్టర్ల మరమ్మతుల వంటి వాటికోసం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపటం, అవి బుట్టదాఖలవటంతో వారూ చేతులు దులుపుకుని ఓ అండ్ ఎం కింద వచ్చే నిధులతో పనులు చేయించేందుకు పరిమితమయ్యారు. ఇవి మాత్రం రైతులు కట్టే నీటి తీరువా ఆధారంగా ప్రభుత్వానికి జమయ్యే నిధుల నుంచి వాటాలు విడుదల చేయటమే కనుక వసూలైన నీటి తీరువా లక్ష్యంలో సగ భాగం కూడా మరమ్మతులకు కేటాయించిన పరిస్థితి లేదు. వీటికీ నీటిపారుదల శాఖ అధికారులు ప్రతి సంవత్సరం రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపితే వాటిలో పదిహేను, ఇరవై కోట్లు ఇచ్చి చేతులు దులుపుకోవటంకూడా ఒక పరిపాటిగా మారింది. ఇవి కూడా సరిగ్గా కాల్వలకు నీరు వదలటానికి వారం, పది రోజుల ముందు విడుదల చేస్తే, ఆ పనులనూ అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్ అవతారమెత్తి పనులు చేయకుండానే నిధులు దోచేసిన పరిస్థితులున్నాయి. వీటిపై రైతులు ఎక్కడైనా నిలదీస్తే వారిపై దాడులు చేసిన పరిస్థితీ ఉంది. గత ఖరీఫ్‌లో ఓ అండ్ ఎం కింద రూ.22 కోట్లు మంజూరైనా వాటితో కనీసం పూడిక కూడా తియ్యకపోవటంతో కొందరు వైసీపీ అభిమానులుగా ఉండే రైతులు కూడా తామే ఖర్చులు పెట్టుకుని చేయించుకున్న పరిస్థితి ఉంది.

నరేంద్రవర్మకు నీరాజనం

అట్టహాసంగా వేగేశన నామినేషన్ ● అల్లూరు నుంచి బాపట్ల వరకు పసుపుహారం
● అడుగడుగునా హారతులు, గజమాలలతో సత్కారం

బాపట్ల, పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 23: మండే ఎండ.. అభిమాన సందోహం.. అడగడుగునా హారతులు.. గజమాలలతో సత్కారంతో నరేంద్రవర్మకు ప్రజలు నీరాజనం పలికారు. కూటమి తరపున బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా వేగేశన నరేంద్రవర్మ మంగళవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకముందు పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నరేంద్రవర్మ కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూటమిశ్రేణులతో కలిసి అల్లూరు, అలకాపురం, ఖాజీపాలెం, జీఎస్‌పాలెం, పిట్టలవానిపాలెం, కొత్తపాలెం, చందోలు, రెడ్డిపాలెం గ్రామాల మీదగా బాపట్లకు చేరుకున్నారు. లోక్‌సభ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, పార్టీశ్రేణులతో కలిసి వేగేశన నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎండను లెక్క చేయకుండా పార్టీశ్రేణులు జేజేలు పలకగా, మహిళలు హారతులు పట్టి విజయతిలకం దిద్ది నరేంద్రవర్మను ఆశీర్వదించారు. అల్లూరు నుంచి బాపట్ల వరకు పసుపుహారంలా నరేంద్రవర్మ దండు తరలివచ్చింది. అశేష జనవాహిని నడుమ నామినేషన్‌కు కదిలిన నరేంద్రవర్మకు స్వాగతం పలుకుతూ ప్రతి గ్రామంలో క్రేన్ సాయంతో గజమాలలతో అభిమానులు సత్కరించారు. రోడ్‌షోలో యువత బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని శ్రీనివాస థియేటర్, గడియారస్తంభం సెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్‌షో జరిగింది. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, యువ నాయకుడు వేగేశన రాకేష్‌వర్మ, న్యాయవాదులు శ్రీనివాసరావు, ఊట్ల రామారావులతో కలిసి రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ శ్రీధర్‌కు నరేంద్రవర్మ నామినేషన్ పత్రాలు అందజేశారు. నరేంద్రవర్మ తరపున ఆయన భార్య వేగేశన హరికుమారి ఒకసెట్ నామినేషన్ దాఖలు చేయగా ఇప్పటి వరకు ఆయన తరపున నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శులు సలగల రాజశేఖర్, తాతా జయప్రకాష్ నారాయణ, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ మాజీ ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్


కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు

పనులు లేవు.. వైసీపీ నామినేషన్‌కు వెళ్లండి

● మార్టూరులో ఉపాధి సిబ్బంది తీరుపై కూలీల ఆగ్రహం


● వలపర్లలో ఉపాధి పనిని నిలిపివేయడంతో వెనుదిరుగుతున్న కూలీలు

మార్టూరు, ఏప్రిల్ 23: వైసీపీ పర్చూరు అభ్యర్థి ఎడం బాలాజీ నామినేషన్ కార్యక్రమానికి రావాలని మంగళవారం ఏకంగా ఉపాధి పనులను నిలిపివేశారు. కొద్ది రోజులుగా గ్రామంలో ఉపాధి పనులు సాగుతున్నాయి. మంగళవారం ఉదయాన్నే మహిళలు, వృద్ధులు ఉపాధి పని జరిగే ప్రదేశానికి వెళ్లారు. ఈరోజు బాలాజీ నామినేషను కార్యక్రమానికి అందరూ వెళ్లాలి పనులు జరగవు అని అక్కడున్న ఉపాధి సిబ్బంది చెప్పారు. దీంతో కూలీలు నిరాశతో ఇంటి ముఖం పట్టారు. ఎక్కడో నామినేషన్ వేస్తే మేమెలా వెళ్లగలమని పలువురు వృద్ధులు వాపోయారు. పనికోసం ఎంతో దూరం నడిచివస్తే ఇలా నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. కోడ్ ఉన్నా వైసీపీ మద్దతుదారులుగా ఉన్న ఉద్యోగులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ దొంగల పార్టీ

- అప్పుల ఊబిలోకి ఆంధ్రప్రదేశ్
- ప్రజల చేతికి చిప్ప ఇచ్చిన సీఎం జగన్
- చీరాల, కర్లపాలెంలో షర్మిల న్యాయయాత్ర
- ఆమంచికి బీఫాం.. నామినేషన్ ర్యాలీలో పీసీసీ చీఫ్ షర్మిల



చీరాల, కర్లపాలెం, ఏప్రిల్ 23: వైసీపీ దొంగల పార్టీ. దోపిడీ రాజ్యం. రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజల చేతికి ముఖ్యమంత్రి జగన్ చిప్ప ఇచ్చారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న ప్రజాధనాన్ని, ప్రజల ఆస్తులను కొల్లగొట్టడానికే జగన్మోహనరెడ్డి సిద్ధం సిద్ధమంటూ పిలుపిస్తున్నారు. ప్రజలందరూ ఈ వాస్తవాన్ని గ్రహించాలి.. అని పీసీసీ చీఫ్ షర్మిల తెలిపారు. చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లో మంగళవారం షర్మిల ఏపీ న్యాయ యాత్ర జరిగింది. సోమవారం రాత్రి అద్దంకి పర్యటన ముగిసిన అనంతరం ఆమె వేటపాలెం మండలంలో రిసార్ట్స్‌లో బస చేశారు. మంగళవారం పందిళ్లపల్లిలోని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నివాసానికి చేరుకుని ఆయనకు కాంగ్రెస్ పార్టీ బీఫారం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీ అగ్రభాగాన ఆమంచి, ఆ వెనుక ఏపీ న్యాయ యాత్ర వాహనంలో షర్మిల దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చీరాల గడియార స్తంభం సెంటర్ నుంచి షర్మిల బాపట్లకు పయనమయ్యారు. దీంతో ఆమంచి కాంగ్రెస్ పార్టీ బాపట్ల లోక్‌సభ అభ్యర్థి జేడీ శీలం మరికొందరితో కలసి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్వో సూర్య నారాయణరెడ్డికి నామినేషన్ పత్రం అందజేశారు.


సభకు హాజరైన జనం

వైఎస్ ఆశయాలకు జగన్ తూట్లు

చెప్పినమాట నిలబెట్టుకోవడమే కాక, మడమతిప్పని మాటతప్పని మహనేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అయితే జగన్మోహనరెడ్డి దీనికి పూర్తి భిన్నమని కర్లపాలెంలో జరిగిన సభలో షర్మిల సీఎంపై ధ్వజమెత్తారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్నారు. రాజశేఖర్‌రెడ్డి బీజేపీని పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తే జగన్ సాగిలపడుతున్నారన్నారు. వరద ముంపు సమయంలో బాపట్ల వచ్చిన జగన్ నల్లమడను ఆధునికీకరిస్తానని చెప్పి పట్టించుకోలేదన్నారు.

భూ దందాలకు అడ్డగా బాపట్ల

నియోజకవర్గం ఇసుక దోపిడీకి, భూ దందాలకు అడ్డగా మార్చారన్నారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే భూబకాసురుడని ఆరోపించారు. పేదల భూములను తక్కువకు కొని ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నా మళ్లీ ఆయనకే టికెట్ ఇచ్చి దోచుకోమని నియోజకవర్గాన్ని అప్పజెప్పారన్నారు. ఓటు మీచేతిలో ఉన్న ఆయుధమని ప్రతి ఒక్కరు గుర్తెరిగి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు జేడీ శీలం, గంటా అంజిబాబు, పార్టీ మండల అధ్యక్షులు యోహోషువా, సిరాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

- అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి
- కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలి
- ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి పిలుపు




ద్రోణాదులలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి... మార్టూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 23 : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో మంగళ వారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పర్యటించారు. ముందుగా గ్రామ టీడీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అరాచక వైసీపీ పాలనకు చరమగీతం గీతం పాడేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థుల గెలు పే అందరి లక్ష్యం కావాలన్నారు. పనులు, ఉద్యోగాల నిమిత్తం సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అందరూ కృషి చేయాలన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ధ్యేయంతో ఉన్న పవన్‌కల్యాణ్ ఆశయాన్ని జనసేన పార్టీ కార్యకర్తలు నెరవేర్చాలని ఏలూరి కోరారు. అనంతరం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి దుర్మార్గ, చేతగాని పాలనపై ప్రజలు విసుగుచెందారన్నారు. మే 13న మీ అమూల్యమైన ఓటును సైకిల్‌కు వేసి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. ద్రోణాదుల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ ఇంటింటికీ తిరిగారు. వైసీపీ పాలనలో గ్రామంలో సమస్యలు పరిష్కరించలేదని పలువురు ఏ లూరి దృష్టికి తెచ్చారు. విద్యా పథకాలు అమలుకాక వి దేశీ విద్యకు దూరమయ్యారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే అన్ని పథకాలు అమలు చేసి, అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఏలూరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

మార్టూరు : కూటమి టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు 25, 26వ బూత్‌లలో ముస్లిం కాలనీ, రాయల్ హైస్కూల్, ఎస్‌టీ కాలనీలో ప్రచారం చేశారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఏలూరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాక మార్టూరులో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్టూరులో అభివృద్ధి పనులు చేపడతానన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలంటే చంద్రబాబు పాలన రావాలన్నారు. చేతగాని జగన్‌రెడ్డి పాలనతో గాడితప్పిన రాష్ట్రాన్ని బాగుచేసే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి వ్యాపారం బాగా పెరిగిపోయిందని, దీంతో పిల్లల భవిష్యత్ నాశనమయ్యే ప్రమాదముందని ఏలూరి ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగాలు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అందరూ విజ్ఞతతో ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఏలూరి కోరారు.

కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, శివనాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రావినేని శ్రీనివాసరావు, జంపని శ్రీను, చల్లగుండ్ల సుబ్బారావు, కాకోలు వెంకటేశ్వర్లు, పున్నారావు, తెలుగు మహిళలు ఉప్పుటూరి రమాదేవి, జంపని రాధ, శేషమ్మ, కస్తూరి, అరుణ పాల్గొన్నారు.



17వ వార్డులో ముస్లిం మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న గొట్టిపాటి

మద్య నిషేధంపై మాటతప్పిన జగన్‌రెడ్డి

- ఐదేళ్లలో అన్నివర్గాల ప్రజలకు మోసం
- టీడీపీ కూటమితోనే సమ న్యాయం
- ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 23 : మద్యంను నిషేధిస్తానని, అది అమలు చేశాకే ఓటు అడిగేందుకు వస్తామని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం గొట్టిపాటి రవికమామార్ ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో పత్రాలను అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేసే పథకాలను, వాటివల్ల కలిగే ప్రయోజనాలను గొట్టిపాటి వివరించారు. పాదయాత్రలో, గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని జగన్‌రెడ్డి నెరవేర్చలేదన్నారు. మాటిచ్చి మడమ తిప్పితే ఓట్లు వేయొద్దని పదేపదే చెప్పున్న జగన్‌రెడ్డికి ప్రజలు ఓటెలా వేస్తారని గొట్టిపాటి ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు, కరెంట్ చార్జీల పెంపు, ఇసామిక్ బ్యాంక్ ఏర్పాటు, బీసీలకు రాజకీయపరమైన రిజర్వేషన్ తదితర హామీలపై ప్రజలకు జగన్ ఏం సమాధానమిస్తారన్నారు. టీడీపీ పాలనలో విద్యుత్ చార్జీలు పెంచారని పదేపదే చెప్పిన జగన్‌రెడ్డి ఐదేళ్లలో 9 సార్లు చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి వర్గాలకు షాక్ కొట్టించారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే డీఎస్సీపై సంతకం చేస్తారన్నారు. వైసీపీ దోపిడీ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేది ఓటర్లేనన్నారు. అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం టీడీపీ కూటమితోనే సాధ్యమన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ కూటమి ఎంపీగా కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే తనను ఆశీర్వదించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ఆయనకు ముస్లిం, ఎస్సీ కుటుంబాల నుంచి మంచి స్పందన వచ్చింది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు డాక్టర్ ఫణీంద్రబాబు, చిన్ని శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, వలి, మదీనా, సాయి, కాకాని అశోక్, కుందారపు రామారావు పాల్గొన్నారు.

బాబు గ్యారెంటీ పథకాలతో మహిళలకు చేయూత



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న గొట్టిపాటి కమల్‌కిషోర్

బల్లికురవ, ఏప్రిల్ 23 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ గ్యారెంటీ పథకాలతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని టీడీపీ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన గొట్టిపాటి రవికుమార్, కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మంగళవారం బల్లికురవలో బాబీ గొట్టిపాటికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిరహించారు. జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదన్నారు. అన్నీ చేసినట్లు ఆయన చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. గత ఎన్నికల్లో మాటిచ్చి మ డమ తిప్పారన్నారు. ఐ దేళ్లుగా మీ రున్న గ్రామాల్లోనే అభివృ ద్ధి చేయని జగన్‌రెడ్డి రాష్ట్రవంతా అభివృద్ధి చేశామని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. కనీసం రోడ్డును కూడా వేయలేని చేతగాని వైసీపీ పాలకులను ప్రజలంతా ఒ క్కటై ఓటుతో వేటు వేయాలని బాబీ పిలుపునిచ్చారు. మీరేసే ఓటు రాష్ట్ర అభివృద్ధి కోసం.. మీ పిల్లల బంగారు భవిష్యత్ కోసం అని గుర్తుంచుకోవాలన్నారు. కూ టమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య పాలన, ప్రజల కష్టాలు తీరే రోజులు వస్తాయన్నారు. బాబు రాగానే డీఎస్సీతో యువతకు ఉద్యోగాలు, పెద్ద ఎత్తున కంపెనీలను తీసుకొచ్చి నిరుద్యోగ సమస్యను తీర్చుతారని బాబీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు, భైరపునేని ఆజయ్, గొట్టిపాటి కొండలు, సర్పంచ్ పందిరి అంజిబాబు, చల్లగుండ్ల నాగేశ్వరరావు, నాగబోయిన సింగారావు, గరిమిడి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మహిళలకు 'మహాశక్తి' భరోసా

ఇంటింటి ప్రచారంలో ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 23 : మహిళలకు మహిళా శక్తి పథకాలతో భరోసా ఉంటుందని గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు, వాటి ప్రయోజనాలను ఝాన్సీ మహిళలకు వివరించారు. తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15వేలు, 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకూ రూ.1500 ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. ముఖ్యమంగా మహిళలను ఆర్థిక బలవంతులను చేయాలన్న లక్ష్యంతో చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గాస్ సిలిండర్లు, స్వయం గ్రూపులకు రూ.10లక్షల వడ్డీలేని రుణాన్ని అందజేస్తారన్నారు. మాయమాటలు, చేతగాని పాలనతో జగన్‌రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. వజ్రాయుధం లాంటి ఓటుతో వైసీపీని శాశ్వతంగా ఇంటికి పంపాలని, మహిళలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పలువురు మహిళలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.



భగవాన్‌రాజుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

హనుమకు లక్ష తమలపాకుల పూజ



అద్దంకి, ఏప్రిల్ 23 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. వేకువజామునే సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, పూజారులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

క్వారీలో కేబుల్ వైరు చోరీకి యత్నం

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని కొండాయపాలెం గ్రామ పరిధిలోని వింటర్ గ్రానైట్ క్వారీలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పవర్ కేబుల్ వైరు చోరీకి యత్నించారు. క్వారీలో లక్షలు విలువ చేసే కేబుల్ వైరును కట్ చేసి దొంగిలించే ప్రయత్నం చేస్తుండగా వాచ్‌మన్ గమనించి కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి, చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండలంలోని కొణిదెన గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవస్వామి, కొత్తపాలెంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి శాంతి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. దేవతామూర్తుల విగ్రహాల వద్ద భక్తులు పెద్ద ఎ త్తున కూర్చొని కల్యాణ వేడుకను నిర్వహించారు. కొణిదెనలో జరిగిన కల్యాణాన్ని ఆలయ ఈవో వెం కటేశ్వర రావు పర్యవేక్షించారు. దేవాలయ అర్చక స్వామి ఐవీఎన్ఎస్ ఆచార్యులు పర్యవేక్షనలో జరిగాయి. ఈసందర్భంగా రెండు గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వీర్ల గంగమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో వీర్ల గంగమ్మ



విద్యుత్ దీపాల కాంతిలో ఆలయం

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండలంలోని నక్కబొక్కల పాడు గ్రామ పరిధిలోని వీర్లకొండ వద్ద వీర్ల గంగమ్మ తల్లి వార్షిక తిరునాళ్లను భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. మల్లాయపాలెం, కొండాయపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, కొత్తపాలెం, సోమవరప్పాడు, వేమవరం, చెన్నుపల్లి, కొప్పెరపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున గంగమ్మ తల్లిని దర్శించుకొని మొక్కుబడి పొంగళ్లు చెల్లించారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్‌తో విద్యుత్ ప్రభలు లేకపోవడంతో భక్తులు పగలే అధిక సంఖ్యలో గంగమ్మ దేవాలయానికి వచ్చారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొక్కుబడి విద్యుత్ ప్రభ వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీర్ల గంగమ్మ ఆలయం నలువైపులా గ్రానైట్ క్వారీలు పెద్ద ఎత్తున ఉండడంతో గ్రానైట్ క్వారీల యజమానులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూడా గంగమ్మను దర్శించుకున్నారు. దేవాలయ పూజారి చల్లగుండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

6వ రోజు నాలుగు నామినేషన్లు

చీరాల, ఏప్రిల్ 23 : ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో పఠాన్ కాలేషా (స్వతంత్ర అభ్యర్థి), వెంకటేశ్వర్లు శీలం (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక), ఆమంచి కృష్ణమోహన్ (కాంగ్రెస్) తమ నామినేషన్ పత్రాలను ఆర్వో సూర్యనారాయణరెడ్డికి అందజేశారు. కరణం వెంకటేష్ (వైసీపీ) నామినేషన్ పత్రాలను ఆయన తరఫున వేరేవారు అందజేశారు.

కరణం వెంకటేష్ ఆస్తులు రూ.30.24 కోట్లు

వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తన స్థిర, చరాస్తులు రూ.30.24 కోట్లు ఉన్నట్లు నామినేషన్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన పేరు మీద చరాస్తులు రూ.5.01 కోట్లు, భార్య గీత పేరు మీద రూ.3.77 కోట్లు, ఉన్నట్లు పేర్కొన్నారు. స్థిరాస్తి తన పేరుమీద రూ.13.37 కోట్లు ఉన్నాయని, భార్య పేరుపై రూ.8.06 కోట్లు ఉన్నట్లు చూపారు. ఇక అప్పులు ఇద్దరికి కలిపి రూ.4.75 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరి వద్ద కలిపి రూ.75వేలు నగదు ఉందని పేర్కొన్నారు. ఫార్చ్యూన్ కారు, ఒక స్పోర్ట్స్ బైక్ ఉన్నాయని, కేసులు లేవని పేర్కొన్నారు.

ఆమంచి ఆస్తులు రూ.25.75 కోట్లు

కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్‌తో పాటు ఇచ్చిన అఫిడవిట్‌లో తన వద్ద స్థిర, చరాస్తులు రూ.25.75 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో తన పేరు మీద రూ.14.04 కోట్లు, తన భార్య సుజాత పేరుమీద రూ.11.70 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరి పేరున అప్పులు రూ.7.18 కోట్లు ఉన్నట్లు చూపారు. ఇద్దరి వద్ద నగదు రూ.17.68 లక్షలు ఉన్నట్లు చూపారు. తనకు వాహనాలు లేవని పేర్కొన్నారు. తనపై 13 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

నామినేషన్ వేసిన బాలాజీ

పర్చూరు : పర్చూరు వైసీపీ అభ్యర్థిగా యడం బాలాజీ మం గళవారం నామినేషన్ దాఖలు చేసారు. వైసీపీ బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి ఎంపీ నందిగాం సురేష్, రాజ్యసభ సభ్యులు వైసీ పీ బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రావి రామనాథంబాబుతో కలసి ర్యాలీగా వచ్చి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందజేశారు.

అడుసుమల్లి నామినేషన్ దాఖలు

అద్దంకి : అద్దంకి నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ అభ్యర్థి గా అడుసుమల్లి కిషోర్‌బాబు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. కిషోర్‌బాబు నామినేషన్ ప త్రాలను రిటర్నింగ్ అధికారి సునీల్ కు అందజేశారు. కాం గ్రెస్ నాయకులు సురేం ద్ర తదితరులు పాల్గొన్నారు.



మండుటెండలో ఆటోలో పనులకు వెళ్తున్న కూలీలు

భానుడి భగభగలు

- పెరిగిన ఎండలు, వడగాలులు
- విలవిల్లాడుతున్న కూలీలు



చెట్టు నీడన సేదతీరుతున్న కూలీలు

బల్లికురవ, ఏప్రిల్ 23 : పొట్ట కూటి కోసం రోజువారీ కూలీలు మండు టెండలలో కూడా పనులకు వలస వెళుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కూలీలు మాత్రం గ్రామాలలో పనులు లేక పొరుగు ఊళ్లకు వెళుతున్నారు. ఒక వైపు ఎండ మండుతున్నా ఉదయం నుంచే ఆటోలలో వెళుతున్నారు. మండలంలోని గుంటుపల్లి, కొత్తపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, వైదన, నక్కబొక్కలపాడు, కొణిదెన, మల్లాయపాలెం, ముక్తేశ్వరం, ఉప్పుమాగులూరు, తదితర గ్రామాల నుంచి కూలీలు పనులకు వెళుతున్నారు. ఒక్కో కూలికి మిర్చి కోతకు రూ.400 ఇస్తున్నారు. ఎండ కాసినా పొట్ట కూటి కోసం ఇబ్బంది పడి వెళ్లాల్సిందేనని కూలీలు అంటున్నారు. ఒక్కోసారి ఎండలను తట్టుకోలేక చెట్ల కింద సేద దీరుతున్నారు. కూలీలను చూసిన వారు వారి కష్టాలను చూసి అయ్యోపాపం అంటున్నారు. 44 డిగ్రీల ఎండ కాస్తున్న కూలీలు మాత్రం తమ పనులకు వెళ్లక తప్పని పరిస్థితి. కూలీలు తగు జాగ్రత్తలు పాటించకుంటే వడ దెబ్బబారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు కూలీలకు అవగాహన కల్పించి వారి ఆరోగ్యంపై తగు చర్యలు చేపట్టాలి.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న వైద్యశాలల అధికారి శేషుకుమార్

అద్దంకిటౌన్, ఏప్రిల్ 23 : వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించిందుకు అందరూ కృషి చేయాలని బాపట్ల జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఏవీ శేషుకుమార్ అన్నారు. మంగళవారం అద్దంకి సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. వైద్యశాలలోని ఆయా విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వైద్యశాలలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ కేసులు, వాటి నమోదు వివరాల వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బ్లడ్ బ్యాంక్, ట్రామా కేసులు, శస్త్ర చికిత్సలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంటి విభాగంలో రోగులకు కళ్ల జోళ్ళను ఆ యన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ కె.వాహిలా చౌదరి, డాక్టర్ పి. వెంకట కిరణ్, డాక్టర్ కె. శ్యామ్‌బాబు, డాక్టర్ జి. ప్రదీప్తి, డాక్టర్ లక్ష్మి శ్రుతి కీర్తి, డాక్టర్.టి. సురేంద్ర, డాక్టర్ విష్ణు , సిబ్బంది పాల్గొన్నారు.

రత్తమ్మ మృతదేహానికి టీడీపీ నేతల నివాళి



రత్తమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చినగంజాం, ఏప్రిల్ 23 : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన పర్వతరెడ్డి రత్తమ్మ(70) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీ సానుభూతి పరులైన రత్తమ్మ మృతి విషయాన్ని తెలుసుకున్న నాయకులు మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు పొద వీరయ్య, ఆజాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య, నాయకులు టీ.జయరావు, నరహరి శ్రీనివాసరావు, శిఖరం రాంబాబు, పర్వతరెడ్డి పార్థసారిథి, గంటా వెంకటనారాయణ, పల్లపోలు శ్రీనివాసరావులు రత్తమ్మ మృతదేమాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. రత్తమ్మ భర్త పెద సుబ్బయ్య కుమారులను నాయకులు పరామర్శించారు.

గ్రానైట్ రాయి లారీల పట్టివేత



పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న గ్రానైట్ లారీలు

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని వీర్లకొండ గ్రానైట్ క్వారీల నుంచి ఇతర ప్రాంతాలకు ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రానైట్ ముడి రాయి లారీలను మైనింగ్ విజిలెన్స్ ఏడీ ఈరేష్ పట్టుకొన్నారు. వీర్ల కొండ క్వారీల నుంచి ఒంగోలు, మార్టూరు, వేమవరం ప్రాంతాలలో ఉన్న ఫ్యాక్టరీలకు రాయిని తరలిస్తుండగా మైనింగ్ అధికార్లు మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు చేయగా ఎలాంటి పర్మిట్లు లేకపోవడంతో కేసు నమోదు చేసి వెంటనే నాలుగు లారీలను బల్లికురవ పోలీసు స్టేషన్‌కు మైనింగ్ అధికారులకు అప్పగించారు. లారీలకు పెనాల్టీలు విధించనున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చినగంజాం, ఏప్రిల్ 23 : మండలంలోని కడవకుదురు ప్రాంతంలోని ఇసుక క్వారీల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ని చీరాల ఎస్ఈబీ ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం పట్టుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ని కడవకుదురు గ్రామం వద్ద పట్టుకొని, సీజ్ చేసి తదుపరి చర్యలు నిమిత్తం చినగంజాం పోలీసుస్టేషన్లో అప్పగించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పి.రామలింగేశ్వరరావు తెలిపారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

144 బాటిళ్లు, కారు సీజ్

పర్చూరు, ఏప్రిల్ 23 : కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, 144 బాటిళ్లు, కారును సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ భుజంగరావు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తుండగా యద్దనపూడి నుంచి కారులో మద్యంను అక్రమంగా తరలిస్తున్న నిందుతులను అరెస్టు చేశామన్నారు. మద్యంతోపాటు కారును సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నాయకులు షేక్ బాజి, రావూరి బుజ్జి కుటుంబాలు

రేపటితో ముగియనున్న నామినేషన్లు

- నేడు జనార్దన్, ఉగ్ర, అశోక్‌రెడ్డి రేపు బీఎన్, కందుల దాఖలు
- భారీ ర్యాలీలకు టీడీపీ శ్రేణుల ఏర్పాట్లు
- జోరుగా కూటమి అభ్యర్థుల ప్రచారం
- వైసీపీ నుంచి భారీగా చేరికలు

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సాధా రణ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం గురువారంతో ముగియనుంది. ఈనెల 18నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారం మినహా మిగిలిన ఐదు రోజులు అభ్యర్థులు వేశారు. చివరి రెండు రోజులైన బుధ, గురువారాల్లో పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలు కానున్నాయి. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో ముగ్గురు టీడీపీ అభ్యర్థులు ఇప్పటికే భారీ ర్యాలీలు, సభలతో నామినేషన్లు వేశారు. మిగిలిన ఐదుగురిలో ముగ్గురు బుధవారం, ఇద్దరు గురువారం నామినేషన్ల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 19న కొండపిలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎర్రగొండపాలెంలో ఎరిక్షన్‌బాబులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం దర్శిలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జనజాతర మధ్య నామినేషన్ పత్రాలను సమర్పించారు. మిగిలిన ఐదుగురిలో ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనా ర్దన్, కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి, గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి బుధవారం, ఎస్.ఎన్.పాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి చివరిరోజైన గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులతో భారీ ర్యాలీలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రచారం ముమ్మరం

నామినేషన్ల దాఖలు ఘట్టం ముగింపు దశకు చేరుకోవడంతో టీడీపీ అభ్య ర్థులు ఒకవైపు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మరోవైపు వైసీపీ నుంచి పార్టీలోకి వచ్చే వారిని చేర్చుకోవడాన్ని ఉధృతం చేశారు. కొండపి అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ స్వామి మర్రిపూడి మండలంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఊరూరా పర్యటిస్తున్నారు. ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డిలు ఒకవైపు బుధ వారం జరగనున్న నామినేషన్ల ర్యాలీ, సభల ఏర్పా ట్లు చేసుకొంటూనే మరోవైపు పార్టీలో చేరేవారిని స్వాగ తించి చేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇక ఎస్.ఎన్.పాడు అభ్యర్థి అటు చీమకుర్తి, ఇటు నాగులుప్పలపాడు మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ గురువారం చీమకుర్తిలో నిర్వహించే ర్యాలీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కూడా ఒక వైపు ప్రచారం, మరోవైపు నామినేషన్లు దాఖలు ఏర్పాట్లలో ఉన్నారు. ఇక భారీ ర్యాలీలు, సభలతో ఇప్పటికే నామినేషన్లు వేసిన వై.పాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలు అదే జోష్‌తో ఎన్నికల ప్రచారం మరింత ఉధృతం చేశారు.

టీడీపీలోకి భారీగా వలసలు

అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీడీపీలోకి భారీగా వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారు. నిత్యం ప్రతి నియో జకవర్గంలో మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు వైసీపీలో క్రియాశీలకంగా పనిచేసే అనేకమంది వచ్చి సైకి లెక్కుతుండటంతో ఇటు టీడీపీ అభ్యర్థులు, అటు కేడర్‌లో ఉత్సాహం కనిపిస్తోంది.



ఒంగోలు 1 వేలం కేంద్రంలో కొనుగోళ్లు పరిశీలిస్తున్న అధికారులు

పొగాకు ధరలు పైపైకి..

- కిలో రూ.279 పలికిన గరిష్ఠ ధర ● బ్రౌన్ రకం కిలో రూ.248
- ఒంగోలు-1, టంగుటూరు కేంద్రాల్లో వేలాన్ని పరిశీలించిన అధికారులు

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ధరలు పైపైకి వెళ్తున్నాయి. వేలం ప్రారంభం అనంతరం నెలన్నరపాటు నిలకడగా సాగిన గరిష్ఠ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. పదిరోజుల క్రితం మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.238 ఉండగా మంగవారం మార్కెట్లో రూ.279 పలికింది. అలా పదిరోజుల వ్యవధిలో కిలోకు రూ.40 వరకు మేలు రకం ధర పెరిగింది. లోగ్రేడ్ ధరలు కూడా అలాగే పెరుగుతున్నాయి. ఆ రకంలో నాణ్యమైనదిగా భావించే బ్రౌన్ ధర పదిరోజుల క్రితం కిలో రూ.225 నుంచి 230 వరకూ ఉంది. గరిష్ఠంగా రూ.233 పలికింది. మంగళవారం మార్కెట్లో ఏకంగా కిలో బ్రౌన్ రకం గరిష్ఠ ధర రూ.248 లభించింది. ఒంగోలు-1 వేలం కేంద్రంలో ఈ ధరలు వచ్చాయి. ఇతర అన్ని కేంద్రాల్లోనూ కిలోకు రెండు నుంచి మూడు రూపాయలు తక్కువగా మేలురకం ధర కిలో రూ.275పైన, బ్రౌన్ రకం రూ.245పైన ఉన్నాయి. వారం క్రితం వరకు ధరల విషయంలో నిలకడగా ఉంటూ వస్తున్న ఐటీసీ కంపెనీ సైతం రెండు రోజులుగా పెంచి కొనుగోలు చేస్తోంది. పలువురు డీలర్లు, ఎగుమతిదారులుగా ఉండే కంపెనీల బయ్యర్లు బేళ్లకోసం వేలం కేంద్రాల్లో పోటీ పడుతున్నారు. ఇదిలాఉండగా పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ, ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావుతోపాటు పలువురు బోర్డు ప్రధాన కార్యాలయ అధికారులు మంగళవారం ఒంగోలు-1, టంగుటూరు వేలం కేంద్రాలను సందర్శించారు.

నామినేషన్ కోసం నానా తంటాలు

- రూ.300, మద్యం ఇచ్చి బలవంతంగా తరలింపు
- వైసీపీ కింది స్థాయి నేతల పాట్లు

మార్టూరు, ఏప్రిల్ 23 : వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ నామినేషన్ కోసం జనాలను తరలించేందుకు వైసీపీ కింది స్థాయి నాయకులు నానా తంటాలు పడ్డారు. ఒకపక్క మద్యం, మరోపక్క నగదును పంచిపెట్టి వాహనాల్లో తరలించారు. కొన్ని గ్రామాలలో ఏకంగా ఉపాధి పనులను కూడా నిలిపివేసి ఆ కూలీలను వాహనాల్లో ఎక్కించి నామి నేషన్‌కు తరలించారు. మార్టూరులోని కొన్ని కాలనీల్లో ఒకొక్కరికీ రూ.200, కొందరికి రూ.300 చొప్పున పంచి బలవంతంగా పంపించారు. ఈ తతంగాన్ని తమ భుజాలపై వేసుకొన్ని చోటా నాయకులకు భారీగానే నగదు ముట్టినట్లు తెలిసింది. ఇదిలావుండగా బైకులపై వెళ్లేవారికి పెట్రోల్ కొట్టించారు. మందు ప్రియులకు కూడా క్వార్టర్ బాటి ల్‌కు రూ.200 చొప్పున అందజేశారు.

వ్యవసాయశాఖ జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

సింగరాయకొండ, ఏప్రిల్ 23 : గత కొంతకాలంగా మానసిక ఆందోళనతో బాధ పడుతున్న సింగరాయకొండ వ్యవసాయశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గోపవ రపు వెంకట్ భరత్‌కుమార్‌రెడ్డి (31) స్థానిక కందుకూరురోడ్డు 3వ లైనులోని తన నివాసంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై టి. శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి భార్య వారం రోజుల కితం తన పుట్టిల్లు బేస్తవారిపే టకు వెళ్లింది. తల్లి ఒంగోలులో ఉంటుంది. సోమవారం పలు సార్లు తల్లి ఫోన్ చేసినా వెంకట్ భరత్‌కుమార్‌రెడ్డి స్పందించలేదు. దీంతో మంగ ళవారం తల్లి, మేనమామ ఒంగోలు నుంచి సింగరాయకొండకు వచ్చారు. ఇంటికి వెళ్లి తలుపులు తీసి లోపలికి వెళ్లి చూడగా చీరతో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై టి. శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు వెల్లడించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై టి. శ్రీరామ్

గొంతెండుతోంది..

ఐదేళ్ల వైసీపీ పాలనలో తాగునీటి సరఫరా వ్యవస్థపై తీవ్ర నిర్లక్ష్యమే కొనసాగింది. ఆ కాలం, ఈ కాలమని తేడా లేకుండా జిల్లాలోని పశ్చిమాన నీటికోసం జనం అల్లాడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కొత్త పథకాలు అడుగు ముందుకు పడలేదు. కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ మిషన్(జేజేఎం) పనులు నిధుల కొరతతో నీరసించాయి. కీలకమైన వాటర్‌గ్రిడ్ ఊసే లేదు. ఇక పట్టణ ప్రాంతాలకు మంజూరైన తాగునీటి పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లోని నీటి పథకాలు, సీపీడబ్ల్యూ స్కీమ్‌ల నిర్వహణ గాలికొదిలేశారు. మరోవైపు నీటి కోసం అల్లాడుతున్న ప్రజలకు అరకొరగానే ట్యాంకర్లతో సరఫరా జరుగుతోంది. వాటికి కూడా భారీగా బిల్లులు పెండింగ్ ఉండటం, సరఫరా చేసే కాంట్రాక్టర్లు నిత్యం ఆందోళనకు దిగడం, సరఫరా ఆపడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది.



పొదిలిలో పక్షం రోజులకు ఒకసారి వచ్చే సాగర్ నీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు (ఫైల్)

- పశ్చిమాన దాహం కేకలు
- ట్యాంకర్ల నీరే పలుచోట్ల దిక్కు
- అవి కూడా అరకొరగానే
- వాటర్‌గ్రిడ్ ఊసే లేదు
- పట్టణ పథకాలదీ అదే పరిస్థితి
- సీపీడబ్ల్యూ స్కీంల నిర్వహణ గాలికి
- నీటి సరఫరా బిల్లులు భారీగా పెండింగ్
- వైసీపీ పాలనలో నిలువెల్లా నిర్లక్ష్యమే
- పాతాళానికి పోతున్న భూగర్భ జలం
- పెంపు చర్యలు పట్టని ప్రభుత్వం

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో నీటి సరఫరా పర్యవేక్షణ నడుస్తోంది. ఆ పరిధిలో 28 సీపీ డబ్ల్యూ స్కీంల ద్వారా 836 ఆవాసాలకు, ఇతర ప్రాంతాల్లో 2,858 గ్రామస్థాయి పథకాలు, డీప్‌బోర్లు ఆధారంగా ఉండే సింగిల్ స్కీమ్‌లు, అలాగే మరో 14,729 చేతిపంపులు ఉన్నాయి. మరో 137 తాగునీటి చెరువులు ఉండగా అధికభాగం పథకాలకు సాగర్ నీరు ప్రధానం. పశ్చిమంలో భూగర్భజలాలు, తూర్పున కొన్ని చోట్ల గుండ్లకమ్మ కొమ్మమూరు కాలువల ఆధారంగా ఉన్నాయి. వేసవి వస్తే వీటిలో అత్యధికం నీరు లేక నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. పశ్చిమాన అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ప్రస్తుతం కూడా అధికారికంగా 142 ఆవాసాలలో ట్యాంకర్లతో నీటిసరఫరా జరుగుతోంది. వాస్తవ అవ సరం మరో 100 అవాసాలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే నీటి సరఫరా ఖర్చు తగ్గించుకునేం దుకు ప్రభుత్వం తప్పనిసరైన చోట అది కూడా కేవలం 40 లీటర్లతో సరిపెడుతోంది. ఈ ఐదేళ్లలో దాదాపు రూ.250 కోట్ల వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాల్సి రావడం పశ్చిమ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రతను పట్టిచూపుతోంది. ఇక సీపీడబ్ల్యూ స్కీమ్‌లు, ఇతర సింగిల్ విలేజ్ పథకాలు నిర్వహణ అధ్వానంగా తయారైంది. సకాలంలో ఇందుకు సరిపడా ప్రభుత్వం నిధులు ఇవ్వక పథకాలు సరిగా పనిచేయడం లేదు. ఆమేర గ్రామాలలో నీటి సరఫరా తగ్గిపోతోంది. దాదాపు రూ.34 కోట్ల మేర ఈ పథకాలకు, మరో రూ.40కోట్ల వరకు ట్యాంకర్లతో సరఫరాకు పెండింగ్ బిల్లులు ఉండటం ప్రభుత్వం తాగునీటికి ఇస్తున్న ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తోంది.

జేజేఎంలో అంతా జాప్యమే

తీవ్ర నీటిసమస్య ఉన్న జిల్లాలోని గ్రామీణప్రాంతా లకు కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన జేజేఎం, అలాగే గత టీడీపీ ప్రభుత్వ కాలంలో మంజూరైన వాట ర్‌గ్రిడ్ పథకాలు వరం లాంటివి. అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో 2024 మార్చి ఆఖరుకు ఇంటింటికి నీటి కొళాయి ఏర్పాటు లక్ష్యంగా కేంద్రం జేజేఎంను 2019 అక్టోబరులో ప్రారంభించింది. జిల్లాలో 4.98 లక్షల కుటుంబాలు ఉండగా అప్పటికి 1.19 లక్షల కుటుంబా లకు కొళాయిల ఏర్పాటు లక్ష్యం. అయితే గత మార్చితో పథకం పూర్తి సమయం ముగిసినా ఈలోపు కేవలం 2.02 లక్షల కుటుంబాలకు మాత్రమే కొళాయిలు ఏర్పా టుచేయగా ఇంకా ఇంచుమించు లక్షా70వేల కుటుంబా లకు ఇవ్వాలి. పథకం పూర్తి చివరి ఏడాది అయిన 2023-24లో చూస్తే 2023 ఏప్రిల్ 1 నాటికి ఇంకా లక్షా 77వేల ఇళ్లకు కొళాయిలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 65 వేలకు మాత్రమే ఇచ్చారు. జిల్లాలో జలజీవన్ మిషన్ కింద రూ.659.53 కోట్ల వ్యయంతో 2,428 పనులు మంజూరు చేయగా పథకం కాలపరిమితి పూర్తయినా కేవలం 1,703 పనులు మాత్రమే చేపట్టారు. అందులో 1,183 పనులు పూర్తి, 52 పురోగతిలో ఉండగా 725 పనులు అసలు ప్రారంభమే కాలేదని సమాచారం. ప్రభుత్వ వాటాధనం సకాలంలో ఇవ్వకపోవడం, పర్యవే క్షణ లోపంతో ఈ పరిస్థితి నెలకొంది.

వాటర్‌గ్రిడ్‌ను వదిలేశారు

మరోవైపు వాటర్‌గ్రిడ్ పరిస్థితి అలాగే ఉంది. పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, కనిగిరి, వైపాలెం, గిద్ద లూరు నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెలిగొండ నీరు ఆధారంగా గత ప్రభుత్వం రూ.1,050 కోట్లతో భారీ పథకాన్ని మంజూరుచేసి టెండర్లు ఖరారు, శంకుస్థాపన కూడా చేసింది. అయితే వైసీపీ వచ్చాక మార్పులు, చేర్పులు చేసి రివర్స్ టెండర్ల పేరుతో మళ్లీ టెండర్లు పిలిచారు. చివరకు రూ.1,290 కోట్లతో 2023 జనవరిలో టెండర్లు ఖరారు చేశారు. అయితే ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. అధికా రవర్గాల సమాచారం మేరకు మూడు మాసాల క్రితం డిజైన్లు అప్రూవ్ అయ్యాయి. ఇలా డిజైన్లు అప్రూవ్‌కు ఐదేళ్లు పడితే ఇకపథకం పూర్తి ఎన్నటికి అన్నది ప్రశ్నా ర్థకమే. ఉప్పునీరు ప్రభావం ఉంటే కొత్తపట్నం ప్రాంతంలో రక్షిత నీటి సరఫరాకు ఉద్దేశించిన రూ.35కోట్ల సూపర్ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు 2021 అక్టోబరులో సీఎం హామీ ఇచ్చినా ఇంతవరకు కొలిక్కి రాలేదు.

పట్టణాలలో పరిస్థితి దారుణం

పట్టణప్రాంతాల పరిస్థితి చూస్తే జిల్లాకేంద్రమైన ఒంగోలు నగరంలో మూడు రోజులకు ఒకసారి సరఫరా జరుగుతుండగా పొదిలి, కనిగిరి, వైపాలెం, చీమకుర్తి, గిద్దలూరు మార్కాపురం, కంభం సింగరాయకొండ, పామూరు ఇలా ఏ పట్టణంలో చూసినా నీటి కోసం జనం నిత్యం అల్లాడిపోతున్నారు. పట్టణ ప్రాంతంలో తాగునీటి సరఫరా మెరుగుకు వైసీపీ ప్రభుత్వ కాలంలో చర్యలు శూన్యం. ఒంగోలుకు గత టీడీపీ ప్రభుత్వ కాలంలో అమృత్ పథకం కింద మంజూరు చేసిన రూ.123 కోట్ల పథకం ఇంతవరకు పూర్తికాకపోగా అమృ త్-2 కింద రూ.339.93 కోట్లతో జగన్ ప్రభుత్వం మంజూరుచేసిన తాగునీటి పథకం పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదు. అలాగే ఇతర మున్సిపాలిటీల్లో చూస్తే ఎక్కడ ఏ ఒక్క పథకం పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. మొత్తంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో తాగునీటి వనరుల మెరుగుకు నిర్దిష్ట చర్యలు తీసుకున్న పరిస్థితి లేకపోగా జిల్లా ప్రజానీకం ప్రత్యే కించి పశ్చిమప్రాంత ప్రజలు గుక్కెడు నీటి కోసం గొంతెండి వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయడం నిత్య కృత్యంగా మారింది.

ప్రక్షాళన ఖాయమే!

- ఈసీ దూకుడుతో జిల్లా పోలీసు వర్గాల్లో టెన్షన్
- పలువురు పోలీసుల పాత్రపై
- ఇప్పటికే ఫిర్యాదులు చేసిన టీడీపీ కూటమి
- త్వరలో కొందరిపై కూడా వేటుపడే అవకాశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎన్నికల కమిషన్ జోక్యంతో జిల్లా పోలీసు శాఖలో కూడా ప్రక్షాళన జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రమేపీ కేంద్ర ఎన్నికల కమిషన్(సీఈసీ) దూకుడు పెంచటం, జిల్లాలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులు ఉండటం వాటిపై ఎస్ఈసీ దృష్టిపెట్టిన నేపథ్యంలో మార్పులు జరిగే సూచనలు ఉన్నాయి. ఇటీవల సీఈసీ రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై వేటు వేయటం ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని బదిలీ చేసి కొత్తగా జి.సుమిత్‌ను జిల్లాకు పంపారు. కొత్త ఎస్పీ వచ్చిన మూడు, నాలుగు రోజులు పోలీసు శాఖలో కొంత జాగ్రత్తలు కనిపించినా ఆ తర్వాత షరామామూలే అన్నట్లు వ్యవ హారం మారింది. కిందిస్థాయిలో పోలీసు అధికారులు అధికారపార్టీకి అను గుణంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు అధికమయ్యాయి. ఒంగోలులో జరి గిన ఒక ఘటనలో ఇద్దరు సీఐలు అధికార వైసీపీకి వత్తాసుగా వ్యవహరిం చారనే ఆరోపణలు వచ్చాయి. బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఒక డీఎస్పీ భారీ పోలీసు బలగంతో టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడులు చేశారు. గిద్ద లూరు నియోజకవర్గంలో జరిగిన గిరిజన యువకుడి హత్య కేసులో పోలీ సులు కిందిస్థాయి వైసీపీ నాయకులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. దొనకొండలో ఎస్ఐ విపక్ష పార్టీల వారిని బెది రిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొండపి, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో కొందరు పోలీసుల వ్యవహారశైలిపై ఫిర్యాదులు వెల్లువె త్తాయి. మంగళవారం పర్చూరులో ఆర్వో కార్యాలయం వద్ద ఎస్సై నాగశివా రెడ్డి టీడీపీ కార్యకర్తల పట్ల దురుసుగా వ్యవహరించటం, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో వాదనకు దిగటం, ఆ తర్వాత ఆయనపై ఏలూరి ఎస్పీకి ఫిర్యాదు చేసేవరకు పరిస్థితి వెళ్లింది. ఒంగోలులో పోలీసు సంఘానికి నాయకుడిగా చెప్పుకునే ఒకరు వైసీపీ పక్షాన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేష న్ సందర్భంగా ఒక కానిస్టేబుల్ మఫ్టీలో హల్‌చల్ చేయటం అధికారుల దృష్టికి వెళ్లింది. ఎస్పీ బదిలీ అనంతరం కిందిస్థాయిలో కొందరు పోలీసు అధికారుల దూకుడు చర్యకు బ్రేక్ పడుతుందని అందరూ భావించారు. కారణాలు ఏమైనా అది జరక్కపోగా వారి హడావుడి మరింత పెరిగింది. ఒంగోలులో ఇద్దరు సీఐలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేయగా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. అయితే అందులో భక్తవత్సలరెడ్డి అనే సీఐ తనను వీఆర్‌కు పంపాలని ముందుగానే ఉన్నతాధికారులకు లేఖ పెట్టుకోవటం విశేషం. తాజా ఘటన నేపథ్యంలో కొత్తగా వచ్చిన ఎస్పీ పోకడ ఎలా ఉంటుందనే విషయంపై కూడా టీడీపీ కూటమి అభ్యర్థులు, నాయకుల్లో అనుమానాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో సీఈసీ రాష్ట్రంలోని అధికారుల వ్యవహారశైలిపై దృష్టిపెట్టి చర్యలను పెంచింది. తదనుగుణంగా రాష్ట్రస్థాయిలో మరికొందరు కీలక అధికారులను కూడా ఈసీ విధుల నుంచి తప్పించవచ్చని భావిస్తున్నారు. తదనుగుణంగా ఇప్పటికే జిల్లాలోని పోలీసు శాఖలో ఉన్న పలువురు అధికారులు ఆరోప ణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కఠిన చర్యలు తప్పవని తెలుస్తోంది.



పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి పక్కన సివిల్ డ్రస్‌లో ఉన్న కానిస్టేబుల్ రత్నబాబు

వైసీపీ సేవలో పోలీస్ !

- వివాదాస్పదమవుతున్న కొందరు పోలీసుల తీరు
- బాలినేని ర్యాలీలో పాల్గొన్న కానిస్టేబుల్‌పై విచారణ

ఒంగోలు (క్రైం), ఏప్రిల్23 : పోలీసు శాఖలో పనిచేస్తున్న కొంతమంది వైసీపీ సేవలో తరించడం వివాదాస్పదమవుతోంది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితోనే కాకుండా ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, కోడలు కావ్యారెడ్డిలకు సెక్యూరిటీగా పోలీసులు పనిచేస్తున్నారన్న ఆరోప ణలు వినిపిస్తున్నాయి. సోమవారం జరిగిన బాలినేని నామినేషన్ ర్యాలీలో రత్నబాబు అనే కానిస్టేబుల్ ప్రణీత్‌రెడ్డి వెంట ఉండి చేసిన హడావుడి చర్చనీయాంశమైంది. అయనకు ర్యాలీలో ఎలాంటి విధులు లేకపోయినా సివిల్ డ్రస్‌లో కూడా ప్రణీత్‌రెడ్డికి దారి ఇవ్వండి అంటూ స్వామిభక్తిని చాటుకున్నారు. ఈ వ్యవహారంపై ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు దృష్టి సారించారు. కానిస్టేబుల్ విధులు ఏమిటి? ఆ సమయంలో ఆయన అక్కడ ఎందుకు ఉన్నారు? అన్న అంశంపై విచారణ చేపట్టి ఎస్పీకి నివేదిక ఇవ్వనున్నారు. మరికొంతమంది కానిస్టేబుళ్లు ఎన్నికల సమయంలో కూడా విధులు నిర్వహించకుండా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల వెంట తిరుగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. టంగుటూరులో డ్యూటీ చేయాల్సిన ఓ కానిస్టేబుల్ వైసీపీ అధి కారంలోకి వచ్చినప్పటి నుంచి యూనిఫాం వేసుకోకుండా ఒంగోలులోని ఓ ప్రజాప్రతినిధి తనయుడి వద్ద పనిచేస్తున్నాడు. అదేవిధంగా ఓ కాని స్టేబుల్ విజయవాడలో ఒంగోలుకు చెందిన ప్రజాప్రతినిధి ఇంట్లో సేవ చేస్తున్నాడు. ఇలా అనేక మంది వైసీపీ సేవలో తరిస్తున్నా ఉన్నతాధికా రులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అధికార పార్టీకి దారులు - ప్రజలకు అడ్డంకులు

- ప్రధాన పార్టీల నామినేషన్లు ముగిసినా
- ఆగని ట్రాఫిక్ ఆంక్షలు
- అధికారుల వింతవైఖరిపై విమర్శలు

కొండపి, ఏప్రిల్23: నామినేషన్ల సందర్భంగా అధికారుల ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధానంగా కొండపిలోని కామేపల్లి రోడ్డు నుంచి టంగుటూరు రోడ్డులోని గ్రామం వెలుపల వరకు అన్ని దారులను మూసి వేస్తూ అధికా రులు ఈనెల 16వ తేదీ నుంచి నిర్ణయం తీసు కున్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్య ర్థుల నామినేషన్ల కార్యక్రమం ముగిసింది. అయినా పోలీసు అధికారులు ఆంక్షలు సడలింక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఆ మార్గంలో యూనియన్ బ్యాంకు, పీడీ సీసీ బ్యాంకు, పోస్టాఫీసులు ఉన్నాయి. వీటితో పాటు పొగాకు వేలం కేంద్రానికి రైతులు కూడా ఈదారిలో రాకపోకలు సాగించాలి. అయితే నామినేషన్ల సందర్భంగా పోలీసులు ఆర్వో సూచనల మేరకు కట్టుడి నిబంధనలు విధిం చారు. ఈరూటులోని అన్ని మార్గాలను బారికే డ్లతో మూసివేశారు. పోలీసులు ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులను టంగుటూరు రూటులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3.30 నిమిషాల వరకు గ్రామంలోకి రానివ్వడం లేదు. వాహనాలను కూడా ఈసమ యంలో తిరగనివ్వడం లేదు. వాహనాలను ఇరుకు దారుల్లోకి మళ్లిస్తూ వాహనదారు లను, బ్యాంకులకు వచ్చివెళ్లే వారిని ఇబ్బం దులకు గురిచేస్తున్నారని ప్రజలు విమర్శి స్తున్నారు.



కామేపల్లి రోడ్డు జంక్షన్‌లో జనానికి అడ్డుగా పోలీసులు పెట్టిన ఇనుప గ్రిల్స్



సోమవారం మంత్రి నామినేషన్ సందర్భంగా టంగు టూరు రోడ్డులో ఎస్సీ కాలనీ వద్ద వదిలేసినట్రాఫిక్

వైసీపీ నామినేషన్లకు లేని ఆంక్షలు...

నామినేషన్లు ప్రారంభ రోజైన 18వ తేదీనుంచి కఠిన ఆంక్షలు ఆర్వో సూచన లతో అమలు చేసిన పోలీసులు 19వ తేదీ ఎన్‌డీఏ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే స్వామి నామినేషన్‌కు కఠిన ఆంక్షలు అమలు చేశారు. పొదిలి, మద్దులూరు, కామేపల్లి, టంగు టూరు రోడ్డులో వచ్చే వాహనాలను ఆయా రూట్లలో కొండపి గ్రామం వెలుపల ఆపివేశారు. అంతేకా కుండా ప్రధానమైన సభాస్థలి వద్దకు వెళ్లేందుకు ప్రధాన రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేసి వెళ్లనివ్వ లేదు. దీంతో ఎస్సీ కాలనీలలోని ఇరుకు సందుల్లో వాహనాలు తీసు కెళ్లి పెట్టుకుని అక్కడ నుంచి కాలినడ కన పలు మండలాల నుంచి వచ్చిన వారు వెళ్లారు. అయితే అధికారులు మాత్రం వైసీపీ అభ్యర్థి, మంత్రి సురేష్ నామినేషన్‌కు కొండపికి పడమర వైపు పొదిలి, మద్దులూరు, కామేపల్లి వైపు నుంచే వచ్చే వాహనాలను టంగుటూరు ప్రధాన రోడ్డులో గ్రామం వెలుప లగా సభా స్థలికి చేరుకునేందుకు అన్ని రూట్లలో దారిచూపిస్తూ పోలీసులు ఏర్పాటు చేసిన బారి కేడ్లకు ఫ్లెక్సీలకు తగిలించారు. అధికార పార్టీకి అంతగా సేవ చేసిన అధికారులు, టీడీపీ నామి నేషన్ రోజున దారి చూపిస్తూ ఫ్లెక్సీలు ఎందుకు ఏర్పాటు చేయలేదని టీడీపీ నాయకులు, శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి సాను కూలంగా, ప్రతిపక్ష పార్టీకి ప్రతికూలంగా పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపై ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు ఇలా పక్ష పాతంగా వ్యవహరించడం న్యాయం కాదని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కామేపల్లి రోడ్డు నుంచి టంగుటూరు రోడ్డువైపు ఒకవైపు (వన్‌వేలోనైనా) వాహనాలను అనుమతించా లని ప్రజలు కోరుతున్నారు.

పారిశ్రామికంగా బాపట్లను అభివృద్ధి చేస్తా


- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి
- కూటమి ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్ నామినేషన్ దాఖలు

బాపట్ల, ఏప్రిల్ 23 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అ భివృద్ధి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కూటమి ఎంపీ అభ్యర్థిగా మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు నామినేషన్ దాఖలు చేసిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలీసు అధికారిగా ఉమ్మడి రాష్ట్రంలో పనిచేశానన్నారు. 35 సంవత్స రాలు పాటు భారతదేశానికి సేవలందించిన తాను ప్రతిదినం ప్రజలకు సేవ చేయా లనే ఆలోచనతో ముందుకెళుతున్నానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐపీఎస్ అధికారిగా పని చేసిన తాను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డుతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని చెప్పారు. గుంటూరులో రౌడీయిజం అణిచివేయటానికి చంద్రబాబు తనను ఎస్పీగా పంపారని 6 నెలల్లో దానిని తీసివే శానని చెప్పారు. నాటి చరిత్రను తిరగరాస్తానని బాపట్లను అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. నిజాంపట్నంలో పోర్ట్, ఓడరేవులో ఫిషింగ్ హా ర్బర్, చీరాలలో మెగా టెక్స్‌టై ల్‌పార్క్, సంతనూతలపాడు-అద్దంకి మధ్య గ్రానైట్ ఇండస్ట్రీకి క్లస్టర్ కట్టిస్తానని చెప్పారు. ఐటి హబ్ ఏర్పాటు చేయటంతోపాటు చీరాల-బాపట్లలో టూరిజం ప్రాజె క్టులు తీసుకొచ్చి లక్షలాదిమంది యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. యువత డాలర్ల కోసం ఇతర దేశాలకు వెళ్ళకుండా ఇక్కడ అంత మొత్తం సంపాదించుకునే విధంగా ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, న్యాయవాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై నాగశివారెడ్డికి షోకాజ్ నోటీసు

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫిర్యాదు మేరకు చర్యలు

బాపట్ల, ఏప్రిల్ 23 : పర్చూరు తహసీల్దార్ కార్యాలయం మెయిన్‌గేటు వద్ద విధు లు నిర్వహిస్తున్న ఎస్సై నాగ శివారెడ్డి తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను అసభ్యకర ప దజాలంతో దూషించాడని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయానికి నాగశివా రెడ్డిని పిలిపించి వివరణ కోరారు. అనంతరం ఎస్సైకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ ఘటనపై ప్రత్యేక విచారణాధికారిగా బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను ని యమించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న నా గశివారెడ్డిని అన్నంభొట్లవారిపాలెం చెక్‌పోస్ట్ విధులకు పంపించారు.




ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	38.3	36.0	41.0	42.0	38.0
కనిష్ఠం	26.2	26.0	26.0	25.0	27.0

సోమశిలలో 8.381 టీఎంసీల నిల్వ

అనంతసాగరం: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి ప్రాజెక్టులో 8.381 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఇసుకాసురం..!

- యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ
- నాలుగేళ్లలో రూ.1500 కోట్ల పైమాటే!
- కొండలా పెరిగిపోయిన వైసీపీ నేతల ఆస్తులు



తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు!

- ఇది భర్తృహరి సుభాషితం-2లోని తొలి పంక్తి. ప్రయత్నం చేయడం వల్ల ఇసుక నుంచి తైలం (నూనె) తీయవచ్చును అనేది దీని భావం.

పాపం భర్తృహరి ఏ ఉద్దేశంతో ఈమాట చెప్పారో తెలియదు కానీ ఆయన పుట్టిన భరతఖండంలో పుట్టిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాత్రం అసాధ్యమనుకున్న పనిని చేసి చూపించారు. ఇసుక నుంచి నూనె కాదు కదా..! ఏకంగా టిప్పర్ల కొద్దీ ప్రజల నెత్తుటి కష్టాన్ని పిండి చూపించారు. కొత్త ఇసుక పాలసీ పేరుతో వేలాది కార్మిక కుటుంబాలను ఆకలితో అల్లాడించారు. హిందూ సంస్కృతిలో భాగంగా ప్రేమగా పెంచుకున్న జుట్టుపై తుగ్లక్ పాలనలో పన్ను వేశారని చరిత్ర చెబుతుంటే ఈ వైసీపీ ప్రభుత్వం అంతకన్నా ఘోరంగా ఊరి పక్కన ఉన్న ఏట్లో ఇసుక కోసం ప్రజల నుంచి వందల వేల కోట్లు కొల్లగొట్టడం ద్వారా పాలనా విధానంలో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇసుక పాలసీ పేరుతో వైసీపీ నాయకుల ఆస్తులు కొండల్లా పెంచుకున్నారు. భూగర్భ జలాలకు ఆధారమైన నదులు, వాగులు, వంకలను కుళ్లబొడిచి సహజ వనరులను కొల్లగొట్టారు. ఇసుక పాలసీ పేరుతో జిల్లా ప్రజలను పిండుకున్న మొత్తం ఎంతో లెక్కగడితే కడుపు రగిలిపోతుంది. ఇసుక ధర రూపంలో వసూళ్లు చేసుకున్న మొత్తం అక్షరాల వెయ్యి కోట్లకు పైమాటే. అధికారిక లెక్కల ప్రకారమే నాలుగేళ్లలో 600 కోట్లు ఇసుక ధర రూపంలో ప్రజల నుంచి పిండుకున్నారు. వాస్తవానికి ఇంతకు నాలుగు రెట్లు అదనంగా తవ్వకాలు జరిపి వేల కోట్లు పోగేసుకున్నారు.

ఆకలి.. ఆకలి.. ఆకలి...

వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీలో ఎటు చూసినా ఆకలే కనిపిస్తుండటం విశేషం. ఇసుక ధర నిర్ణయించి గుత్తేదారులకు కేటాయించడంలో ప్రభుత్వం ఆకలి కనిపిస్తోంది. ఇసుక డబ్బులతో ఖజానాను ఎంతో కొంత నింపుకోవచ్చని ప్రభుత్వం ఆశించింది. సహజ వనరైన ఇసుకను రాష్ట్రవ్యాప్తంగా గంపగుత్తగా ఒకరికి ధారాదత్తం చేయడం ద్వారా వేల కోట్లు తమ వ్యక్తిగత ఖాతాలోకి జమ చేసుకోవచ్చనే ప్రభుత్వ పెద్దల ఆకలి ప్రజలందరికీ అర్థమైంది. ఆ తరువాత కాంట్రాక్టర్ల ఆకలి కనిపిస్తోంది. మేతగా నేతకు ఇంత వేశాం.. మరి అంతకు పదిరెట్లుగా మనవాటా ఉండాలిగా అన్నట్లు ప్రభుత్వానికి టన్ను ఇసుకకు డబ్బులు కట్టి అనధికారికంగా పది టన్నుల ఇసుక అమ్మేసుకున్నారు. ఆ తరువాత జిల్లా వైసీపీ నాయకుల ఆకలి. బాస్ తింటున్నాడు. ఎక్కడి నుంచో వచ్చిన (కాంట్రాక్టర్లు) బేవకూఫ్‌లు తింటున్నారు. ఇక్కడున్న మేమేం తక్కువా అంటూ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు అనధికారిక రీచ్‌లపై విరుచుకుపడ్డారు. ప్రధాన కాంట్రాక్టరు అడ్డుపడినా, స్థానిక ప్రజలు అడ్డగించినా లెక్కచేయక ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దించి రేయింబవళ్లు తేడా లేకుండా చిన్న సైజు వాగులు, వంకలను మింగేశారు. స్టాక్ పాయింట్లలో ఇసుక కొండలు ఉన్నట్లు, అక్రమ తవ్వకాల ద్వారా వైసీపీ నాయకులు తమ ఆదాయాన్ని కొండల్లా పెంచుకున్నారు. చిట్టచివరిది భవన నిర్మాణ కార్మికుల ఆకలి. కొత్త ఇసుక పాలసీ రూపంలో ప్రభుత్వం దాదాపు ఆరేడు నెలల పాటు ఇసుక దొరకని పరిస్థితి తెచ్చింది. దానికి ముందు ఏడాది కాలం పాటు కరోనా కాటుకు గురై పనులు దొరకని పరిస్థితిని ఎదుర్కొంటే ఆ తరువాత ఆరేడు నెలల పాటు ప్రభుత్వ నిర్లక్ష్య కాటుకు గురై ఉపాధి లేకుండా ఆకలితో అల్లాడిపోయారు.



నెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారికంగా ఏడు రీచ్‌లు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఏడాదికి 29 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయి. ఉదాహరణకు 2022, నవంబరు నుంచి 2023 నవంబరు వరకు పెన్నా బ్యారేజ్ నుంచి 13.11లక్షల మెట్రిక్ టన్నులు, సంగం బ్యారేజ్ నుంచి 12.24 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం కాంట్రాక్టరుకు కేటాయించింది. ఇక మినగల్లు 70,350, పడమటికంపాడు 73,200, ముదివర్తి 72,750, వల్లిపాడు 73200, విరువూరు (పొదలకూరు) 69,750 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగినట్లు అధికారిక లెక్కలు. ఏడాదికి మొత్తం 29లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగినట్లు లెక్క. కరోనా కాలం ఏడాది మినహాయించి నాలుగేళ్ల కాలంలో 1.16 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయన్న మాట.

అధికారిక లెక్కల ప్రకారం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇసుక ఉచితం. కానీ వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుకకు రూ.500 ధర నిర్ణయించి వసూళ్లు చేశారు. ఈ లెక్కన నాలుగేళ్ల కాలానికి ప్రభుత్వం రీచ్‌ల వారీగా కాంట్రాక్టరుకు కేటాయించిన ఇసుక పరిమాణం 1.16 కోట్ల మెట్రిక్ టన్నులు. టన్నుకు రూ.500 చొప్పున 1.16కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక కొనుగోలు కోసం ప్రజలు 580 కోట్ల రూపాయలు ఖర్చు చేసుకున్నారు.

అనధికారికంగా నాలుగురెట్లు ఎక్కువే

అనధికారికంగా ఇంతకు నాలుగు రెట్లు అధికారంగా ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిగాయి. కేటాయించిన రీచ్‌ల్లో ఒక మీటరు లోతుకు మించి తవ్వకాలు జరప కూడదు. ఈ మీటరు లోతు వరకు ఎంత పరిమాణం ఇసుక లభిస్తుందనే లెక్కలు కట్టి ఆ మేరకు ఆ రీచ్‌లో ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వ కోవచ్చో నిర్దేశిస్తూ కాంట్రాక్టరుకు అప్పగిస్తారు. అయితే జిల్లా పరిధిలో ఏ రీచ్ వద్దకు వెళ్లి చూసినా ఆరు నుంచి ఎనిమిది మీటర్ల లోతు వరకు తవ్వేశారు. భారీ యంత్రాలు ఉపయోగించి ఇష్టారాజ్యంగా పెన్నా నదితో సహా అన్ని రీచ్‌లను కుళ్లబొడిచేశారు. మైనింగ్‌శాఖ పరిధిలో పనిచేసే కాస్త నిజాయితీ పరులైన అధికారుల సమాచారం ప్రకారం దాదాపుగా ప్రతి రీచ్ పరిధిలో కేటాయించిన ఇసుక కన్నా నాలుగైదు రెట్లు అధి కంగా తవ్వి అమ్ముకున్నట్లు చెబుతున్నారు. అంటే ఇసుక కాంట్రాక్టర్లు ప్రజల నుంచి టన్నుకు రూ.500 చొప్పున ఈ నాలుగేళ్లలో రూ.1500 కోట్లకు పైగానే పిండు కున్నారు.

● తెలుగు దేశం ప్రభుత్వంలో నెల్లూరు నగరానికి ట్రాక్టరు ఇసుక 1200 నుంచి 1800 రూపాయలకు తోలేవారు. ఇప్పుడు రూ.4వేల నుంచి 5వేలు అయ్యింది. అప్పటికి ఇప్పటికి ట్రాక్టరు బాడుగ ఏం పెరగలేదు. టన్నుకు రూ.500 చొప్పున ప్రభుత్వం వసూలు చేసే మొత్తం ఒక ట్రాక్టరుపై 3వేల రూపాయల వరకు అవుతోంది.



సంగం : పెన్నానదిలో ఇసుక తవ్వేందుకు ఉన్న భారీ యంత్రాలు (ఫైల్)

ఇసుక ధర రెండింతలు పెరిగింది



గత టీడీపీ ప్రభుత్వంలో ఇసుక ఉచితం కావడంతో వెయ్యి రూపాయలకే ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరేది. పక్క గ్రామాలకు రూ.1500లకే చేరేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రీచ్‌లో నుంచి ట్రాక్టర్ బయటకు రావాలంటే రూ.2800, పక్క గ్రామాలకైతే రూ.3500 నుంచి 5వేలు ధర పలుకుతోంది. ఈ ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇల్లు కట్టేలా లేదు. సిమెంట్ కంటే ఇసుకకు ఖర్చు ఎక్కువ అవుతోంది. చెప్పాలంటే ఇంటి నిర్మాణ బడ్జెట్‌లో సగం ఇసుకకే. దీంతో నిర్మాణాలు తగ్గిపోయి తాపీ మేస్త్రీలకు చేతి నిండా పనిలేక పట్టణాలకు వలసపోతున్నారు.

- ఖాదర్‌బాషా, తలుపూరుపాడు, సంగం



కందుకూరులో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన భారీ ర్యాలీ

41 మంది.. 49 సెట్లు

● ఐదో రోజూ భారీగా నామినేషన్లు

నెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల జోరు కొనసాగుతోంది. 5వ రోజు మంగళవారం కూడా పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. నెల్లూరు పార్లమెంటుతో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 41 మంది అభ్యర్థులు 49 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నెల్లూరు ఎంపీ స్థానానికి ఐదుగురు, కందుకూరులో ఏడుగురు, కావలిలో నలుగురు, ఆత్మకూరులో నలుగురు, కోవూరులో ఇద్దరు, నెల్లూరు సిటీలో ఐదుగురు, నెల్లూరు రూరల్‌లో నలుగురు, సర్వేపల్లిలో ముగ్గురు, ఉదయగిరిలో ఏడుగురు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా ఉన్నారు. నెల్లూరు ఎంపీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా వేణుంబాక సునందరెడ్డి నామినేషన్ వేశారు. కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరు నాగేశ్వరరావు నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా ఇంటూరి సౌజన్య కూడా టీడీపీ తరపున నామినేషన్ దాఖలు చేశారు. నెల్లూరు రూరల్‌లో వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తరపున మరోసెట్ నామినేషన్ దాఖలైంది. కాంగ్రెస్ అభ్యర్థులుగా ఉదయగిరిలో సోము అనీల్‌కుమార్, నెల్లూరు రూరల్‌లో షేక్ ఫయాజ్, కందుకూరులో గౌస్ మొహిద్దీన్ నామినేషన్లు వేశారు. వీరితోపాటు ఇతర పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు కూడా నామినేషన్లు దాఖలు చేశారు.

రూ.5.81 లక్షల స్వాధీనం

నెల్లూరు (క్రైం) : జిల్లావ్యాప్తంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.5,81,510 నగదును స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కు చెక్‌పోస్టులో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఓ టైల్స్ వ్యాపారి నాగరాజు వద్ద రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిన్న బజారు పోలీసు స్టేషన్ పరిధిలో రూ.2 లక్షలు, సంతపేట పరిధిలో రూ.1,16,510, దుత్తలూరులో రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నారు. కావలి రూరల్ పరిధిలో 14, సైదాపురం 10, బిట్రగుంట 30, అల్లూరు 13, కొండాపురం 38, కలిగిరి 11, జలదంకి 17, వికె పాడు 18, సంగం 10, కందుకూరు రూరల్ 14, బెల్లపు ఊట 1050, సెబ్ అధికారులు 158 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

వామ్మో.. గోవా మద్యం!

● కందుకూరులో పట్టుకున్న అధికార బృందం

కందుకూరు, ఏప్రిల్ 23 : జిల్లాలో గోవా మద్యం సృష్టించిన కలకలం అంతా ఇంతా కాదు. ఎన్నో కుటుంబాలను చీకట్లోకి నెట్టేసిన ఆ మద్యం ఈ ఎన్నికల్లో మళ్లీ జిల్లాలో ప్రత్యక్షమవుతోంది. మంగళవారం కందుకూరులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 768 మద్యం సీసాలను సీజ్ చేశారు. గోవాకు చెందిన చీప్ లిక్కర్‌ను ఓ కారులో తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో నూతన జాతీయ రహదారి సమీపంలో కాపుకాసి కారుతో సహా మద్యంను సీజ్ చేశారు. అయితే, కారు యజమాని పరారయ్యాడని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



కారులో ఉన్న మద్యం బస్తాలు

● మద్యం డంప్‌లపై దృష్టి పెట్టండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం): మద్యం అక్రమ డంప్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ మద్యం షాపుల్లో విక్రయాలపై నిఘా పెంచాలన్నారు. ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం అక్రమ రవాణా జరగ కుండా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ కొరియర్లతో పాటు నిత్యావసర వస్తువుల బల్క్ లావాదేవీలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. జీఎస్టీ అధికారులు వ్యాపార లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మాట్లాడు తూ చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ బృందాలు విస్తృ తంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా, అదనపు ఎస్పీ సౌజన్య, జిల్లా రవాణాశాఖ అధికారి చంద్ర, ఎక్సైజ్ శాఖ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, సెబ్ అధికారి శ్రీధర్, జీఎస్టీ జాయింట్ కమీషనర్ రవీంద్రనాథ్, ఈవీఎం నోడల్ అధికారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ స్థలాల్లో ఇవి నిషిద్ధం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, భవనాలు తదితరాలపై ఎన్నికల ప్రచార పోస్టర్లు అతికించడం, జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు నిషిద్ధమని జిల్లా ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు స్థలాలు, భవనాలపై పోస్టర్లు, జెండాల ఏర్పాటుకు వాటి యజమాని నుంచి రాతపూర్వక అనుమతి పొందాలని సూచించారు.

విభేదాలు వీడిన 'ఇంటూరి'!

- సయోధ్య కుదిర్చిన వీపీఆర్
- రాజేష్‌కు బాబు, లోకేష్‌ల ఫోన్
- రాజకీయ భవిష్యత్తుకు హామీ
- శివరాంకు నాగేశ్వరరావు క్షమాపణలు

కందుకూరు, ఏప్రిల్ 23 : నియోజకవర్గ టీడీపీలో నెలకొన్న వర్గవిభేదాలకు తెరపడింది. రెండు వర్గాలుగా ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఆ పార్టీ యువనాయకుడు ఇంటూరి రాజేష్‌లు చేతులు కలిపారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించి పార్టీ నేతలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, చంద్రబాబు సీఎం కావటమే లక్ష్యంగా పార్టీ విజయానికి ఆటంకం కలిగించకూడదన్న ఆలోచనతో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలనే ఆలోచన మానుకున్నట్లు రాజేష్ ప్రకటించారు.

● శివరాంకు క్షమాపణ

మరోవైపు తనను అవమానకరంగా మాట్లాడిన ఇంటూరి నాగేశ్వరరావుకు సహకరించేది లేదన్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా శాంతించారు. వీపీఆర్ ఇంటూరి రాజేష్‌తో కలిసి శివరాం ఇంటికెళ్లి చర్చించటంతో పాటు సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పత్రికాముఖంగా శివరాంకు నాగేశ్వరరావు క్షమాపణ చెప్పారు. ఎప్పటికీ ఆయన గురువు.. నేను శిష్యుడిని... అన్నట్లే మెలుగుతానని రాజేష్‌తో కలిసి పనిచేస్తానని నాగేశ్వరరావు ప్రకటించారు. దీంతో శివరాం వీపీఆర్ విజయానికి పనిచేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

● బాబు, లోకేష్‌ల ఫోన్

అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌లను రాజేష్‌తో వీపీఆర్ ఫోన్‌లో మాట్లాడించారు. పార్టీ అధికారంలోకి రాగానే కార్పొరేషన్ చైర్మన్ పదవి, రెండేళ్ల తర్వాత ఎమ్మెల్సీ పదవి ఇచ్చేందుకు చంద్రబాబుతో హామీ ఇప్పించారు. అనంతరం లోకేష్ కూడా రాజేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్తును తాము చూసుకుంటామని అభయమిచ్చారు.

● వర్గ సమస్యకు తెర

ఈ క్రమంలో కందుకూరులో టీడీపీకి ప్రతిబంధకంగా ఉన్న వర్గ సమస్యకు తెరపడింది. అనంతరం నాగేశ్వరరావు నామినేషన్‌లో పాల్గొన్న వీపీఆర్ మరోసారి తిరిగి రాజేష్ కార్యాలయానికి చేరుకుని అక్కడే భోజనం చేశారు. అక్కడ గంటకుపైగా వివిధ అంశాలపై చర్చించారు. తిరిగి టీడీపీ కార్యాలయానికి చేరుకుని నాగేశ్వర రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాగేశ్వరరావుతో శివరాంకు క్షమాపణ చెప్పించారు. అనంతరం నాగేశ్వరరావును వెంటబెట్టు కుని రాజేష్ వద్దకు వచ్చిన వీపీఆర్ రాజేష్ అనుచరులందరి సమ క్షంలో ఇద్దరితో కరచాలనం చేయించారు. దీంతో కథ సుఖాంతమైంది. ఈ కార్యక్రమంలో దివి రమేష్, చల్లా శ్రీనివాసరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వేమిరెడ్డి సమక్షంలో చేతులు కలిపిన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్

ఎస్సీ, బీసీలకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఎలా ఇస్తారు?

చిట్టగుంట, ఏప్రిల్ 23: ఎస్సీ, బీసీ, కులాలకు చెందిన వారికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఎలా ఇచ్చారని గిరిజన మహిళ గుర్రంకొండ సుమతి రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయ్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కప్పరాళ్లతిప్పకు చెందిన గంధం ధనమ్మ భర్త గంధం బాబురావు ఎస్సీ (మాల) కులం కాగా అధికారులు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఇవ్వ డం ఎంత వరకు సబబు అన్నారు. అదే గ్రామంలో వడ్డెర కులానికి చెందిన కొందరు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు గుత్తి సుధాకర్, దేవరకొండ వరుణ్, ఆవుల అరుణ్, బచ్చు నిరంజన్, గుర్రంకొండ గోపి, తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

నేడు కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

కావలిటౌన్, ఏప్రిల్ 23: కావలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదలకూరి కల్యాణ్ బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్ బాబు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు బీఫాం అందజేశారు. ఆర్డీవో కార్యాలయంలో జరిగే నామినేషన్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు మానస, తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

చిట్టగుంట, ఏప్రిల్ 23: బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన షేక్.నిజాముద్దీన్ పదవ తరగతిలో 534 మార్కులతో పాఠశాల ఫస్ట్ రావడంతో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ ఠాగూరు రూ.1000 ప్రోత్సాహ బహుమతిగా మంగళవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లితండ్రులు అల్లాభక్షు, ఆయెషా, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

చిట్టగుంట, ఏప్రిల్ 23: బోగోలు యాదవపాలెంలో వెలసి ఉన్న కోదండరామాలయ ప్రాంగణంలో మంగళవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. బోగోలు మాజీ సర్పంచు, ఉపసర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్, రమణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కళ్యాణ అలాగే బృందావనం కోదండరామాలయంలో వైభవంగా స్వామి అమ్మవార్ల కల్యాణం జరిగింది. కల్యాణోత్సవాలు తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

టీడీపీలోకి 'మెట్టుకూరు'

కలిగిరి, ఏప్రిల్ 23: ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పార్టీ మారినా ఆయన అనుచరుడైన చిరంజీవిరెడ్డి మౌనముద్ర దాల్చి 50రోజుల తర్వాత తుది నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు. ఈయన చేరికతో ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీకి కలిసొస్తుందని ఆ పార్టీ వర్గాలు తెలిపారు.

కేంద్ర బలగాలతో సీఐ కవాతు

కావలి రూరల్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 1వ పట్టణ సీఐ రాజేష్ మంగళవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు 60 మంది కేంద్ర బలగాలు, 1వ పట్టణ సిబ్బందితో కలసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో, ఆముదాలదిన్నెలో కవాతు నిర్వహించారు.

కౌరగుంటలో ప్రచారం

దగదర్తి(చిట్టగుంట), ఏప్రిల్ 23: దగదర్తి మండలం కొత్తపల్లి కౌరగుంట పంచాయతీలో అంబేడ్కర్ పార్టీ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, నక్క గిరి, కప్పల నవీన్ కుమార్, కిరణ్ కుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో రోడ్‌షో

అల్లూరు: నార్తుమోపూరు, గ్రద్దగుంట, బట్రకాగొల్లు, నార్తుఆములూరు, బీరంగుంటలో మంగళవారం ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు రోడ్‌షో నిర్వహించారు. నాయకులు ఎన్.సాయికుమార్, ఎం.సుకుమార్‌రెడ్డి, డీ.కృష్ణారెడ్డి, బీద రమేష్ పాల్గొన్నారు.

కావలి కందుకూరు

పల్లె గొంతెండుతోంది!

- వేసవి ప్రారంభంలోనే మంచినీటి ఎద్దడి
- క్లోరినేషన్‌కు నోచని రాళ్లపాడు జలాలు
- కలుషిత నీటితో రామాయపట్నంలో చర్మవ్యాధులు
- అడుగంటిన సొన కాలువలు
- ఉలవపాడులో ఏడాదంతా నీటి కష్టాలే..

ఉలవపాడు, ఏప్రిల్ 23 : వేసవి కాలం ప్రారంభంలోనే మంచినీటి ఎద్దడి ఏర్పడి పల్లె ప్రజల గొంతెండుతోంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సుమారు 16 వేల జనాభా కలిగిన ఉలవపాడు మేజర్ పంచాయతీలో ఐదు రోజులకొకసారి కూడా మంచినీరు సరఫరా కాని పరిస్థితి నెలకొంది. గ్రామానికి 5 కి.మీ దూరం నుంచి పైప్‌లైన్ ద్వారా బావి నీటిని పంపింగ్ చేసి మూడు ట్యాంక్‌లను నింపాలి. పైగా కరెంటు సరఫరాను బట్టి పంపింగ్ జరుగుతోంది. దీంతో 5 రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో నీటి సొనల్లో పూర్తిగా ఊట తగ్గిపోయే పరిస్థితి ఉంది. అన్ని వనరులు ఉన్నప్పుడే ఏడాదంతా నీటి కష్టాలతో అల్లాడుతుండగా సొనల్లో నీటి ఊట లేకుంటే అప్పుడు ఎలా చేయాలిరా దేవుడా.. అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఇళ్లల్లోని బోర్లు కూడా భూగర్భ జలమట్టం ఘననీయంగా పడిపోతోంది. రామాయపట్నం ప్రజలకు మంచినీరు సరఫరా జరిగే ప్రాజెక్టుకు సంబంధించిన విద్యుత్ మోటారు మరమ్మతులకు గురవడంతో మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయంగా రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ నీరు కలుషితమై దుర్వాసన రావడంతోపాటు ఆ నీటిని వినియోగించిన ప్రజలకు శరీరంపై దురదలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో గత్యంతరంలేక గ్రామంలోని ఆర్వో ప్లాంటు నీరు కొనుగోలు చేసి వినియోగించక తప్పడం లేదంటున్నారు. కనీసం రాళ్లపాడు నుంచి వచ్చే నీటిని క్లోరినేషన్ అయినా చేసి సరఫరా చేయాలని సంబంధిత అధికారులను రామాయపట్నం ప్రజలు కోరుతున్నారు. ఇదిలాఉండగా వీరేపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్ వెనుక ఉన్న ఎస్టీ కాలనీలో మంచి నీటి సరఫరా ఎప్పుడు జరుగుతుందో వారికే తెలియడం లేదు. మన్నేరు ఒడ్డున ఉన్న మన్నేటికోటలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నా గ్రామానికి, ముఖ్యంగా ఎస్టీ కాలనీకి రెండు రోజులకు ఒకసారి నీర్లు వదులుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నీటిని విడుదల చేసే పంచాయతీ ఉద్యోగి సకాలంలో నీరు వదలకపోవడంపై గ్రామస్థులు ప్రశ్నిస్తే అడ్డగోలు సమాధానం చెబుతున్నాడన్న ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అతని పనితీరులో మార్పు లేదని ఎస్టీ కాలనీవాసులు వాపోతున్నారు.



బావిలో నీటిపై పేరుకుపోయిన పాచి, వ్యర్థాలు



ఉలవపాడు సమీపంలో సొన కాలువలో అడుగంటిన నీరు

అధికారుల విఫలం

రామాయపట్నంలో పంచాయతీకి చెందిన బోరు బావి ఉంది. దానిని ఉపయోగించుకోవడంలో పంచాయతీ అధికారులు విఫలం అయ్యారు. ప్రత్యామ్నాయంగా రాళ్లపాడు రిజర్వాయర్ నీరు డైరెక్టుగా పంపింగ్ చేస్తుండటంతో నీరు దుర్వాసన, ఆకుపచ్చ రంగులో వస్తున్నాయి. వీటిని వాడితే ఒంటిపై దురదలు, చర్మ వ్యాధులు వస్తున్నాయి.

- వై.రామారావు, రామాయపట్నం

సొనల ఊట తగ్గడంతో బావిలో నీరు అడుగంటింది

సొనల ఊట తగ్గడంతో బావిలో నీరు అడుగంటింది. అయితే ప్రత్యామ్నాయంగా ఉన్న బోర్లు సిద్ధం చేసి నీటి ఎద్దడి లేకుండా చూస్తాం. ఎస్టీ కాలనీ వద్ద ఉన్న ట్యాంక్ నింపాలంటే ముందుగా సంపు నిండి తరువాత మోటారు ద్వారా ట్యాంక్‌లోకి పంప్ చేయాలి. అందువలన సమయం పడుతుంది. డైరెక్ట్‌గా ట్యాంక్ నింపేలా చూస్తున్నాం.

- విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఉలవపాడు

అట్టహాసంగా 'కావ్య' ఎన్నికల ప్రచారం



ప్రచార రథంపై మాట్లాడుతున్న క్రిష్ణారెడ్డి, పక్కన మాలేపాటి



దగుమాటికి హారతులు ఇస్తున్న మహిళలు

దగదర్తి(చిట్టగుంట), ఏప్రిల్ 23 : దగదర్తి మండలం వెలిపోడు, కాట్రాయపాడు పంచాయతీలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడు రవీంద్రనాయుడుల ఆధ్వర్యంలో మంగళవారం కావలి అభ్యర్థి దగుమాటి(కావ్య) క్రిష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం అట్టహాసంగా జరిగింది. స్థానికులు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ దగుమాటికి ఘన స్వాగతం పలికారు. వెలిపోడు గ్రామంలోని శివాలయంలో పూజల అనంతరం గిరిజన కాలనీలో మృతి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను కావ్య, మాలేపాటిలు పరామర్శించారు. జెండా చెట్టు సెంటర్, మబ్బుగుంటపాలెం, కామినేనిపాలెం గ్రామాల్లో మహిళలు హారతులు పట్టారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కాట్రాయపాడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే చంద్రబాబునాయుడు సీఎంగా రావాలన్నారు. జిల్లా, నియోజకవర్గాలు అన్ని విధాల అభివృద్ధి చెందలంటే ఉమ్మడి పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యేగా దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్, విమానాశ్రయం, రామయ్యపట్నం హార్బర్ నిర్మాణాలు చంద్రబాబు ప్రతిపాదనలో పురుడు పోసుకున్నవే అన్నారు. బాబును సీఎంగా చేసుకుని వాటిని ప్రారంభించుకోవడమే కాకుండా మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని యువతకు ఉపాధి కల్పించుకుందామన్నారు. టీడీపీని గెలిపించుకుని ఆంధ్రరాష్ట్రానికి పట్టిన దరిద్రాని తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డిపాలెంలో...

బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం కొత్తూరులో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కావలి టీడీపీ అభ్యర్థి సోదరుడు దగుమాటి వేణు గోపాల్‌రెడ్డి, స్థానిక నేతలు కాండ్ర రఘురాంనాయుడు, గణేషం రమేష్‌రెడ్డి, పిన్నిబోయిన రవీంద్రలలు సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు అబ్దుల్, రజాక్, బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చెన్నూరు వైసీపీ సర్పంచు దంపతులు

కావలి, ఏప్రిల్ 23 :: దగదర్తి మండలం చెన్నూరు మేజర్ పంచాయతీ వైసీపీకి చెందిన సర్పంచు బుక్కే. సునీత, ఆమె భర్త వెంకటరమణనాయక్‌లు మరో 60 కుటుంబాలతో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కావలి పట్టణం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో వారికి ఎన్డీఏ కూటమి అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సర్పంచుతో పాటు మోడే హరినాయక్, మోడే వెంకటరమణయ్యానాయక్, ప్రభాకర్‌నాయక్, లక్ష్మీనాయక్, బుక్కే శేషానాయక్, మోడే శ్రీనివాస నాయక్, మోడే జయరాం నాయక్ తదితరులు ఉన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులపై చులకన భావంగా చూస్తుండటంతో అక్కడ ఇమడలేక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.



చెన్నూరు వైసీపీ సర్పంచుకు కండువా వేస్తున్న కావ్య

జలదంకిలో వైసీపీకి మళ్లీ షాక్!

- బ్రాహ్మణక్రాకలో 120 కుటుంబాలు టీడీపీలో చేరిక

జలదంకి, ఏప్రిల్ 23 : జలదంకి మండలంలో అధికారి వైసీపీకి వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్యతో పాటు పలువురు ఎమ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, సొసైటీ డైరెక్టర్, మండల, గ్రామనాయకులు టీడీపీలో చేరిపోయారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి స్వగ్రామం బ్రాహ్మణక్రాకలో వైసీపీకి చెందిన 120 కుటుంబాల వారు టీడీపీ చేరారు. నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో మంగళవారం వారికి పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ వరుస పరిణామాలతో వైసీపీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.



వేమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన బ్రాహ్మణక్రాక వాసులు

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

మండలంలోని బ్రాహ్మణక్రాక, జలదంకి, గట్టుపల్లి, కమ్మవారిపాలెం, చామదల, అన్నవరం, తదితర గ్రామాల్లో మంగళవారం టీడీపీ నాయకులు ఇంటింటా కరపత్రాలు పంచుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్, భవిష్యత్‌కు గ్యారెంటీ, సామాజిక పింఛను రూ.4వేలు, దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, బీసీ కులాలకు 50ఏళ్లకే పింఛను తదితర సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయని ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో టీడీపీ, తెలుగుయువత మండల అధ్యక్షులు పులుగుంట మధురెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, కూరపాటి మాలకొండారెడ్డి, కొల్లా క్రిష్ణ, గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, బీజేపీ, జనసేన నాయకులు బండారు తిరుపతిరెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు



జలదంకి : గట్టుపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మండలంలో ముమ్మర ప్రచారం

కొండాపురం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మర ప్రచారం జరిగింది. ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడి ప్రభాకర్‌రెడ్డిల విజయమే లక్ష్యంగా ప్రచారం నిర్వహించారు.

జనసంద్రంలా కందుకూరు

- అట్టహాసంగా టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నామినేషన్

కందుకూరు, ఏప్రిల్ 23: కందుకూరులో జనసంద్రం ఉప్పొంగింది. టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వేలాది మంది జనసందోహం మధ్య భారీ ర్యాలీతో మంగళవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. కందుకూరు పట్టణంతో పాటు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది పసుపు సైనికులు తరలివచారు. అశేషజనవాహిని మధ్య పామూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి పామూరు రోడ్డు జంక్షన్, ఎన్టీఆర్ విగ్రహం, అంకమ్మ దేవాలయం, పోస్టాఫీసు సెంటర్ల మీదుగా ప్రత్యేక వాహనంలో నాగేశ్వరరావు, ఇతర టీడీపీ నేతలు ర్యాలీగా సబ్ కలెక్టరు కార్యాలయానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంకమ్మ ఆలయం, పెద్ద బజారులో ఉన్న కోదండరామాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, వినాయకుడి దేవాలయంలోను, కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో నాగేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్ద మసీదులో, జేడీబీఎం టౌన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీలో నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఒంగోలు విజయ డెయిరీ మాజీచైర్మన్ చల్లా శ్రీనివాసరావు, కందుకూరు మున్సిపల్ మాజీచైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, జనసేన నాయకులు పులి మల్లికార్జునతో పాటు నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఓపెన్‌టాప్ వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. నామినేషన్ సమయానికి సబ్ కలెక్టరు కార్యాలయం వద్దకు నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేరుకోగా ఆయనతో కలిసి నాగేశ్వరరావు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయనతోపాటు ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య కూడా మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమకుమారి, దామా మల్లేశ్వరరావు, రాచగల్లు సుబ్బారావు, పిడికిటి వెంకటేశ్వర్లు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, కండ్రా మాల్యాద్రి, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందు కందుకూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు ఇంటికి చేరుకున్న ఇంటూరి నాగేశ్వరరావు అక్కడ ఏర్పాటు చేసిన గుర్రంపై ఎక్కి అక్కడి నుంచి టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు.

యువతకు ఉపాధే లక్ష్యం : కందుకూరు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తానని, వ్యవసాయ రంగంలో సాగునీటి సమస్య పరిష్కారం, గిట్టుబాటు ధరలకోసం కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన నామినేషన్ దాఖలు చేసిన అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, జాబ్‌మేళాలు, రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పనకు కృషిచేస్తానన్నారు. రాళ్లపాడుకు సోమశిల జలాలు సక్రమంగా వచ్చేలా కృషి, రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనుల పూర్తికి, వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలకు సాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఉలవపాడు ప్రాంతంలో మామిడి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఉద్యాన కళాశాలకు చినలాటిరిపి వద్ద శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సబ్ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందచేస్తున్న ఇంటూరి, పక్కన వేమిరెడ్డి

కారును ఢీకొన్న బైక్

- యువకుడికి గాయాలు

కావలి రూరల్, ఏప్రిల్ 23: బైక్‌పై వేగంగా వచ్చి ముందు వెళ్తున్న కారును ఢీకొన్న ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని రాజువారి చింతలపాలెంకు చెందిన ప్రసన్న మంగళవారం పాఠశాల నుంచి తమ పిల్లలను తీసుకుని కారులో ఆర్సీపాలెం వెళుతూ పెద్దపవని రోడ్డు కూడలిలో స్పీడ్ బ్రేకర్ వద్ద కారు వేగం తగ్గించగా వెనుకనే వచ్చిన బైక్ అదుపుతప్పి ముందు ఉన్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో పట్టణంలోని మున్సిపల్ ఫ్లాట్లలో నివాసం ఉంటున్న వెంకటక్రిష్ణకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో పట్టణం లోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

కావలిలో 6వ రోజు 4 నామినేషన్ల దాఖలు

కావలి, ఏప్రిల్ 23: కావలి అసెంబ్లీకి ఆరవ రోజైన మంగళవారం నాలుగు నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనా నాయక్‌కు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా గర్రె సురేష్‌బాబు, గాలి రవి తమ నామినేషన్లు దాఖలు చేశారు. రాడికల్ పార్టీ ఇండియా తరుపున యెల్లు సాల్మన్ మూడో సెట్టు నామినేషన్‌ను, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున సబ్బెల విజయభాస్కర్ రెడ్డి రెండో సెటు నామినేషన్‌ను దాఖలు చేశారు.

పోలేరమ్మను దర్శించుకున్న వేమిరెడ్డి కోటారెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 23 : మండలంలోని నార్తుమోపూరు దళితవాడలో వెలసిన పోలేరమ్మను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. దళితవాడలో అమ్మవారికి పొంగళ్లు పెట్టి విశేష పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన స్థానిక నాయకులు రేబాల శంకర్‌రెడ్డి, బండి అమర్‌రెడ్డిలతో కలసి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సీలపరెడ్డి హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మావంతు ఎప్పుడబయా..!?

'ఈసారి ఎన్నికలు భలే రంజుగా ఉన్నాయిలే. డబ్బున్న పెద్ద పెద్దోళ్లంతా పోటీలో ఉండారు. ప్రధాన పార్టీలతోపాటు ఇండిపెండెంటోళ్లు కూడా డబ్బునోళ్లే. ఇంకేం మాకు జాతరే కదా! ఓటర్ల కన్నా ముందుగా మమ్మల్ని ప్రసన్నం చేసుకోవాలి. ఆ పక్కూరిలో నాయకుడికి రూ.2 లక్షలు.. ఇంకో ఆయనకు మూడు లక్షలు ఇచ్చా రంట. మరి మా వంతు ఎప్పుడు అబయా!?' పట్టణాల మొదలు పల్లెల దాకా ఇదీ వరస. మొన్నటిదాకా తమను పట్టించుకోలేదనే ధోరణిలో ఉన్నవారంతా 'ఇప్పుడేం మందల' అంటున్నారు. ప్రధాన పార్టీల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులంతా డబ్బున్నోళ్లతోపాటు అధికారం అడ్డంపెట్టుకుని సంపాదించిన వారే కదా ఎవరి కోసం ఇస్తారబ్బా. అలకలు పూనిన, కండువాలు మార్చుకున్నా భారీగా ప్యాకేజీలు వస్తాయని జోరుగా ప్రచారం జరుగుతుంటే మనకు ప్యాకేజీలు రావాలంటే ఏ కోణం ఎన్ను కోవాలనే మీమాంసలో ఉన్నారు. పెద్ద లీడర్ల నుంచి గల్లీ దాకా పార్టీ కండువాలు మార్చుకుంటుంటే ఎవరెవరికి ఎంతెంత వచ్చిందనే చర్చలు జోరుగా సాగు తున్నాయి. మరోవైపు ప్రధాన పార్టీల నేతలు కూడా ప్యాకేజీలు ఇస్తేనే ఎన్నికల ప్రచారంలో హుషారుగా ఉంటున్నారు. ప్యాకేజీ విషయంలో ఏమాత్రం తగ్గినా ససేమీరా అంటున్నారు. ఇప్పుడిదే హాట్‌టాపిక్‌గా మారింది.

- కావలి

వలస వాసుల ఓట్లే కీలకం !

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో వలసవాసుల ఓట్లే కీలకంగా మారారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 300పైచిలుకు గ్రామాల్లో వేలాదిమంది ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. వీరిపైనే అన్ని పార్టీల అభ్యర్థులు దృష్టిసారించారు. వలస వాసులు రెండురకాలు. ఆర్థికంగా బలంగా ఉంటూ ఇతర ప్రాంతాల్లో వ్యాపారాలు చేసేవారు, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ గుర్తింపు కలిగిన వారు కొందరైతే... పొట్టకూటి కోసం వెళ్లేవారు మరికొందరు. ఇతర పట్టణాల్లో నివసించే వారి సంఖ్య వేలల్లో ఉంది. వీరందర్ని సమీకరించుకోవాల్సిన బాధ్యత చోటా నాయకులపైనే ఉంది. వలసవాసులే ఈసారి ఎన్నికల్లో ఉదయగిరి అభ్యర్థుల భవిత్యాన్ని నిర్ణయించనున్నారు.

- ఉదయగిరి

ఇదీ మందలా





రంగుల కనికట్టు... ఓటర్లను ఆకట్టు !

- ప్రచారంలో ప్రత్యేకంగా కలర్స్
- ప్రజల్ని ఆకర్షించేందుకు వినూత్న ప్రయోగం
- రూ.లక్షలు వెచ్చిస్తున్న నేతలు
- చుక్కల్లో పూల ధరలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 : జిల్లాలో ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి. జాతీయ, ప్రాంతీయ పార్టీలతోపాటు ఇండిపెండెంట్‌లు కూడా బరిలో నిలిచారు. వీరంతా వినూత్నంగా ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. పార్టీల జెండాల రంగులు, రంగురంగుల టోపీలు, టీషర్ట్‌లు, మాస్కులతో అభిమానులు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రజలు కూడా ఆసక్తిగా వాటిని తిలకిస్తున్నారు. దీంతో రోడ్లన్నీ ఆయా పార్టీల రంగుల జెండాలతో నిండిపోయాయి. మరికొంద రైతే ఓటర్లను మరింత ఆకట్టుకునేందుకు ప్రచార వాహనాలకు ముందు రథాలు, గుర్రాలకు పార్టీ జెండాలు కట్టి, డప్పుల వాయిద్యాలతో ప్రచారానికి వెళుతున్నారు. ప్రచారాల నిర్వహణకు అభ్యర్థులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీంతో ప్రచార సామగ్రిని అందించే వ్యాపారులు, కార్మికులు కూడా ఎంతో ఉత్సాహంగా వాటిని విక్రయిస్తున్నారు.

జోరుగా ప్రచారం

వివిధ పార్టీల జెండాలు, అజెండాలతో ప్రచారాలు చేస్తుండడంతో జిల్లాలో కోలాహలంగా నెలకొంది. ప్రచార రథాలు, పార్టీ జెండాలు, పార్టీ గుర్తులుండే టోపీలు, టీషర్ట్‌లతోపాటు ఆయా పార్టీల మేనిఫెస్టోలను కరపత్రాల్లో పొందుపరిచి ఇంటింటి అందచేస్తున్నారు. ఇందుకుగాను అభ్యర్థులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తమ పార్టీలకు చెందిన రంగులు, గుర్తులుండేలా అన్నింటిని తయారు చేయించుకుంటున్నారు. వీటిని జిల్లాలో కొద్దిమంది మాత్రమే తయారు చేస్తున్నారు. అధికంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఆర్డర్‌లు ఇచ్చి చేయించుకుంటున్నారు. ఒక్కో టీషర్టు క్వాలిటీని బట్టి రూ.100 నుంచి రూ.500ల వరకు ఉండగా, టోపీ రేటు రూ.50ల నుంచి రూ.100ల వరకు ఉంది. పార్టీ జెండాలను సైజును బట్టి రూ.50ల నుంచి రూ.500లకు అందిస్తున్నారు. వీటిని ఆయా నేతలు వారి స్థాయి, హోదాలను బట్టి కొనుగోలు చేస్తున్నారు. జెండాలు మాత్రం ఒక్కసారి సిద్ధం చేసుకున్నవే వినియోగిస్తుండగా టీషర్ట్‌లు, టోపీలను మాత్రం ఎప్పటికప్పుడు కొత్తవాటిని తయారు చేయించుకుంటున్నారు. కరపత్రాలను కూడా ఒక్కో అభ్యర్థి రోజుకు 500 నుంచి వెయ్యి వరకు ముద్రించుకుంటున్నారని, వీటిని వారికి అందించేందుకు అధిక సమయం ప్రింటింగ్ ప్రెస్‌లో సమయాన్ని వెచ్చిస్తున్నామని ప్రింటర్ల నిర్వాహకులు చెపుతున్నారు. ఎన్నికల సమయం కాబట్టి వీటికి డిమాండ్ ఉండడంతో అభ్యర్థుల అవసరాలను బట్టి తమవద్ద ఉన్న మెటీరియల్స్‌ను అందచేస్తున్నా మని వారు తెలిపారు. ఇలా జిల్లావ్యాప్తంగా పార్టీల జెండాలు, టీషర్ట్‌లు, టోపీల వ్యాపారం రూ.కోట్లలో సాగుతున్నది. వీటిమీద ఆధారపడి జీవించే వర్కర్‌లకు కూడా పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తోంది.

చుక్కల్లో పూలధరలు

ఓవైపు ఎన్నికలు... మరోవైపు శుభకార్యాలతోపాటు మండుతున్న ఎండలతో పూల ధరలు చుక్కలనంటాయి.మార్కెట్‌లో పూలకు డిమాండ్ పెరిగింది.. పూలు, పూలదండలు, బొకేల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. మార్కెట్ కు వస్తున్న పూలన్నీ కూడా నేతల ప్రచారాలకే అమ్ముడవుతున్నాయి. మిగిలిన కార్యక్రమాలకు అంతంతమాత్రంగానే పూలు దొరుకుతున్నాయి.. ఒకవేళ దొరికినా అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఆలయాల్లో పూజలకు కూడా పూలు దొరకడం లేదని మహిళలు వాపోతున్నారు. మామూలు రోజుల్లో రూ.20 నుంచి రూ.30లకు దొరికే పూలు ప్రస్తుతం రూ.100లు ధర పలుకుతున్నాయి. దీనికి తోడు వేసవి ప్రారంభం కావడం, దిగుబడి తగ్గడం లాంటి పరిణామాలతో పూలకు బాగా డిమాండ్ ఏర్పడింది.





ముదివర్తి కాజ్‌వే నిర్మాణం ఆరు తీరప్రాంత మండలాల సమస్య. ఓవైపు ఆక్వా రైతులు, మరోవైపు మత్స్యకారులు, ఇంకోవైపు సామాన్య ప్రజలు... ఇలా ఎవరు ఏ పని మీద నెల్లూరుకు రాకపోకలు సాగించాలన్నా పెన్నానది దాటాల్సిందే. శారీరకంగా, మానసికంగా ఇది ప్రజలకు భారంగా మారింది. పెన్నాపై కాజ్‌వే నిర్మిస్తే ఈ సమస్య తీరుతుందని ఎప్పటి నుంచో తీరప్రాంతవాసులు కోరుతున్నారు.



ఐదేళ్లుగా టెండర్లతోనే..! మోసం గురూ!

ముదివర్తి కాజ్‌వేకు ముహూర్తం కుదిరేనా ?

అటకెక్కిన నిర్మాణ పనులు

శిలాఫలకంతో జగన్ డ్రామాలు

నెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వ హయాంలో దీనిపై కదలిక వచ్చింది. ప్రతిపాదనలు కూడా తయారయ్యాయి. అంతలోనే ఎన్నికలు రావడం, ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఇరిగేషన్ ఇంజనీర్లు పంపిన ప్రతిపాదనలకు అనుమతులు వచ్చేందుకు దాదాపు రెండేన్నరేళ్లు పట్టింది. అనంతరం ఏడాది తర్వాత సీఎం హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య కాజ్‌వే(బ్రిడ్జి) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఏడాదన్నర గడిచింది. కానీ నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జగన్ శంకుస్థాపన చేసే నాటికి కనీసం టెండర్లు కూడా పూర్తికాలేదు. తీర ప్రాంత ప్రజలను మోసం చేసేందుకే జగన్ కాజ్‌వే నిర్మాణానికి టెండర్లు పూర్తి కాకుండానే శంకుస్థాపన చేశారన్న ప్రచారం అనాడే జరిగింది. అనుకున్నట్లుగానే కాజ్‌వే నిర్మాణం ముందుకు సాగలేదు. ఆయన వేసిన శిలాఫలకం తీరప్రాంతవాసులను వెక్కిరిస్తున్నది. ఇదేనా జగనన్న మాటపై నిలబడడం అని ఒక వర్గం ప్రజలు నిలదీస్తుండగా.. మాట ఇవ్వడం.. మడమ తిప్పడం అన్నకు అలవాటేగా...! అని మరో వర్గం ఎద్దేవా చేస్తున్నది.

జాప్యం చేస్తూ వచ్చిన వైసీపీ

ఈ క్రమంలో గతేడాది ఏప్రిల్ నుంచి టెండర్లను ప్రారంభించారు. ఇప్పటివరకు ఐదు సార్లు టెండర్లు పిలిస్తే గానీ ఫైనలైజ్ కాలేదు. మొదటి నాలుగుసార్లు టెండర్లు పిలిచినప్పుడు ఒక కాల్‌లో కాంట్రాక్టర్లు టెండర్లు వేయకపోవడం, మరో కాల్‌లో సింగిల్ టెండర్ దాఖలవడం, ఇంకోసారి సాంకేతిక

రూ.97 కోట్లతో అంచనాలు

ఈ కాజ్‌వే నిర్మాణానికి 2004లోనే తొలిసారి ప్రతిపాదనలు తయారయ్యాయి. కానీ ఆ తర్వాత ముందుకు కదల్లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా కాజ్‌వే నిర్మాణానికి రూ.97 కోట్ల అంచనాతో ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రెండన్నరేళ్ల క్రితం రూ.93 కోట్లతో అనుమతులు మంజూరు చేసింది. అయితే మళ్లీ కొత్త డిజైన్ అంటూ కాజ్‌వే నిర్మాణాన్ని జాప్యం చేసింది. నెల్లూరు బ్యారేజీని ఏడు లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి వరకు డిజైన్ చేసిన క్రమంలో అదే స్థాయిలో ముదివర్తి కాజ్‌వేను కూడా నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అంచనా అంచనాలు పెరిగి రూ.184.85 కోట్లకు చేరుకుంది. ఈ మొత్తానికి మళ్లీ అనుమతులు కోరగా, మరింత ఆలస్యమైంది. ఇక చేసేది లేక అధికారులు కూడా మొదట అనుమతులు వచ్చిన రూ.97 కోట్లతోనే తొలి దశ పనులు మొదలుపెట్టాలని భావించారు.


అనుమతులతో టెండర్లు రద్దు చేశారు. గతేడాది చివరికి గానీ టెండర్లు పూర్తి కాలేదు. ఒక కాంట్రాక్టర్ ముందుకురాగా సీవోటీ అనుమతులు వచ్చేందుకు ఆలస్యమైంది. ఆ తదుపరి అగ్రిమెంట్ చేసుకునే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఎప్పుడో కాజ్‌వే నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా వైసీపీ ప్రభుత్వంలో అడుగడుగునా జాప్యం జరిగింది. ఈ కాజ్‌వేను పూర్తి చేసి తీర ప్రాంత ప్రజల కష్టాలు తీరుస్తామని జగన్ హామీ ఇచ్చారు. కానీ ఏళ్లు గడిచి మళ్లీ ఎన్నికలు కూడా వచ్చేశాయి. కాజ్‌వే మాత్రం పూర్తి కాలేదు.

ప్రచారానికీ పరిమితులున్నాయి.. !

మైకాసురా!

ఎన్నికల్లో పర్యావరణ చట్టాలు, నిబంధనలను నేతలంతా పాటించాలి. మైకుల గోలతో హోరెత్తిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. డీజే సౌండ్స్, పెద్ద పెద్ద స్పీకర్లతో గోల చేస్తే శబ్దకాలుష్యం కింద కేసులు పెడతామని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏయే ప్రాంతంలో ఎంత శబ్దం అనుమతిస్తారనే వివరాలు ఇలా ఉన్నాయి. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు జైలుశిక్ష పడే అవకాశముంది. ఆయా ప్రాంతాల్లో ఉండాల్సిన శబ్ద తీవ్రత. నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్, వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40 నుంచి 50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ మించి శబ్దం చేయరాదు.

- ఉదయగిరి రూరల్



తాంబూలమిచ్చి ఓట్లు అడిగేవారు.. !

మా రోజుల్లో

నాటి ఎన్నికల ప్రచారంలో ఇన్ని అర్భాటాలు ఉండేవి కావు. ఎమ్మెల్యే అభ్యర్థి హంగూఆర్భాటం లేకుండా గ్రామానికి వచ్చేవారు. కొంత మంది పెద్దలతో కలసి ఓటర్లకు తాంబూలం ఇచ్చి ఓటు అడిగేవారు. అందరికీ అందుబాటులో ఉండి, ప్రజలకు సేవ చేసే వారికే ప్రజలు అప్పట్లో ఓటు వేసేవారు. మా గ్రామంలో రెండు వర్గాలు ఉండేవి. ఒక్కో వర్గానికి ఒక్కో పెద్ద ఉండే వారు. ఆ పార్టీ పెద్ద చెప్పినట్లు ఆ వర్గం ఓటర్లంతా వినేవారు. పొరుగూర్లకు వెళ్లి ఓటేయాలంటే కొందరు ఎడ్ల బండిపై, మరికొందరు నడిచి వెళ్లేవారు.



- పాతూరు

పెంచలసుబ్బయ్య, చేజర్ల

ఇక్కడ ఓటర్లది విలక్షణ శైలి

వెంకయ్యకు రాజకీయ భిక్ష పెట్టింది ఉదయగిరే..

మైనార్టీవర్గం వ్యక్తిని గెలిపించిన ప్రాంతం

సెగ్మెంట్ మెట్ట.. రాజకీయాల్లో దిట్ట

ముఖ చిత్రం


ఉదయగిరి దుర్గం



ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 23 : జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతంగా ఉదయగిరి గుర్తింపు పొందింది. కరువు ఛాయలు ఎక్కువగా కనపడేది ఇక్కడే. అయితే ఓటర్లలో రాజకీయ చైతన్యం మాత్రం ఎక్కువే. ప్రతి ఎన్నికల్లోనూ సమస్యాత్మక నియోజకవర్గం కూడా ఇదే. ఫ్యాషన్ రాజకీయాలకు అలవాలం. 1952లో ఉదయగిరి నియోజకవర్గం ఏర్పడింది. 1955లో కొంత ప్రాంతాన్ని విభజించి నందిపాడు నియో జకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఉదయగిరి, నాగినేనిగుంట, వెలిగండ్ల ఉదయగిరిలోనూ, నందిపాడు, చినఅన్నలూరు, కనియంపాడుల తో నందిపాడు నియోజకవర్గం ఏర్పడింది. 1962 వరకూ ఇవి కొనసాగాయి. ఆ తరువాత నియోజక వర్గాల పునర్విభజనలో భాగంగా నందిపాడు ఉదయ గిరి, కావలిలో విలీనమైంది.

విలక్షణమైన ఓటర్లు

నియోజకవర్గ ఓటర్లు తొలి నుంచి విలక్షణశైలి చూపుతున్నారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో అప్పటి మద్రాసు రాష్ట్ర ఆర్థికమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డిని ఓడించారు. రాజకీయ అనుభవంలేని కోవి రామయ్యను ఆ ఎన్నికల్లో గెలిపించారు. 1955 ఎన్నికల్లో షేక్ మౌలానాసాహెబ్‌ను ఎన్నుకొన్నారు. జిల్లాలో ఆయనే తొలి మైనారిటీ ఎమ్మెల్యే. తరువాత ఏ నియోజకవర్గం లోనూ ఎన్నిక కాలేదు. 1978, 1983 ఎన్నికల్లో జనతా పార్టీ, బీజేపీల తరుపున పోటీ చేసిన వెంకయ్యనాయుడుకి పట్టం కట్టారు. ఆయన ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉదయగిరి రాజకీయ వేదికైంది. 1952లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా కోవి రామయ్యచౌదరి, 1955లో కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ మౌలానసాహెబ్, 1962లో కాం గ్రెస్ అభ్యర్థిగా పులి వెంకటరెడ్డి, 1967లో స్వతంత్ర పార్టీ అభ్య ర్థిగా ధనెంకుల నరసింహం, 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నెబోయిన చెంచురామయ్య, 1978, 1983లో జనతా, బీజేపీల తరుపున ఎం.వెంకయ్యనాయుడు, 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా మాదాల జానకిరాం, 1994లో ఇండిపెండెంట్‌గా, 1999లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి గెలుపొందారు. 2004, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012(ఉపఎన్నిక), 2019లో వైసీపీ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బొల్లినేని వెంకటరామారావులు గెలుపొందారు.



ఉదయగిరి నియోజకవర్గ మ్యాపు

తొలి ఎమ్మెల్యే ఖర్చు రూ.15 వేలు

ఉదయగిరి నుంచి కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థి కోవి రామయ్య ఎన్నికల ఖర్చు రూ.15 వేలు మాత్రమే. అప్పట్లో ఆయన తనకున్న 12.50 ఎకరాల మాగాణిని ఎకరం రూ.1000ల చొప్పున అమ్ముకొని ఎన్నికల్లో పోటీ చేసి బెజవాడ గోపాల్‌రెడ్డిపై విజయం సాధించారు.

మంత్రిగా ఒక్కరే..

ఉదయగిరిలో కాంగ్రెస్ పార్టీ తరుపున 1989లో తొలిసారిగా పోటీ చేసి గెలుపొందిన మాదాల జానకిరాం ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మంత్రివర్గంలో ఘనులు, భూగర్భజల శాఖా మంత్రిగా పనిచేశారు. ఉదయగిరి నుంచి ఇప్పటివరకు మంత్రి పదవి పొందింది జానకిరాం ఒక్కరు మాత్రమే.

నందిపాడు ఎమ్మెల్యేగా వింజమూరు వాసి

1955లో నందిపాడు నుంచి వింజమూరుకు చెందిన కాశిం వెంకటరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. 1955 నుంచి 1962 వరకు ఏడేళ్లపాటు ఆయన ఎమ్మెల్యేగా కొనసాగారు. 1962లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నందిపాడు ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో విలీనమైంది.

ఇప్పటి వరకు విజయం సాధించిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన వారు	పార్టీ పేరు
1952	కోవి రామయ్య	ప్రజాపార్టీ
1955	షేక్ మౌలానాసాహెబ్	కాంగ్రెస్
1962	పులి వెంకటరెడ్డి	కాంగ్రెస్
1967	దనెంకుల నరసింహం	ఇండిపెండెంట్
1972	పీ.చెంచురామయ్య	కాంగ్రెస్
1978	ఎం.వెంకయ్యనాయుడు	జనతా
1983	ఎం.వెంకయ్యనాయుడు	బీజేపీ
1985	మేకపాటి రాజమోహన్‌రెడ్డి	కాంగ్రెస్
1989	మాదాల జానకిరాం	కాంగ్రెస్
1994	కంభం విజయరామిరెడ్డి	ఇండిపెండెంట్
1999	కంభం విజయరామిరెడ్డి	టీడీపీ
2004	మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్
2009	మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్
2012	మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి	వైసీపీ
2014	బొల్లినేని వెంకటరామారావు	టీడీపీ
2019	మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి	వైసీపీ

ఉపాధి కల్పించేవారికే ఓటు

యువగళం



చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పార్టీకే నా ఓటు వేస్తా. ఉద్యోగాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు. రాష్ట్రంలోనే చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నేతలు కృషి చేయాలి.కొత్తగా ఓటు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకుడికే ఓటు వేస్తా.

- అడపా శ్రీజిత్ జాలయ్యనాయుడు, బీటెక్ మొదటి సంవత్సరం, లింగసముద్రం



నాలుగోసారి పోటీ చేస్తున్నా..

విక్రమార్కుడు...

కలిగిరి మండలం వీరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాపతి మధుసూదనరావు 2012 ఉపఎన్నికలతోపాటు 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా నాలుగోసారి బరిలో నిలుస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

- కలిగిరి

ఓయబ్బో... ఎంతప్రేమో ?

ఎట్టెట్టా





పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్ది ప్రజలపై నాయకులకు అభిమానం, ఆత్మీయతలు పెల్లుబికుతున్నాయి. వారు అభ్యర్థుల తరఫున గ్రామాల్లో ఇంటింటా ప్రచారం సాగిస్తూ సామాన్యులపై చూపిస్తున్న ఆప్యాయత, అనురాగాలను చూసి పలువురు అవాక్కువతున్నారు. అన్నా.. అక్కా.... బావా, బాబాయ్... తాత, అవ్వా.. అంటూ సంబంధాలను కలుపుతూ నేతలు ఓటర్లను పిలవడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. మామీద మీకు ఇంత ప్రేమ ఉందా?.. అని ప్రజలు విస్తుపోతున్నారు. వారి నాటకాలకు అనుగుణంగా సామాన్యులు కూడా ఏమాత్రం తగ్గకుండా అదే ఆప్యాయతను కనబరుస్తున్నారు. అన్నా.. మేం కూడా మీవాళ్లమే.. మాఇంట్లో ఓటన్నీ మీకు... అంటూ చెప్పిపంపుతున్నారు. కాగా ఇప్పటికే నాయకులు కులాలు, వృత్తులు, సంఘాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఆయా వర్గాల సమస్యలపై కూడా హామీలు గుప్పించారు. ఎన్నికలా.. మజాకా!

- అనంతసాగరం